www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 349

శుక్రవారం | 3-4-2020
పేజీలు: 8 + 4
శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 12.59 వరకు తదుపరి ఏకాదశి; నక్షత్రం: పుష్యమి సా. 5.41 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.8.39-9.28, మ.12.44-1.32; అమృతఘడియలు: మ.12.29-2.02; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 6.26

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



## ఉల్లంఘించి బయటకు వస్తే
# రెండేళ్ల జైలు

దుష్ప్రచారం చేస్తే
జైలుతోపాటు జరిమానా
కేసులు నమోదు చేయాలని
రాష్ట్రాలకు కేంద్రం లేఖ



యావత్ జాతిని కలవరపరుస్తున్న కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి సమష్టిగా, సమర్థంగా పనిచేయడం ప్రశంసనీయం. రాజకీయాలకు అతీతంగా ఈ మహమ్మారిపై యుద్ధం చేద్దాం. మనం తీసుకున్న ముందస్తు జాగ్రత్త, వైద్య నిర్వహణ చర్యలతో అతి తక్కువ ప్రాణ నష్టంతో బయటపడటమే మన ముందున్న ప్రధాన లక్ష్యం.

- ప్రధాని మోదీ

# దశలవారీగా..
## లాక్‌డౌన్ ఎత్తివేతపై ప్రధాని మోదీ

- ప్రజలు ఒకేసారి రోడ్లపైకి రాకుండా చూడాలి.. తర్వాత కూడా భౌతిక దూరం పాటించాలి
- కొన్ని దేశాల్లో రెండోసారి కరోనా వస్తుందంటున్నారు.. తక్కువ ప్రాణనష్టంతో బయటపడటమే లక్ష్యం
- మర్కజ్‌లో బయటపడిన కరోనా కేసులపై ఆరా.. పోరులో మత నాయకులు, సంఘాల భాగస్వామ్యం
- ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్.. లాక్‌డౌన్ నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నారు
- మోదీకి ముఖ్యమంత్రుల ప్రశంస.. నేడు ఉదయం 9 గంటలకు మోదీ వీడియో సందేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్‌ను దశల వారీగా ఉపసంహరించాలని, దానికి ఉమ్మడి వ్యూహం రూపొందించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజలంతా ఒకేసారి రోడ్లపైకి చొచ్చుకురాకుండా దఫదఫాలుగా వచ్చేట్లు చూడాలని చెప్పారు. దీనిపై లోతుగా ఆలోచించి సూచనలు పంపాలని ముఖ్యమంత్రులను కోరారు. కరోనా వైరస్ నియంత్రణకు వచ్చే కొద్ది వారాల్లో వైద్య పరీక్షలు, బాధితుల గుర్తింపు, ఐసొలేషన్, క్వారంటైన్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. హాట్‌స్పాట్‌లను గుర్తించి వైరస్ వ్యాప్తి చెందకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని చెప్పారు. లాక్‌డౌన్

మిగతా 8వ పేజీలో...

# కొత్తగా 38

## రాష్ట్రానికి 'ఢిల్లీ'దెబ్బ

- తాజా కేసులన్నింటికీ అక్కడే లింకు
- రాష్ట్రంలో 149కి చేరిన కరోనా బాధితులు
- నెల్లూరులో ఒక్కరోజే 21 మందికి పాజిటివ్
- కృష్ణాలో 8, చిత్తూరులో 3, ప్రకాశంలో 2, కడపలో 3, 'పశ్చిమ'లో ఒకరికి నిర్ధారణ
- విజయవాడలో ఒకే కుటుంబంలో ఏడుగురికి



విజయవాడలో కరోనా వ్యాప్తి నిరోధక మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)
రాష్ట్రానికి 'ఢిల్లీ' దెబ్బ గట్టిగానే పడింది. తాజాగా ఇక్కడ నమోదవుతున్న కరోనా కేసులన్నీ దేశ రాజధానితో ముడిపడి ఉంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మొత్తం 38 కేసులు నమోదయ్యాయి. దీంతో ఏపీలో వైరస్ బారిన పడినవారి సంఖ్య 149కి పెరిగింది. రాష్ట్రంలో తొలి పాజిటివ్ కేసు నెల్లూరులో నమోదైన తర్వాత అక్కడ కేసుల సంఖ్య పెద్దగా పెరగలేదు. బుధవారం రాత్రి వరకూ ఈ జిల్లాలో 3 కేసులు మాత్రమే ఉన్నాయి. కానీ గురువారం ఒక్కరోజే 21 కొత్త కేసులు నమోదవడంతో ఇక్కడ బాధితుల సంఖ్య 24కి పెరిగింది. తాజాగా పాజిటివ్ నిర్ధారణ అయిన వారందరూ ఢిల్లీ

మిగతా 7వ పేజీలో...

## తబ్లిఘీ తక్లీఫ్!

- 9 వేల మంది తబ్లీఘీల స్వీయ నిర్బంధం
- వీరిలో 1306 మంది విదేశీయులు
- ఒక్క ఢిల్లీలోనే 2 వేల మంది క్వారంటైన్
- పరీక్షల దశలో మరో 8 వేల మంది
- బ్లాక్‌లిస్ట్‌లో 960 మంది విదేశీయులు
- వైరస్ కేసుల్లో తబ్లీఘీలే ఎక్కువ: కేంద్రం

## క్వారంటైన్ కండి..
అది ఇస్లామ్‌కు వ్యతిరేకం కాదు: తబ్లీఘీ చీఫ్

## ఒక్కరోజే 400కు పైగా కేసులు
### కొవిడ్-19తో దేశవ్యాప్తంగా 73 మంది మృత్యువాత

- గురువారం నమోదైన కేసుల్లో ఎక్కువ భాగం.. మర్కజ్ మతప్రార్థనలకు హాజరైనవారివే!
- 50 మంది వైద్యనిపుణులకూ పాజిటివ్.. దేశవ్యాప్తంగా 20 హాట్‌స్పాట్లు గుర్తింపు
- బతుకు 'బండి' లాక్ డౌన్.. బాపట్లలో చెట్టుకు యువకుడి ఉరి



## రాష్ట్రంలో వైద్యులకేదీ రక్షణ!

- పీపీఈల్లేవు.. డిస్పోజబుల్ గౌన్లే.. ఈఎన్‌టీలకే ఎన్-95 మాస్కులు
- గట్టిగా అడిగితే సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారుల బెదిరింపు!



ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం జగన్

- కరోనా నివారణకు ఆకస్మిక ఖర్చులు
- దీంతో ఖజానా ఖాళీ అయింది
- ఉద్యోగులకు 2 విడతలుగా జీతాలిస్తున్నాం
- రాష్ట్రాన్ని ఇతోధికంగా ఆదుకోండి
- మెడికల్ టెస్ట్ కిట్లు పంపిణీ చేయండి
- ప్రధానికి ముఖ్యమంత్రి జగన్ వినతి
- పాజిటివ్ కేసుల్లో అత్యధికం 'జమాత్'వే
- వైరస్ కట్టడికి దిశానిర్దేశం చేయండి
- లాక్‌డౌన్‌ను పటిష్ఠంగా అమలు చేస్తున్నాం
- నిత్యావసరాల ధరలు నియంత్రించాం: సీఎం

# దయతో ఆదుకోండి
## ప్రధాని మోదీకి సీఎం జగన్ విన్నపం

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరోనా నివారణకు అకస్మాత్తుగా వ్యయం చేయాల్సి రావడంతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని.. ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేందుకూ ఇబ్బందులు తలెత్తాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. దయార్ద్ర హృదయంతో తమను ఆదుకోవాలని ప్రధాని మోదీని అభ్యర్థించారు. రాష్ట్రానికి నిరంతరం మార్గదర్శనం చేస్తూ కరోనా నివారణకు దశాదిశా చూపాలని.. ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కరోనా నిరోధానికి అవసరమైన వైద్య పరికరాలను విరివిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ.. స్వచ్ఛందంగా రెండు వాయిదాల్లో 50 శాతం చొప్పున జీతాలను తీసుకునేందుకు అంగీకరించారన్నారు. లాక్‌డౌన్ అమలు, కరోనా కట్టడిపై రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో

మిగతా 8వ పేజీలో...

## పది నెలలకే బీద అరుపులా!

- ఈ ఏడాది 30 వేల కోట్లు అదనం
- ఇదిగో పెరిగిన నిధులకు లెక్కలు
- 14వ ఆర్థిక సంఘం సొమ్మెక్కడ?
- చేతిలో డబ్బున్నా రైతులు పట్టరా?
- పంటలు కొనకుండా కష్టపెడతారా?
- వారం కట్టడికే ఖజానా ఖాళీయా?
- ఉద్యోగుల జీతం, పెన్షన్లకే కోతలా?
- నాడు విభజన కష్టాలు ఎన్ని ఉన్నా
- మేం ఎన్నడయినా ఇలా చేశామా?
- ముఖ్యమంత్రికి టీడీపీ బహిరంగ లేఖ



భద్రాద్రిలో కల్యాణ వేదికపై సీతారామచంద్రమూర్తులు

## వంద మందిలోపు అతిథులతో భద్రాద్రి
# రామయ్య పెళ్లి

- నిరాడంబరంగా సీతారాముల కల్యాణం
- భక్తులు దూరం..
- టీవీల ద్వారా వీక్షణ



ఒంటిమిట్టలో శ్రీరామనవమి (బ్రహ్మోత్సవాలు)

## లాక్.. డౌన్

- ఆంక్షలపై వింత ఉత్తర్వులు
- సాయంత్రం 4 దాకా బ్యాంకులు
- రెండు విడతల్లో రేషన్ పంపిణీ
- ఆఫీసులకు రావాల్సిందేనంటున్న కొన్ని ప్రభుత్వ శాఖలు
- వర్షాల పేరిట ఇసుక తవ్వకాలు
- ఇది జనాన్ని రోడ్లపైకి రమ్మనడమే!



## కోర్టు తప్పుబట్టినా ముందుకే!

- అమరావతిలో రాజధానేతర పేదలకు ప్లాట్లు
- సుప్రీంకు వెళ్తామంటూనే, పాత జీవోకు సవరణ
- ప్రత్యేక కేసుగా పరిగణించాలని ఆదేశం
- ఇతర ప్రాంతాల పేదలకు స్థలాలివ్వాలని నిర్దేశం
- మాస్టర్ ప్లాన్‌లో మార్పులకు అనుమతి

# భయం 'కరోనా'

## అగ్రరాజ్యం అమెరికాలో విరుచుకుపడుతున్న వైరస్

- 5 వేలు దాటిన మృతుల సంఖ్య
- ఒక్క రోజు వ్యవధిలో 900 మందిపైగా బలి!
- ప్రజల ఉపాధికి భారీగా గండి
- నిరుద్యోగ భృతికి 10 లక్షల మంది దరఖాస్తు

వాషింగ్టన్, ఏప్రిల్ 2: అగ్రరాజ్యం అమెరికాలో కరోనా మృత్యు విలయం సృష్టిస్తోంది. ఓవైపు రోజురోజుకు వేల కొద్దీ కేసులు నమోదవుతుంటే.. వందలకొద్దీ ప్రజలు వైరస్‌తో మరణిస్తున్నారు. ఒక్క రోజు వ్యవధిలోనే 950 మందిపైగా చనిపోవడంతో.. గురువారంతో ఆ దేశంలో మరణాల సంఖ్య 5 వేలు దాటింది. ఇటలీ, స్పెయిన్ తర్వాత 5 వేల మంది చనిపోయిన దేశం అమెరికానే. మార్చి నెల సెలవులను బీచ్‌లు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆస్వాదించిన ప్రజల్లో క్రమంగా కరోనా లక్షణాలు కనిపిస్తున్నాయి. మెక్సికో వెళ్లొచ్చిన టెక్సాస్ వర్సిటీ విద్యార్థులు 44 మంది ఇలానే వైరస్ బారినపడ్డారు. మరోవైపు కరోనా కారణంగా లక్షల మంది ఉపాధి గల్లంతవుతోంది. వీరంతా అసంఘటిత రంగంలోని వారే. కనీసం ఇంటి అద్దెలు కట్టలేని స్థితిలో వీధిన పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి కోసం ఇప్పటికే 10 లక్షల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారంటేనే అమెరికాలోని పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు దేశంలో రోగులు

మిగతా 8వ పేజీలో...



అమెరికాలోని డెట్రాయిట్‌లో వెయ్యి పడకలతో సిద్ధమవుతున్న ఆస్పత్రి

## కరోనా @ మిలియన్

- వైరస్ బాధితుల్లో 5 లక్షల మందికిపైగా యూరప్‌వారే
- ప్రపంచవ్యాప్తంగా 51 వేలు దాటిన మృతుల సంఖ్య
- ఇటలీ, స్పెయిన్ దేశాల్లో కొవిడ్-19 మరణ మృదంగం
- గురువారం ఒక్కరోజే ఇటలీలో 760 మంది మృతి
- స్పెయిన్‌లో 709 మంది.. బ్రిటన్‌లో 569 మంది బలి
- యూరప్ మృతుల్లో 90 శాతం వృద్ధులే: డబ్ల్యూహెచ్‌వో

ఇజ్రాయెల్ ఆరోగ్య మంత్రికి సోకిన కొవిడ్-19



పరంజ్యోతి

# విష్ణురూపాయ.. నమశ్శివాయ



ప్రపంచమంతా పరమాత్మ స్వరూపం. అది అలౌకికమనే ఆనందదీపం. లౌకిక దృష్టితో పరిశీలిస్తే పరమాత్మ అనే పరబ్రహ్మ స్వరూపం అవనిలో అనేక రూపాలతో కనిపిస్తోంది. పునీతంగా పూజలందుకుంటోంది. అందువల్ల మానవులలో కొందరు ద్వైత భావాన్ని అనుసరిస్తూ ఆత్మ నిజ స్థితిని తెలుసుకోలేకపోతున్నారు. ఆ లోపాన్ని సరిచేయడానికే అద్వైత సిద్ధాంతం ప్రతిపాదింపబడింది.

*శ్రీయన గౌరి నాఁబరగు చెల్వకుఁ జిత్తము పల్లవింప, భద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూపాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్*

"లక్ష్మీదేవిగా గౌరిమాతగా భక్తులను కటాక్షించే ఆదిమాత మనస్సు రంజించే విధంగా హరిహర రూపాన్ని ధరించి 'విష్ణు రూపా! శివస్వరూపా!' అని వేదాంతవేత్తలచే కొనియాడబడే పరతత్వాన్ని నా భారత రచనాసిద్ధికై కొల్చెదను" అంటూ తిక్కన కవీంద్రుడు రచించిన పద్యమిది. హరిహరులకు అభేదం చూపుతూ ఆ మహాకవి అనుసరించిన అద్వైత మార్గం లోకశాంతిని ప్రతిబింబింపజేసే మతసామరస్యానికి, ఆధ్యాత్మిక భావ అభివృద్ధికి శాశ్వతస్థానాన్ని సంతరింపజేసింది.

*శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే*
*శివశ్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః*

అనే ఉపనిషత్ శ్లోకం హరిహరుల అభేదానికి, మానవ సమాజ సమైక్యస్థితికి, ఆత్మజ్ఞానవేత్తల ఆనందామృతానికి దోహదకారి అవుతోంది. శివునిలో విష్ణువు ఉన్నాడని, విష్ణువులో శివుడున్నాడని వారి హృదయాలు ఒకటేనని ఈ శ్లోకం రూఢిగా తెలుపుతోంది. అయినప్పటికీ అవగాహనలోపం వల్లనో, అమాయకత్వం వల్లనో కొందరు అద్వైత తత్వ లక్ష్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. శిరసావహించలేకపోతున్నారు. వారి అమాయకత్వమనే జాడ్యాన్ని అద్వైత జ్ఞానబోధ అనే ఔషధంతో రూపుమాపాలి. అది సనాతన భారతీయ సంస్కృతి ధర్మంగా పరిగణించాలి. భగవద్గీత ప్రబోధంలో కృష్ణపరమాత్మ "రుద్రాణాం శంకరశ్చాస్మి" అనే శ్లోకంలో.. 'ఏకాదశ రుద్రులలో శంకరుణ్ణి నేనే' అన్నాడు. అలాగే, గీతలో మరొక సందర్భంలో "ఈశ్వరః సర్వభూతానాం" అనే శ్లోకంలో పరమేశ్వరుడు తన మాయ చేత వారివారి కర్మలనుబట్టి వారిని భ్రమింపచేయుచున్నాడన్నాడు. ఇందులో కూడా సర్వాంతర్యామి అయిన కృష్ణ భగవానుడే సర్వభూతాంతరాత్మ అయిన పరమేశ్వరుడని చెప్పడంలో.. విష్ణువుకు శివునికి ఏకత్వం సిద్ధింపబడుతూ ఉంది. పరమ భాగవతోత్తముడైన పోతనామాత్యుడు భాగవతంలో హరి, విష్ణువు, పరమేశ్వరుడు, ఈశ్వరుడు అనే పదాలను వివిధ సందర్భాలలో పర్యాయ పదాలుగా ప్రయోగించి పరమాత్మతత్వం ఒకటేనని నిరూపించాడు.

**- వల్లూరు చిన్నయ్య, 9948348918**

# తబ్లిఘీ తక్లీఫ్!

- 9 వేల మంది తబ్లిఘీల స్వీయ నిర్బంధం
- బ్లాక్‌లిస్ట్‌లో 960 మంది విదేశీయులు
- 9 మంది మతపెద్దలపై యూపీలో కేసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఢిల్లీలో మార్చి 13-15 మధ్య జరిగిన ఇస్లామిక్ సమ్మేళనం- తబ్లిఘీ జమాత్‌కు హాజరైన వారి కోసం కేంద్రం దేశమంతటా జల్లెడ పడుతోంది. ఇప్పటిదాకా దీనికి హాజరైన సభ్యులతో పాటు వారితో కలిసి తిరిగిన, వారు కాంటాక్ట్ చేసిన సుమారు 9000 పైచిలుకు మందిని స్వీయ-నిర్బంధంలోకి పంపామని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. వీరిలో 1306 మంది విదేశీయులే కావడం విశేషం. 'ఈ సంఖ్య 9 వేలతో ఆగదు. ఆ సమావేశానికి వెళ్లొచ్చిన వారితో కలిసిన ఎందరో ఇంకా ఉండే ఉంటారు. వారిని అన్వేషిస్తున్నాం. ఒక్క ఢిల్లీలోనే 2000 మందిని క్వారంటైన్ చేశాం. వీరిలో 250 మంది విదేశీయులు. వైరస్ లక్షణాలు ఎక్కువగా ఉన్న 334 మందిని ఆసుపత్రుల్లో చేర్చాం" అని హోంశాఖ సంయుక్త కార్యదర్శి పున్యా సలీలా శ్రీవాస్తవ చెప్పారు. వీరు తిరిగిన అనేక ప్రదేశాల్లోని 8000 మందికి ఇపుడు పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఎంతమందికి పాజిటివ్ అని రిపోర్టు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కరోనా పాజిటివ్ అని తేలిన 400 మంది నిజాముదీన్ మర్కజ్‌కు హాజరైన వారేనని అటు వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రకటించింది. తమిళనాడులో వైరస్ లక్షణాలున్న దాదాపు 173 మందిలో అత్యధికులు నిజాముదీన్ మర్కజ్‌తో సంబంధం ఉన్నవారేనని, ఈ సమావేశానికి హాజరై వివిధ రాష్ట్రాలకు తరలిపోయిన వారందరి స్నేహితులు, బంధువులు, ఆఫీసు సిబ్బంది, సహచరుల కోసం వెతుకులాట సాగుతోందని వైద్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ బుధవారం నాడు తెలిపారు. కాగా, దేశంలో ఉన్న సుమారు 960 మంది విదేశీ తబ్లిఘీలను కేంద్రం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. వీరంతా టూరిస్ట్ వీసాలపై వచ్చినవారు. ఇలా వచ్చినవారు మత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. వీసా రూల్స్‌ను ఉల్లంఘించిన వీరందరిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఢిల్లీతో పాటు వివిధ రాష్ట్రాల పోలీస్ అధికారులను ఆదేశించారు. 'వారు ఎక్కడ ఉన్నా పిలిపించండి. విదేశీయుల చట్టం, విపత్తు నిర్వహణ చట్టం కింద కేసులు పెట్టండి' అని హోంశాఖ మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. లాక్‌డౌన్ విధించాక కూడా నిజాముదీన్ దర్గాలో 2300 మంది ఒకేచోట ఆవాసం ఉండడం, వారిలో 250 మంది విదేశీయులు కావడం వివాదం రేపింది. ఈ 2300 మందిలో 300 మందికి వైరస్ పాజిటివ్ అని తేలింది. దేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసుల్లో 450 కేసులు, 12 మరణాలు నిజాముదీన్ సమావేశంతో లింకులున్నవి కావడంతో ఈ దేశవ్యాప్త వేట మొదలైంది.



నిజాముద్దీన్‌లోని తబ్లిఘీ మర్కజ్‌లో కరోనాను నిరోధించే రసాయనాలు చల్లుతున్న సిబ్బంది

### 15 దేశాల నుంచి ప్రతినిధులు

మర్కజ్‌కు హాజరైన వారిలో 15 దేశాలకు చెందిన వారున్నట్లు హోంశాఖ అంచనా. వీరిలో ఇద్దరు అమెరికన్లు, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, ట్యునీషియాల నుంచి ఒక్కొక్కరు, ఇండోనేషియా నుంచి 172 మంది, కిర్గిస్థాన్ (36), బంగ్లాదేశ్ (21), మలేషియా (12), అల్జీరియా (7), అఫ్గానిస్థాన్ (2), ఇరాన్, సౌదీ అరేబియాల నుంచి మిగిలినవారు హాజరైనట్లు హోంశాఖ తేల్చింది. ఈ 1306 మందిలో ఎక్కువ మంది (250) ఢిల్లీలో దొరకగా, ఉత్తరప్రదేశ్‌కు 247 మంది, మహారాష్ట్ర- 154, తమిళనాడు-133, తెలంగాణ-96, హరియాణా-86, బెంగాల్-70, మధ్యప్రదేశ్-59, జార్ఖండ్-38, ఆంధ్రప్రదేశ్-24, ఉత్తరాఖండ్-12, కర్ణాటక-24, ఒడిషా-7, రాజస్థాన్-5, పంజాబ్-3 లకు వెళ్లినట్లు తెలిపింది. వీరిలో కర్ణాటక, పంజాబ్‌లకు వెళ్లిన 27 మంది స్వదేశాలకు వెళ్లిపోయినట్లు కూడా వెల్లడించింది. వీరి ద్వారా ఎవరెవరికి వైరస్ సోకిందన్నది ఆరా తీస్తున్నారు.

### క్వారంటైన్ ఇస్లాంకు వ్యతిరేకం కాదు

అజ్ఞాతంలో ఉన్న -ఢిల్లీ సమావేశ ప్రధాన నిర్వాహకుడు, తబ్లిఘీ జమాత్ చీఫ్ మౌలానా సాద్ ఖాంధ్లావీ ... తాను కూడా స్వీయ నిర్బంధంలోనే ఉన్నట్లు తెలిపారు. ఆయనపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైంది. 'మీరు ఎక్కడున్నా సరే, ఏకాంతంలోకి వెళ్లండి. ఎవరినీ కలవకండి. క్వారంటైన్ కావడం ఇస్లామ్‌కు, షరియాకు వ్యతిరేకం కాదు. ప్రభుత్వం చెప్పినట్లు, చట్ట ప్రకారం నడుచుకోవాలి' అని బుధవారం నాడు తబ్లిఘీ జమాత్ యూట్యూబ్ చానెల్ ద్వారా ఆయన పేరిట, ఆయన గళమని చెప్పే విడుదల అయిన ఓ ఆడియో సందేశంలో ఉంది. మసీదులు ఖాళీ చేయవద్దని, లాక్‌డౌన్ ధిక్కరించండని ఆయన గతంలో పిలుపిచ్చినట్లు వార్తలొచాయి. తాజా ఆడియో సందేశం ఆయన యూ టర్న్ తీసుకున్నట్లు వివరిస్తోంది. 'మానవాళి చేసిన పాపాల వల్లే ఈ కరోనా వైరస్ వచ్చింది. అల్లా మానవాళిపై ఆగ్రహంగా ఉన్నారు' అని ఆయన అన్నట్లు ఆ ఆడియోలో ఉంది. ఖాంధ్లావీ ఆచూకీ కోసం ఢిల్లీ పోలీసులు గాలిస్తున్నారు.

# మేడిన్ మలేషియా!

- నిజాముద్దీన్ భేటీకి ముందే

**కౌలాలంపూర్‌లో జమాత్ భారీ సమావేశం**

కౌలాలంపూర్, ఏప్రిల్ 2: నిజాముద్దీన్‌లో జమాత్ జరగడానికి ముందు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఓ భారీ సమావేశం జరిగింది. ప్రపంచం నలుమూలల నుంచీ 16వేల మంది దీనికి హాజరయ్యారు. అనేక ఆగ్నేయాసియా దేశాల నుంచి 1500 మంది ఇందులో పాల్గొన్నారు. ఫిబ్రవరి 27-మార్చి 1 మధ్య జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న అనేక మందికి తెలియదు... తాము ఓ ప్రాణాంతక వైరస్ బారిన పడ్డామని, పడుతున్నామనీ! దీనిని నిర్వహించినది కూడా తబ్లిగీ జమాతే సంస్థే. కౌలాలంపూర్ శివార్లలో స్వర్ణ గుమ్మటంతో కూడిన ఓ పెద్ద మసీదు ఉంది. వేల మంది ఆ మసీదులో ఉండడానికి స్థలం చాలదు కాబట్టి వందల సంఖ్యలో డెలిగేట్లు బయట తాత్కాలికంగా ఏర్పాటుచేసిన టెంట్లలో బసచేశారు. ఈ సమావేశంలో అందరూ ఒకరినొకరు తాకుతూనే కూర్చునేవారు. ప్రార్థనలు చేసేవారు. కలిసి భోజనం చేయడం, పదార్థాలను షేర్ చేసుకోవడం కూడా జరిగాయి. ఈ సమావేశానికి వెళ్లొచ్చిన వారిలో ఓ 34-ఏళ్ల మలేషియా వాసి మార్చి 17న చనిపోయాడు. ఒక్క మలేషియాలోనే 673 పాజిటివ్ కేసులుండగా అందులో రెండొంతుల మందికి ఈ మసీదు సమావేశంతో లింకున్నట్లు తేలింది. దీంతో మలేషియా ప్రభుత్వం అప్రమత్తమైంది. సరిహద్దులు మూసేసింది. ఈ మసీదు సమ్మేళనంలో పాల్గొన్న అనేకమందిని క్వారంటైన్ చేసింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో అనేక మంది భారతీయులు కూడా ఉన్నారని తెలుస్తోంది. తబ్లిగీ ప్రధాన కార్యాలయం భారత్‌లోనే ఉండడంతో సహజంగానే న్యూఢిల్లీ, యూపీ, తమిళనాడు, బెంగాల్ నుంచి అనేకమంది అక్కడకు వెళ్లినట్లు సమాచారం. వైరస్ ప్రబలంగా వ్యాపించిన చైనా, దక్షిణ కొరియాల నుంచి కూడా ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. వీరిలో ఎవరికి వైరస్ ఉందో ఎవరికీ తెలియదు. ఇండోనేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, వియత్నాం, కంబోడియా, సింగపూర్, బ్రూనై సహా అనేక దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల్లో వైరస్ ప్రస్తుత వ్యాప్తికి ఈ సమావేశమే కారణమన్నది కొన్ని ప్రభుత్వాల అంచనా. 'మత సమావేశాల్లో ఒకరి చేతులు మరొకరు పట్టుకోవడం సర్వసాధారణం. మేమంతా అలానే చేశాం. కలిసి భోజనం చేశాం. పక్కపక్కనే నిద్రించాం' అని కంబోడియాకు చెందిన ఓ ప్రతినిధి చెప్పారు. ఐరోపా దేశాల నుంచి కూడా ప్రతినిధులు దీనికి హాజరైనట్లు తెలుస్తోంది.

## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| శ్రీకాకుళం | 35.0 | 25.0 |
| హైదరాబాద్ | 38.2 | 24.1 |
| విశాఖపట్నం | 37.0 | 25.4 |
| గుంటూరు | 37.8 | 25.1 |
| విజయవాడ | 38.5 | 25.5 |
| కర్నూలు | 41.1 | 28.2 |



### కేంద్రం రూ.5-6 లక్షల కోట్ల ఉద్దీపన ప్రకటించాలి

కరోనా పై పోరాటానికి మోదీ ప్రభుత్వం రూ.5-6 లక్షల కోట్లతో ఉద్దీపనలను ప్రకటించాలి. వివిధ వర్గాలకు ఆర్థిక సహకారానికి ప్లాన్-1ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించి 9 రోజులైంది. ఇప్పటికీ ప్లాన్-2ను ప్రకటించలేదు.

- పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత



### ప్రభుత్వ సూచన పాటించండి.. క్వారంటైన్‌కు వెళ్లండి

కరోనా ఉధృతరూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రార్థనా స్థలాల్లో గుమిగూడి గందరగోళానికి కారకులు కాకూడదు. వైరస్ ఇతరులకు వ్యాపించడంలో మీరు వాహకులు కాకుండా జాగ్రత పడండి. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ కొన్ని వారాల పాటు క్వారంటైన్, ఐసోలేషన్‌కు వెళ్లండి.

- ఏఆర్ రెహ్మాన్, సంగీత విద్వాంసుడు

## రాజ్యసభ సభ్యుల ప్రమాణాలు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారాలను రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వాయిదా వేశారు. లాక్‌డౌన్ వల్ల దేశవ్యాప్తంగా ప్రయాణాలు నిలిచిపోయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజ్యసభ సచివాలయం పేర్కొంది. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నుంచే జీత భత్యాల చెల్లింపులు ఉంటాయని వివరించింది.

## అలర్ట్.. కరోనా రోగికి దగ్గరగా ఉన్నారు

- అప్రమత్తం చేసే ఆరోగ్యసేతు యాప్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరోనా సోకిన వ్యక్తికి దగ్గరగా వెళ్తే వెంటనే అప్రమత్తం చేసే 'ఆరోగ్య సేతు' అనే ఒక యాప్‌ను కేంద్రం రూపొందించింది. ఇది ఎడ్జ్, బ్లూటూత్ టెక్నాలజీ, అల్గారిథంలు, కృత్రిమ మేధ ఆధారంగా పని చేస్తుంది. దీనిని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే.. కరోనా సోకిన రోగికి సమీపానికి వెళ్లిన వెంటనే హెచ్చరిస్తుంది. అయితే, తాజాగా నమోదైన పాజిటివ్ కేసుల్లో మాత్రమే ఇది పని చేస్తుంది.

## లాక్‌డౌన్‌లో పెరిగిన గృహ హింస!

లాక్‌డౌన్ నేపథ్యంలో దేశంలో గృహ హింస కేసులు పెరుగుతున్నాయి. లాక్‌డౌన్ విధించిన తరువాత జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ)కు అందిన 250 ఫిర్యాదులలో 69 గృహ హింసకు సంబంధించినవే ఉన్నాయి. ఈ విషయాన్ని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ వెల్లడించారు.

## జూమ్ యాప్‌తో హ్యాకింగ్ బెడద

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: దిగ్గజ వీడియో కాన్ఫరెన్స్ యాప్ 'జూమ్'తో హ్యాకింగ్ ముప్పు పొంచి ఉందని భారత ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ సంస్థ సెర్ట్ (కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం) హెచ్చరించింది. ఈ యాప్‌లో ఉన్న కొన్ని లొసుగులను హ్యాకర్లు అనుకూలంగా మార్చుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. దీనివల్ల సున్నితమైన సమాచారం హ్యాకర్ల చేతికి చిక్కే ప్రమాదముందని హెచ్చరించింది.

## ఖరీఫ్ పంట నష్టానికి రూ.10 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఖరీఫ్ పంట నష్టపోయిన రైతులకు త్వరలో పరిహారం అందనుంది. ఈ నెల 20వ తేదీకల్లా రూ.10 వేల కోట్లకుపైగా పరిహారాన్ని కేంద్రం అందించనుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని బీమా కంపెనీలను ఆదేశించింది. పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయనున్నారు.



## పిల్లి నుంచి మనిషికి కరోనా?

- కొట్టిపారేయలేమంటున్న శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కరోనా.. పిల్లుల నుంచి మనుషులకు సంక్రమిస్తుందా? అంటే చెప్పలేం అంటున్నారు పరిశోధకులు. ఇటీవల బెల్జియంలో ఓ పిల్లికి దాని యజమాని నుంచి కరోనా సంక్రమించిన నేపథ్యంలో.. శాస్త్రవేత్తలు ఈ దిశగా పరిశోధనలు చేపట్టారు. ఇందులో భాగంగా పిల్లుల్లో ఒకదాని నుంచి మరొకదానికి ఈ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుగొన్నారు. శాస్త్రవేత్తలు ఓ మూడు పిల్లులకు కరోనా వైరస్‌ను ఇంజెక్ట్ చేసి, వాటితో ఆరోగ్యవంతమైన మరో రెండు పిల్లులను కలిపి ఒకే బోనులో ఉంచారు. బయటకు తీసుకొచ్చాక పరీక్షించగా.. ఓ పిల్లిలో కరోనా లక్షణాలు కనిపించాయి. దీంతో శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు వచ్చారు. అయితే.. కుక్కలు, పందులు, కోళ్ల లాంటి వాటికి ఈ వైరస్ సోకే అవకాశాలు లేవని అంటున్నారు. కాగా.. పిల్లుల నుంచి మనుషులకు సోకదు అని నిర్ధారణకు వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

### చైనాలో పిల్లి, కుక్క మాంసంపై నిషేధం

కరోనా విధ్వంసంతో చైనా.. పాఠం నేర్చుకున్నట్లే కనిపిస్తోంది. అక్కడి షెన్‌జెన్ నగరం.. పిల్లి, కుక్క మాంసం వినియోగంపై పూర్తిగా నిషేధం విధించింది. ప్రస్తుతానికిది ఒక్క నగరానికే పరిమితమైనా.. మిగిలిన నగరాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించే అవకాశాలు ఉన్నాయి. అన్ని జంతువుల కన్నా కుక్కలు, పిల్లులు మనుషులకు అత్యంత సన్నిహితంగా ఉంటాయని, వీటిని తినడం మానవత్వం కాదనే ఉద్దేశంతోనే నిషేధం విధించామని వారు చెబుతున్నప్పటికీ.. కరోనాయే దీనికి కారణమన్నది బహిరంగ రహస్యం.

## యోగిని అవమానించేలా వ్యాఖ్యలు

- ది వైర్ సంపాదకుడిపై కేసు
- లాక్‌డౌన్ ఉల్లంఘిస్తూ నవమి వేడుకల్లో పాల్గొన్నారని సిద్ధార్థ్ విమర్శ
- వెనక్కు తీసుకోవాలి: చిదంబరం



అయోధ్య, ఏప్రిల్ 2: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా ట్విటర్‌లో వ్యాఖ్యలు చేసిన సీనియర్ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు, 'ది వైర్' సంపాదకుడు సిద్ధార్థ్ వరదరాజన్‌పై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీలో తబ్లిగ్ జమాత్ కార్యక్రమం నిర్వహించిన రోజే అయోధ్యలో షెడ్యూల్ ప్రకారం మార్చి 25 నుంచి ఏప్రిల్ 2వరకు శ్రీరామ నవమి వేడుకలు జరుగుతాయని, కరోనా వైరస్ నుంచి ప్రజలను రాముడే కాపాడతాడని సీఎం యోగి ప్రకటించారని ట్విటర్‌లో సిద్ధార్థ్ పేర్కొన్నారు. అలాగే రామజన్మభూమి స్థలంలో జరిగిన మతపరమైన వేడుకలో (శ్రీ రామ నవమి) యోగి పాల్గొన్నారని, లాక్‌డౌన్ అమల్లో ఉన్నప్పుడు ఆయన ఇలా పాల్గొనడం ఏమిటని ప్రశ్నించారు. మరో ట్వీట్‌లో వివరణ ఇస్తూ కరోనా వైరస్ నుంచి ప్రజలను రాముడు కాపాడతాడని చెప్పింది యోగి కాదని, అయోధ్య ఆలయ ట్రస్టు చీఫ్ ఆచార్య పరమహన్స్ అని పేర్కొన్నారు. సిద్ధార్థ్ వ్యాఖ్యలు.. సీఎం యోగిని అవమానపరిచే విధంగా ఉన్నాయంటూ ఆయనపై ఫైజాబాద్ కోత్వాల్ పోలీసులు సెక్షన్ 188, 505(2) కింద కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమైనదిగా, పత్రికా స్వేచ్ఛపై ఘోరమైన దాడిగా సిద్ధార్థ్ అభివర్ణించారు. కాగా సిద్ధార్థ్‌పై యూపీ సర్కారు కేసు నమోదు చేయడం గర్హనీయమని, మీడియా స్వేచ్ఛను అణగదొక్కడమేనని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి చిదంబరం విమర్శించారు. నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

## విద్యపై ప్రేమ.. భయాన్ని జయించింది!

- కరోనాలోనూ ఇటలీ వీడని భారతీయులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కరోనా ఉగ్రరూపం దృష్ట్యా దేశదేశాల్లో ఉన్న భారతీయులందరూ స్వదేశం చేరుకునేందుకు తహతహలాడుతుంటే.. ఓ ముగ్గురు మాత్రం భారత్‌కు తిరిగి రావడానికి ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. అందునా వారున్నది కరోనా దెబ్బకు శవాల దిబ్బలా మారిన ఇటలీలో. కరోనా వేటుకు ఆ దేశంలో వేల మంది మృత్యువాత పడుతున్నా.. ఏ మాత్రం జంకకుండా తమ విద్య, అధ్యయనాలను కొనసాగించేందుకే వారు మొగ్గు చూపుతున్నారు. ప్రబిన్ ఉపాధ్యాయ, ఆకాశ్ దీప్ బిశ్వాస్, ప్రోమిత్ చౌధురి అనే ఈ ముగ్గురు.. అస్సాంకు చెందిన వారు. ఒకరు పీహెచ్‌డీ చేస్తుండగా, మరొకరు కరోనాపై అధ్యయనం చేస్తున్నారు. ఇంకొకరు.. వైద్యరంగంలో ప్రపంచంలోనే రెండో అత్యుత్తమ దేశమైన ఇటలీ.. కొవిడ్‌ను ఎదుర్కొంటున్న విధానంపై అధ్యయనం చేస్తున్నారు. నాలుగేళ్లుగా వాళ్ల ఇటలీలోనే ఉంటున్నారు. లాక్‌డౌన్‌కు ముందు భారత్.. అక్కడున్న భారతీయులందరినీ స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక విమానం పంపినప్పటికీ వీరు వచ్చేందుకు మొగ్గు చూపలేదు. తాము చేస్తున్న పనిని మధ్యలో వదిలి రావడం ఇష్టంలేకనే రాలేదని ఆ తర్వాత వీరు వెల్లడించారు.



### వేణ్నీళ్ల స్నానంతో హృద్రోగాలు దూరం!

టోక్యో, ఏప్రిల్ 2: ప్రతి రోజు వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం బారిన పడే ప్రమాదం తక్కువగా ఉంటుందని జపాన్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దాదాపు 30 వేల మందిపై 20 సంవత్సరాల పాటు అధ్యయనం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. వేణ్నీళ్ల స్నానం వల్ల కలిగే ప్రయోజనాలు ఏరోబిక్స్ చేయడం వల్ల కలిగే ఫలితాలతో సమానమని చెప్పారు. చన్నీళ్లతో స్నానం చేసే వ్యక్తులతో పోల్చితే వేడి నీళ్లతో స్నానం చేసే వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం 28% తక్కువని, పక్షవాత ప్రమాదం 26% తక్కువని తెలిపారు.

### గంగానదికి మంచి రోజులు

- లాక్‌డౌన్‌తో తగ్గిన కాలుష్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కరోనా లాక్‌డౌన్ కారణంగా గంగానది జలాలు శుద్ధమవుతున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించింది. పరిశ్రమలు పనిచేయకపోవడంతో.. వాటి నుంచి వెలువడే కలుషిత రసాయనాలను గంగలో కలపడం నిలిచిపోవడమే ఇందుకు కారణమని వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని గంగానది పరీవాహక ప్రాంతాల్లో మొత్తం 36 పర్యవేక్షక కేంద్రాలున్నాయని, 9 రోజుల లాక్‌డౌన్‌తో.. 27 చోట్ల గంగాజలాలు శుద్ధంగా మారాయని పేర్కొంది. ఆ నీరు ఇప్పుడు స్నానాలకు అనుకూలమని సీపీసీబీ తెలిపింది.

### 'రామాయణ్'కు చెక్కుచెదరని ఆదరణ

- 17కోట్లమంది వీక్షించిన 4 ఎపిసోడ్లు

ముంబై, ఏప్రిల్ 2: ముప్పై ఏళ్ల నాటి టీవీ సీరియల్ రామాయణ్, పునఃప్రసారంలోనూ చరిత్ర సృష్టిస్తోంది. ఇప్పటి వరకు 4షోలు ప్రసారం కాగా.. అన్నింటికీ కలిపి మొత్తం 17కోట్లమంది చూశారని రేటింగ్స్ సంస్థ బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రిసెర్చ్ కౌన్సిల్(బార్క్) గురువారం ప్రకటించింది. దీంతో.. హిందీ టీవీ వినోద రంగంలో అత్యధికంగా చూసిన సీరియల్‌గా 'రామాయణ్' రికార్డు సృష్టించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో.. గత శనివారం 30 ఏళ్ల క్రితం నాటి రామాయణ్ సీరియల్‌ను ప్రభుత్వం మళ్లీ ప్రసారం చేస్తున్న సంగతి తెలిసిందే. లాక్‌డౌన్ సమయంలో బయటికి వెళ్లేందుకు అవకాశం కూడా లేని నేపథ్యంలో.. ప్రజలు టీవీలకు అతుక్కుపోతున్నారు.

## కరోనాపై సమరానికి సాయం

- భారీగా స్పందిస్తున్న దాతలు, శాఖలు.. 3 రోజుల వేతనమిచ్చిన ఐఏఎస్‌లు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐఏఎస్‌లు తమ మూడు రోజుల జీతాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఇందుకు సంబంధించి అధీకృత లేఖను సీనియర్ ఐఏఎస్ అధికారులు నీరబ్ కుమార్ ప్రసాద్, విజయకుమార్, ప్రద్యుమ్న, ఐఏఎస్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జగన్‌ను కలిసి జిల్లా మైనింగ్ ఫండ్ నుంచి రూ.187 కోట్లు, ఏపీఎండీసీ నుంచి రూ.10.62 కోట్లు, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ఉద్యోగుల విరాళం రూ.56 లక్షలు, ఉపాధిహామీ, వాటర్‌షెడ్ ఉద్యోగుల విరాళం రూ.1.50 కోట్లు, సెర్ప్ ఉద్యోగుల విరాళం రూ.1.50 కోట్లను అందించారు. అరబిందో ఫార్మా రూ.11 కోట్లు ప్రకటించింది. కియా మోటర్స్ ఇండియా ఎండీ కుక్‌హ్యాన్ షిమ్ సీఎం జగన్‌ని కలిసి రూ.2 కోట్లు విరాళాన్ని అందించారు. శ్రీ సిటీ ఫౌండేషన్ రూ.2 కోట్ల విరాళం అందజేసింది. వర్షిణి చారిటబుల్ ట్రస్టు తరఫున మెహర్ శ్రీనివాస్ రూ.1.10 కోట్లు చెక్కును సీఎంకు అందించారు. ప్రముఖ సినీనటుడు ప్రభాస్ రూ.50 లక్షలు విరాళాన్ని ఇచ్చారు. విజయనగరంకు చెందిన జీ ఎల్ మంథానీ చారిటబుల్ ట్రస్టు రూ.25 లక్షలు ప్రకటించింది. జెల్ కాప్స్ ఇండస్ట్రీస్ రూ.5 లక్షల విరాళాన్ని సీఎంఆర్ఎఫ్‌కు జమ చేసింది. మంత్రి ఆదిమూలపు సురేశ్‌ను కలసిన ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నారాయణరావు, డైరెక్టర్ వెంకటాచలం, పీఆర్వో వేణుగోపాల్ రూ.25 లక్షల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా అందజేశారు. లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి వ్యక్తిగతంగా సీఎంఆర్ఎఫ్‌కి రూ.లక్ష విరాళాన్ని పంపారు.

### భద్రాద్రిలో నిరాడంబరంగా

## సీతారాముల కల్యాణం

- భక్తులు దూరం.. టీవీల ద్వారా ప్రత్యక్ష వీక్షణ
- నేడు శ్రీరామ మహాపట్టాభిషేక మహోత్సవం



భద్రాచలం, ఏప్రిల్ 2: భద్రాచల క్షేత్రంలో శ్రీ రామనవమి పర్వదినమైన గురువారం సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకను టీవీల ద్వారా కోట్లాది మంది భక్తులు ప్రత్యక్షంగా తిలకించి పులకించిపోయారు. స్వామి వారికి తెలంగాణ ప్రభుత్వం తరఫున దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముత్యాల తలంబ్రాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. కరోనా వైరస్ ప్రబలకుండా ఉండేందుకు వేడకకు భక్తులను అనుమతించలేదు. ఏటా వేలమంది భక్తుల మధ్య మిథిలా స్టేడియంలో శిల్ప కళాశోభితమైన కల్యాణ వేదికపై సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఈసారి ఆలయ ప్రాంగణంలోని నిత్య కల్యాణ మండపంలో నిరాడంబరంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. 100 మంది లోపే వేడుకకు అనుమతించారు. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో వధూవరుల శిరస్సుపై జీలకర్ర, బెల్లాన్ని అర్చకస్వాములు ఉంచారు. దశరథ మహారాజు, జనక మహారాజు, భక్తరామదాసు చేయించిన మూడు మంగళసూత్రాలను భక్తులకు అర్చకస్వాములు చూపించి మాంగల్యధారణ గావించారు. అనంతరం నూతన వధూవరులకు గోదాదేవి అనుగ్రహించిన నాచ్చియార్‌తిరుమొళి ప్రబంధంలోని వారణమాయరం పాశురాలను పఠనం గావించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు ముట్టాయి. వేద ఆశీర్వచనం, అష్టోత్తర హారతి సమర్పించడంతో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం ముగిసింది.

## ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2: కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబ సమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఆధ్వర్యంలో అర్చకులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా.. విజయనగరం జిల్లా రామతీర్థం రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు కరోనా కారణంగా నిరాడంబరంగా జరిగాయి.



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

# కోడి మేతకు కట్టడి!

**లాక్‌డౌన్‌తో అందని సోయా.. నిలిచిన మహారాష్ట్ర దాణా**

**నిండుకున్న నిల్వలతో కలత.. మేపలేక అమ్మేస్తున్న వైనం**

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల రైతును కరోనా కష్టాలు వెంటాడుతున్నాయి. మొన్నటి వరకు మాంసానికి గిరాకీ లేకపోవడంతో ధర తగ్గిపోయింది. ఇప్పుడు కోడికి మేత కరువైంది. కోళ్ల దాణాకు కీలకమైన సోయాకు కొరత రావడమే దీనికి కారణం. సోయా, మొక్క జొన్న, మరికొన్ని రకాల ముడి పదార్థాలు కలిపి కోళ్ల దాణా తయారుచేస్తారు. దీంట్లో సోయానే కీలకమైనది. అయితే లాక్‌డౌన్ ప్రభావంతో మహారాష్ట్ర నుంచి సోయా రవాణా నిలిచిపోయింది. మొక్కజొన్నతో కూడిన దాణా వేస్తే తింటాయిగానీ బరువు పెరగవు. ఈ నేపథ్యంలో కోళ్ల రైతులు ఆందోళనలో ఉన్నారు. రెండున్నర నెలలపాటు అమ్మకాలు లేక కోళ్ల పరిశ్రమ సంక్షోభంలో పడింది. పీకలలోతు నష్టాలు చవిచూడడంతో పెంపకంలో భారీ కోత వేశారు. పది వేల కోళ్లు పెంచాల్సిన చోట రెండు నుంచి మూడు వేల వరకు పిల్లలను తీసుకువచ్చారు. చికెన్ తింటే కరోనా వస్తుందని భయపడి దూరంగా ఉన్న ప్రజలు గడచిన పది రోజుల నుంచి మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించడంతో రేటు పెరిగింది. మార్కెట్ పర్వాలేదనుకుంటున్న సమయంలో లాక్‌డౌన్ వచ్చిపడింది. దీంతో సరిహద్దులు మూసుకొని బయట రాష్ట్రాల నుంచి రావాల్సిన దాణా నిలిచిపోయింది. పోనీ మొక్కజొన్న మేతగా వేద్దామంటే.. ధరలు కొండెక్కాయి. పది రోజుల క్రితం వరకు రూ.1100 వరకు వుండే మొక్కజొన్న బస్తా ఇప్పుడు రూ.1700కు చేరింది. సోయా లేకపోవడంతో దిక్కుతోచని రైతులు, కంపెనీలు ప్రస్తుతం మొక్కజొన్నపై పడ్డారు. లాక్‌డౌన్ ఎత్తివేసేంత వరకు కోళ్లను బతికించుకోవాలంటే మొక్కజొన్న మేతగా వేయడం తప్పదని రైతులు అంటున్నారు. కాగా, దాణా కొరత తలెత్తడంతో కొందరు రైతులు ఫారాల్లోని కోళ్లను ధర తగ్గించి విక్రయించేస్తున్నారు. నగరంలో కిలో రూ.150 వరకు వెళ్లిన చికెన్ ధర.. ఈ పరిణామంతో మళ్లీ రూ.110కు తగ్గింది. కాగా కోళ్ల ఫారాల్లో పనిచేసేందుకు కూలీలు కూడా రావడం లేదు. సమీప ప్రాంతాల నుంచి వచ్చే కూలీలను కరోనా నేపథ్యంలో ఫారాలు వుండే గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారు. చికెన్, గుడ్లకు త్వరలో కొరత వచ్చే అవకాశం ఉందని తగరపువలసకు చెందిన కోళ్ల రైతు ఒకరు వాపోయారు.

# కరోనా.. రైతులకు ఎంతకష్టమో..

కర్నూలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ ప్రభావంతో ఉల్లి రైతులు అల్లాడిపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో క్వింటా రూ.13 వేలు పలకడంతో.. ఈ సీజన్‌లోనూ ఉల్లి వైపే ఎక్కువమంది రైతులు మొగ్గుచూపారు. కానీ.. దేశమంతా అమలవుతున్న లాక్‌డౌన్‌తో వారికి నిరాశే ఎదురైంది. వారం క్రితం వరకు క్వింటా రూ.3వేల దాకా పలికిన ధరలు ఒక్కసారిగా రూ.700-800కు పడిపోయాయి. దీంతో పొలాల్లో సిద్ధంగా ఉన్న పంటను నష్టానికి అమ్మలేక.. దాన్ని అలాగే ఉంచుకోలేక ఉల్లి రైతులు విలవిల్లాడుతున్నారు. పొలాల్లోనే టెంట్లు వేసి కావలి కాస్తున్నారు. రెండ్రోజుల్లో ధర వస్తే సరి.. లేకుంటే గొర్రెలకు ఆహారంగా వేయాల్సిందేనంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఉల్లి అత్యధికంగా పండించే కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్లో ఏకంగా 3,500 హెక్టార్లలో పంట సాగు చేశారు. ఎకరాకు రూ.50వేల చొప్పున రూ.40 కోట్ల పెట్టుబడి పెట్టారు. కానీ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అమ్మితే రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది.

**మార్కెట్ యార్డు మూసివేత**

లాక్‌డౌన్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఈనెల 1 నుంచి 14 వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవులు ప్రకటించారు. ప్రస్తుతం 3,500 హెక్టార్లలో ఎకరాకు 40 క్వింటాళ్ల చొప్పున చూసినా జిల్లాలో 3.20 లక్షల క్వింటాళ్ల ఉల్లి అందుబాటులో ఉంది. అందులో 2 లక్షల క్వింటాళ్లు కర్నూలు యార్డులో, మరికొంత సరుకును వ్యాపారులు నేరుగా ఇప్పటివరకు కొనుగోలు చేశారు. మిగిలిన పంటలో దాదాపు 78 శాతం పంట పొలాల్లోనే టెంట్ల నీడన మగ్గుతోంది.




# తోట దాటని పంట!

**చెరువు గట్టెక్కని ఆక్వా ఉత్పత్తులు.. ధర తగ్గినా కొనే నాథుడు కరువు**

**ఉంచలేక, అమ్మలేక రైతు దిగాలు..అమలుకాని ప్రభుత్వ హామీ**

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దేశమంతటా లాక్‌డౌన్ అమలవుతుండడంతో వ్యవసాయ రంగం ఒక్కసారిగా కుదేలైంది. పంట బాగానే పండినా మార్కెట్లు మూతపడి, ఉత్పత్తులు కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. రవాణా సౌకర్యం లేక పంట ఉత్పత్తుల ధరలు పాతాళానికి పడిపోయాయి. గిట్టుబాటు ధర దేవుడెరుగు.. కనీసం మద్దతు ధర ఇచ్చినా చాలన్నట్టుగా ఉంది స్థితి. ఉద్యాన పంట ఉత్పత్తులు చేతి కొచ్చి తోటల్లోనే నేలరాలిపోతున్నా అచేతనంగా ఉండిపోతున్నాడు. ఆక్వా రంగమూ అలాగే ఉంది. పంటను మార్కెటింగ్ చేసుకోలేక, రవాణా సౌకర్యం లేక, కనీస ధర రాక, పెట్టుబడులు దక్కక అప్పుల పాలయ్యే స్థితికి రాష్ట్ర రైతాంగం చేరుతోంది. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. లాక్‌డౌన్ కారణంగా.. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఒకవైపు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు దిగజారిపోతుంటే.. రిటైల్‌గా మాత్రం ఆకాశాన్నంటున్నాయి. ఆక్వా, ఉద్యాన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పినా.. ఆచరణలో అమలు కావడంలేదని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**అరటి, చీనీ పంట నేలపాలు**

రాయలసీమలోని అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో అరటి, చీనీ పంటలు చేతికొచ్చి ఉన్నాయి. కానీ.. లాక్‌డౌన్‌తో రవాణా లేక, మార్కెట్లు మూతేయడంతో పంట తోటల్లోనే ఉండిపోయింది. కోతకొచ్చిన పంట కోయడానికి కూలీలు రాక, వచ్చినా మార్కెట్‌కు తరలించడానికి మార్గాలు లేక కాపు వదిలేయాల్సిన పరిస్థితి. దీంతో పంట నేలపాలవుతోంది.

**కూలీలు వెనుకంజ**

కృష్ణా, ఉభయగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో రెండో పంటపైనా కరోనా ప్రభావం చూపింది. వరి పంట కోతకొచ్చినా.. కరోనా భయంతో కూలీలు రావడం లేదు. ఇదే సమయంలో వరి యంత్రాలు మూలనపడ్డాయి. అలాగే ఏటా రూ.11వేల కోట్ల ఆదాయం వచ్చే ఆక్వా రంగం కుదేలైంది. కోళ్లకి కరోనా వైరస్ ప్రభావం లేదని పశుసంవర్థక శాఖ ప్రకటించాక చికెన్ విక్రయాలు కొద్దిగా పెరిగాయి. మార్చి ఆరంభంలో కిలో రూ.40కి పడిపోయిన చికెన్ ధర మళ్లీ పెరిగి, పౌల్ట్రీ రైతులు కొద్దిగా కుదుట పడుతున్నారు.

## కోర్టు తప్పుబట్టినా ముందుకే!

- **అమరావతిలో రాజధానేతర పేదలకు ప్లాట్లపై కొత్త ఉత్తర్వులు**
- **సుప్రీంకోర్టుకు వెళ్తామంటూనే పాత జీవోకు సవరణ**

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో ఇతర ప్రాంతాల పేదలకు ఇళ్ల స్థలాలివ్వడాన్ని అమరావతి రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టే సదరు జీవోను సస్పెండ్ చేసింది. అయినా తన మాటే నెగ్గించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. 'పేదలందరికీ ఇళ్లు' పథకానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి జగన్.. అందులో భాగంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాల పంపిణీకి నిర్ణయించారు. అమరావతిలోని నవులూరు, కృష్ణాయపాలెం, నిడమర్రు, ఐనవోలు, కురగల్లు, మందడం గ్రామాల్లోని మొత్తం 1,25,1.51 ఎకరాలను ఇందుకోసం గుర్తించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏని ఆదేశిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కొందరు రాజధాని ప్రాంత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు గత నెల 23వ తేదీన తీర్పునిచ్చింది. ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టం-2014లోని నిబంధనలను ఉల్లంఘించిందని, సీఆర్‌డీఏ చట్టాలు, అమరావతి మాస్టర్ ప్లాన్ రాజధానిలో స్థానికేతర పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని అనుమతించవని స్పష్టం చేసింది. జీవోను సస్పెండ్ చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పుడు అకస్మాత్తుగా హైకోర్టు తప్పుపట్టిన అంశాలను సవరించి గురువారం తాజా జీవో జారీ చేసింది. అందులో కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు కోరిన ప్రకారం ఆయా జిల్లాల్లోని పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలిచ్చే ప్రక్రియను చేపట్టాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో దాఖలు చేయబోయే స్పెషల్ లీవ్ పిటిషన్‌పై తీర్పు వచ్చేవరకు వేచి చూసి.. అది వచ్చాక తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని జీవోలో ముక్తాయించడం విశేషం!

**ఆ సమావేశాలన్నీ ఇందుకా..!?**

రాష్ట్రంలో నమోదవుతున్న కరోనా పాజిటివ్ కేసుల్లో అత్యధికం పట్టణ ప్రాంతాల్లోనే వెలుగు చూస్తున్న తరుణంలో పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ, ఆ శాఖ ఉన్నతాధికారులు జె.శ్యామలరావు, జేఎస్వీప్రసాద్ విజయ్‌కుమార్ కొన్ని రోజులుగా తరచుగా సమావేశమవుతున్నారు, చర్చోపచర్చలు జరుపుతున్నారు. క్రమం తప్పకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, సీఎస్ నీలం సాహ్నీని కలుస్తున్నారు. వీటన్నిటినీ చూశాక నిజంగానే వీరు సమీక్షలు చేస్తున్నారని అందరూ భావించారు. కానీ బొత్స నేతృత్వంలో పురపాలక, రెవెన్యూ, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు గత కొద్ది రోజులుగా తెర వెనుక మంత్రాంగంలో నిమగ్నులయ్యారని సమాచారం. బుధవారం ఒక్కసారిగా పదుల సంఖ్యలో కరోనా పాజిటివ్ కొత్త కేసులు వెలుగు చూడగా, అదే రోజున సీఎంతో బొత్స, విజయ్‌కుమార్, సీఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ వి.రామమనోహరరావు తదితరులు భేటీ అయ్యారు. రాజధానిలో స్థానికేతర పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు జీవోలో చేయాల్సిన సవరణలపైనే వీరు చర్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. చర్చలు కొలిక్కి రావడంతో తాజా సవరణలతో గురువారం కొత్త జీవో ఇచ్చినట్లు సమాచారం.

# 10 నెలల్లో బీద అరుపులా!

## ఈ ఏడాది 30వేల కోట్లు అదనం.. ఇవిగో పెరిగిన నిధులకు లెక్కలు

- **వారం కట్టడికే ఖజానా ఖాళీయా?**
- **జీతాలు,పెన్షన్లకూ కోతలా?**
- **సీఎంకు టీడీపీ బహిరంగ లేఖ**

| రాష్ట్ర ఆదాయం తీరు | |
|---|---|
| 2018-19 | రూ. 1.57 లక్షల కోట్లు |
| 2019-20 | రూ. 1.87 లక్షల కోట్లు |

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేతికి రూ.30 వేల కోట్లు అదనంగా వచ్చాయని ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ వెల్లడించింది. ఇంత భారీగా నిధుల లభ్యత పెరిగితే దానిని కప్పిపుచ్చి తమ చేతిలో డబ్బు లేదంటూ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఎలా కోత పెడతారని ప్రశ్నించింది. తన వాదనకు మద్దతుగా గత ఆర్థిక సంవత్సరం... ఈ ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేతికి వచ్చిన నిధుల వివరాలను గురువారం వెల్లడించింది. దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆ పార్టీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర బహిరంగ లేఖ కూడా రాశారు. ఆ పార్టీ వెల్లడించిన సమాచారం ప్రకారం... రెండు రోజుల కింద ముగిసిన ఆర్థిక సంవత్సరం (2019- 2020)లో ప్రభుత్వం చేతికి వచ్చిన నిధులు రూ.1.87 లక్షల కోట్లు. రాష్ట్ర ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన ఆదాయం, రుణాల కింద సేకరించిన నిధులు ఇందులోకి వస్తాయి. వేస్ అండ్ మీన్స్ కింద రిజర్వ్ బ్యాంక్ నుంచి అప్పటికప్పుడు తీసుకొన్న రుణాలను ఇందులో కలపలేదు. 2018- 2019లో ఇవే పద్దుల కింద రూ.1. 57 లక్షల కోట్లు వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా రూ. 30 వేల కోట్ల మేర నిధుల లభ్యత పెరిగింది. ఈ సమాచారాన్ని తాము ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల నుంచి తీసుకొన్నామని టీడీపీ ప్రకటించింది. అదనంగా ఇన్ని వేల కోట్లు వచ్చిన విషయాన్ని కప్పిపెట్టి వారం రోజుల లాక్‌డౌన్‌తోనే మొత్తం ఖజానా దివాలా తీసినట్లుగా ప్రభుత్వ పెద్దలు మాట్లాడటం ఏమిటని ప్రశ్నించింది.

**ప్రధాని చెప్పినా కోతా!**

"ప్రభుత్వ ఖజానాలో రైతుల పంటలను కొనుగోలు చేయడానికి... కరోనా నివారణ చర్యలు తీసుకోవడానికి సరిపోను నిధులు ఉన్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే మార్కెట్ ఇంటర్‌వెన్షన్ నిధి పెట్టి వాటిని కొనుగోలు చేస్తామని వైసీపీ మేనిఫెస్టోలో పెట్టారు. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రం రైతుల వద్ద ఉన్న ప్రతి గింజా తామే కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఇక్కడ కొనుగోళ్ల కాదు కదా కనీసం ప్రకటన కూడా చేయలేదు" అని నరేంద్ర తప్పుబట్టారు. ఇంత స్థాయిలో నిధుల లభ్యత ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు, పింఛన్లు ఆపడం వింతగా ఉందని, వారం పాటు ఆదాయం రాలేదని జీతాల్లో కోతపెట్టడం చేతగానితనమని విమర్శించారు. "2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన సమయంలో రూ. 16 వేల కోట్లు లోటు ఉంది. వచ్చీ రాగానే హుద్‌హుద్ వంటి ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడ్డాయి. విభజన సమస్యలు వెన్నాడాయి. ఉద్యోగులు కూర్చుని పనిచేయడానికి వసతులు లేవు. ముఖ్యమంత్రి కూర్చోవడానికే సీటు లేదు. అయినా ఆయన ఉద్యోగుల వేతనాల్లో కోత కాదు కదా, ఒక్క రోజు కూడా చెల్లింపుల్లో ఆలస్యం చేయలేదు. మీరు మాత్రం పది నెలలకే ఉద్యోగుల వేతనాలు ఎగ్గొట్టడానికి సిద్ధపడ్డారు" అని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం నిధులను ఇటీవల ఇచ్చినా ప్రభుత్వం ఇంకా బీద అరుపులు అరుస్తూనే ఉందని, ఉద్యోగులకు జీతాలు ఆపవద్దని స్వయంగా ప్రధాని చెప్పినా ఇక్కడ దానికి విరుద్ధంగా చేస్తున్నారని విమర్శించారు. లేని ఆర్థిక సంక్షోభాన్ని ఉన్నట్లుగా ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదని, ముందుచూపు లేకుండా తీసుకొన్న ఈ నిర్ణయం సమాజ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

### బాగాలేనిది ఆర్థిక స్థితి కాదు.. జగన్ మానసిక పరిస్థితి

- **టీడీపీ నేతల ఆగ్రహం**

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాగా లేనిది రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాదు.. ముఖ్యమంత్రి జగన్ మానసిక స్థితి అని టీడీపీ సీనియర్‌నేతలు దుయ్యబట్టారు. "జగన్ బీద అరుపులు విచిత్రంగా ఉన్నాయి. లాక్‌డౌన్ విధించిన వారం రోజులకే ఆర్థిక పరిస్థితులు బాగోలేవని చేతులు ఎత్తేశారు. ఒకపక్క పేదలు అల్లాడుతుంటే, సందట్లో సడేమియా అన్నట్లు గడిచిన రెండు రోజుల్లోనే కావాల్సిన కాంట్రాక్టర్లకు రూ6,400కోట్ల బిల్లులు విడుదల చేశారు. ఉన్న డబ్బు ఉద్యోగుల జీతాల దగ్గరకు వచ్చేసరికి మాయమైందా?" అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్విటర్‌లో ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి డబ్బులు లేకపోతే కావాల్సిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లిస్తున్నారని ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబు ప్రశ్నించారు. మాజీ మంత్రులు అచ్చెన్నాయుడు, కాల్వ శ్రీనివాసులు, దేవినేని ఉమ కూడా ట్విటర్‌లో ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

### నిజాలుదాస్తే పెనుముప్పు!

- **పాజిటివ్‌లు దాస్తున్నారని అనుమానం**
- **సీఎం వైఎస్ జగన్‌కు చంద్రబాబు లేఖ**

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కరోనా ఉధృతి దృష్ట్యా స్థానికంగా వాస్తవాలను తొక్కిపెట్టడం మంచిది కాదని, ఎప్పటికప్పుడు నిజాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు కోరారు. "పాజిటివ్ కేసులను దాచిపెడుతున్నారు. కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడలో కరోనా వల్ల చనిపోయినా ప్రభుత్వం చెప్పడం లేదనే వార్తలున్నాయి. లెక్క తక్కువ చెబుతున్నారనే భావన ప్రజల్లో ఉంది. నిజాలను దాచిపెడితే పెనుప్రమాదం తప్పదు' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై గురువారం



ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలో కరోనా తీవ్ర రూపం దాల్చకుండా, సమస్య జఠిలం కాకుండా వైద్య పరీక్షలు పెంచడం, పాజిటివ్ కేసులను గుర్తించడం, వైరస్ సోకినవారిని వేరు చేసి ప్రత్యేక చికిత్స చర్యలు తీసుకోవడం, ప్రజలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచే చర్యలు తీసుకోవడం, అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు పోషకాహారం అందించడం వంటి తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. "లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన పేదలు పస్తులుండకుండా అన్నక్యాంటీన్లు తెరిచి ఆదుకోవాలి. లక్షలాది అసంఘటిత కార్మికులు, రిక్షా, ఆటో,చేనేత, భవన నిర్మాణ కార్మికులు, మత్స్యకారులు, జీవాల పెంపకందారులు పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. ఎవరూ పస్తులుండరాదని కేంద్రం రూ.లక్షా75వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. మూడు నెలలకు రేషన్ సరుకులు, పింఛన్ ఒకేసారి పంపిణీ చేయాలని రాష్ట్రాలకు ఆదేశించింది. హైదరాబాద్‌లో పేదలకు అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా జీహెచ్ఎంసీ ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. మహారాష్ట్రలో 11నెలలుగా మూతపడ్డ అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించారు" అని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీతాలు ఆపొద్దని ఇతర రాష్ట్రాల సీఎంలు చెప్తుంటే, లాక్‌డౌన్ వంకతో ఉద్యోగులు, పెన్షన్ల వేతనాల్లో రాష్ట్ర ప్రభుత్వం కోత పెట్టడం, వాయిదా వేయడం సరికాదన్నారు.

## ధర్మాధికారి ఆదేశాలపై మళ్లీ ప్రతిష్టంభన

- **ఉద్యోగులను తీసుకోవడానికి తెలంగాణ నిరాకరణ**
- **అత్యవసర ఆదేశాలు కోరుతున్న ఏపీ సంస్థలు**

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంలో జస్టిస్ ధర్మాధికారి కమిషన్ ఇచ్చిన ఆదేశాలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఆదేశాలు అమలు చేయడానికి తెలంగాణ విద్యుత్ సంస్థలు నిరాకరించాయి. ఈ కమిషన్ ఆదేశాల ప్రకారం 655 మంది ఉద్యోగులను ఆ సంస్థలు తీసుకోవాల్సి ఉంది. కానీ వారిని తీసుకోవడానికి అవి నిరాకరించాయి. లాక్‌డౌన్ కారణంగా ఈ అంశంపై కమిషన్ తమకు రెండు నెలల సమయం ఇచ్చిందని ఆ సంస్థలు చెబుతున్నట్లు సమాచారం. దీనితో అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఏపీ విద్యుత్ సంస్థలు ధర్మాధికారి కమిషన్‌కు లేఖ రాశాయి. ఈ కమిషన్ మార్చి 11వ తేదీన ఇచ్చిన ఆదేశాల ప్రకారం 655 మంది ఉద్యోగుల చొప్పున రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇందులో 584 మంది ఉద్యోగులను తీసుకోవడానికి తెలంగాణ విద్యుత్ సంస్థలు నిరాకరించాయి. దీనితో ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో గురువారం ధర్మాధికారి కమిషన్‌కు లేఖ పంపారు.

### లాక్‌డౌన్‌లోనూ 'నాడు-నేడు'!

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'లాక్‌డౌన్' కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలలన్నీ మూతపడ్డాయి. కరోనా మహమ్మారి కట్టడి చర్యల్లో భాగంగా ఎవరూ ఇల్లు విడిచి బయటకు రావద్దంటూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. అయితే, పాఠశాల విద్యాశాఖకు మాత్రం ఇవేమీ పట్టినట్లు లేవు. ప్రభుత్వ హెచ్చరికలకు భిన్నంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే 'నాడు-నేడు' పనులను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు హుకుం జారీచేశారు.

### కట్టడిలో బడి పనులా?: కన్నా

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలకు సంబంధించి ఇచ్చిన ఆదేశాలను కొన్నాళ్లు ఆపాలంటూ ముఖ్యమంత్రి జగన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల పాఠశాలల భవనాలకు 'నాడు-నేడు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు చేస్తోంది. ఈ పనుల వేగం పెంచేలా పాఠశాల విద్య కార్యదర్శి టెలి కాన్ఫరెన్స్ ద్వారా తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై సీఎంకు కన్నా లేఖ రాశారు.

### ఉపాధి నిధులు రూ.721 కోట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2019-20కు సంబంధించి మొదటి విడతలో రెండో వాయిదా కింద రూ.721.35 కోట్లు మెటీరియల్ నిధులను విడుదల చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలిచ్చింది. దీనికి రాష్ట్ర వాటా జమచేసి 2019-20 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన నిర్మాణ పనులు, ఉద్యోగుల నిర్వహణా వ్యయానికి వినియోగించుకోవాలని సూచించారు.

### నాబార్డు రుణాలు 27,992 కోట్లు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మార్చి 31తో ముగిసిన 2019-2020 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి నాబార్డు రుణాలు 41 శాతం మేర పెరిగాయని ఆ సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2018-2019 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.19,801 కోట్ల నాబార్డు రుణాలు అందగా 2019-2020 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాలు రూ.27,992 కోట్లకు పెరిగాయి.

### నేటి నుంచి అరటి పండ్ల మార్కెటింగ్

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ అమలు చేయడంతో ఉద్యాన పంటల కోతలు, రవాణా, ఎగుమతులు నిలిచిపోవడంతో వివిధ రకాల పండ్ల మార్కెటింగ్‌పై ప్రభుత్వం ఎట్టకేలకు దృష్టి సారించింది. ఇప్పటికే కోతకొచ్చి తోటల్లోనే వృథాగా పడిపోతున్న అరటి పండ్లను రాష్ట్రంలో స్థానిక మార్కెట్లకు, అవకాశం మేరకు ఇతర రాష్ట్రాలకు తరలించాలని మార్కెటింగ్‌శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.

### వాహనదారుడిపై నోరుపారేసుకున్న కోలగట్ల

విజయనగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఓ వాహనదారుడిపై దుర్భాషలాడుతూ మండిపడిన తీరు చర్చనీయాంశమైంది. లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలవుతోంది. పోలీసు సిబ్బంది ఎంతగా చెబుతున్నా వివిధ అవసరాల పేరుతో జనం రోడ్లపైకి వస్తూనే ఉన్నారు. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వాహనంతో బుధవారం పట్టణంలో తిరిగారు. బాలాజీ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నా రు. అదే సమయంలో వాహనంపై అటుగా వచ్చిన ఎమ్మెల్యే అక్కడ ఆగారు. వాహనదారుడిపై మండిపడ్డారు. 'ల... కొడుకులు' అంటూ పరుష పదజాలాన్ని వాడారు. దీంతో ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

### ఆ ఫేస్‌బుక్ అకౌంట్ నాది కాదు: రమణ దీక్షితులు

తిరుమల, ఏప్రిల్ 2: తన పేరుపై గుర్తుతెలియని వ్యక్తులు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా తెరిచి తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ టీటీడీ గౌరవ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో 'రమణ దీక్షితులు' అనే పేరుతో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టడాన్ని గుర్తించిన ఆయన ఆ వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలంటూ బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే ఆ నకిలీ ఖాతా మాయం కావడం విశేషం.

### లాక్‌డౌన్ అంటూ 'కోత'లొద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: లాక్‌డౌన్‌కు ముందు చేసినట్టే పునరుత్పాదక విద్యుదుత్పత్తి సంస్థల నుంచి విద్యుత్ కొనుగోళ్లు యథాతథంగా కొనసాగించాలని, వాటికి బకాయిలు చెల్లించాలని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఈనెల 1న అన్ని రాష్ట్రాలకు, విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు లేఖలు రాసింది. పునరుత్పాదక విద్యుదుత్పత్తి స్టేషన్లకు 'తప్పనిసరిగా నడపాల్సిన(మస్ట్ రన్)' హోదా కల్పించామని, లాక్‌డౌన్‌లోనూ అది కొనసాగాల్సిందేనని స్పష్టం చేసింది.

### ప్రభుత్వ భవనాల రంగులపై ఉన్నతస్థాయి కమిటీ

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలకు ఎలాంటి రంగులు వేయాలన్నదానిపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీచేశారు. రంగుల విషయంలో హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వ తీరును తప్పుపట్టిన విషయం తెలిసిందే!. ప్రభుత్వ భవనాలకు ఏ రంగులు వేయాలన్న దానిపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మార్గదర్శకాలను జారీచేయాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలపై వైసీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడ కూడా ప్రభుత్వానికి చుక్కెదురవడంతో ప్రభుత్వం సీసీఎల్ఏను చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది.

## బ్రిటన్‌లో చిక్కుకున్న విద్యార్థులను ఆదుకోండి

- **విదేశాంగమంత్రికి పవన్‌కల్యాణ్ లేఖ**

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం బ్రిటన్ వెళ్లిన 300 మంది భారత విద్యార్థులు కరోనా విస్తృతితో తీవ్ర భయాందోళనలో ఉన్నారని.. వారిని ఆదుకోవాలని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌కు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు గురువారం ఆయన ట్విటర్ ద్వారా విదేశాంగ మంత్రికి లేఖ పంపారు. బ్రిటన్‌లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు తమ సమస్యను జనసేన పార్టీ దృష్టికి తీసుకురాగా.. పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించి కేంద్ర మంత్రికి లేఖ రాశారు. గత 12 రోజులుగా వారికి సరైన ఆహారం, వసతి లేక ఇబ్బందులుపడుతున్నారని, వెంటనే స్పందించి వారికి తగిన ఆహార, వసతి సదుపాయాలు కల్పించాలని పవన్‌కల్యాణ్ కోరారు.

### విద్యార్థులను రప్పించేందుకు చర్యలు: మంత్రి సురేష్

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో బ్రిటన్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లాక్‌డౌన్ విధించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రికి లేఖలు, ఈ-మెయిల్స్ అందాయి. వీటిపై స్పందించిన మంత్రి విద్యార్థులను రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. లాక్‌డౌన్ ముగిసే వరకు వారికి అన్ని వసతులు కల్పించి, అనంతరం రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా హై కమిషనర్ రుచి ఘన శ్యామ్‌కు మంత్రి ఫోన్‌లో విజ్ఞప్తిచేశారు.

### 'పాత్రికేయుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి'

ఒంగోలు(కలెక్టరేట్); ఏప్రిల్ 2: కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పనిచేసే జర్నలిస్టులు కరోనా వైరస్ నియంత్రణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులకు సేఫ్టీ కిట్స్ ఇచ్చే విధంగా చూడాలన్నారు. ప్రతి జర్నలిస్టులకూ రూ.5 వేలు తక్షణ సహాయం అందించాలని కోరారు. ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్ స్కీం మార్చి 31తో ముగిసిందని తెలిపారు. జర్నలిస్టుల ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి రెన్యువల్ చేయాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే సూచన మేరకు మంత్రి బాలినేని జర్నలిస్టులకు బియ్యం, కందిపప్పును ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

# సీఎంది కక్ష సాధింపు

- **అమరావతి మాస్టర్ ప్లాన్ మార్పు దారుణం**
- **సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం**
- **రాజధాని రైతుల హెచ్చరిక**
- **107వ రోజు కొనసాగిన ఆందోళనలు**
- **దీక్షా శిబిరాల్లో సీతారామ కల్యాణం**

తుళ్లూరు, గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ పక్క కరోనా విలయతాడవం చేస్తుంటే.. ముఖ్యమంత్రి జగన్ తమపై కక్ష సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని అమరావతి ప్రాంత రైతులు మండిపడ్డారు. 'అవసరమైతే అమరావతి మాస్టర్ ప్లాన్‌కు మార్పులు చేయాలని ఆదేశాలు జారీ చేస్తారా? ఈ సమయంలో ఇలాంటి నిర్ణయమా!' అంటూ ధ్వజమెత్తారు. అమరావతిని ఏపీకి ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం వరుసగా 107వ రోజు ఆ ప్రాంత రైతులు, మహిళలు, కూలీలు దీక్షలు, నిరసనలు కొనసాగించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని దీక్షా శిబిరాల్లోనే సీతారాముల కల్యాణం నిర్వహించారు. మందడం, వెలగపూడి, తుళ్లూరు, నీరుకొండ, పెదపరిమి శిబిరాల్లో 'జై శ్రీరాం.. జై అమరావతి' అంటూ మహిళలు ముగ్గులు పెట్టి నిరసన తెలిపారు. ఎన్ని రోజులైనా పోరు సాగిస్తామని, వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. వెంకటపాలెం, అనంతవరం, నెక్కల్లు, రాయపూడి, అబ్బురాజుపాలెం, కృష్ణాయపాలెం, యర్రబాలెం, నేలపాడు గ్రామాల్లోని వీధుల్లో శ్రీరాముని పటాలు పెట్టి పూజలు నిర్వహించారు. అమరావతి ఏకైక రాజధానిగా కొనసాగించేలా చూడాలని మొక్కుకున్నారు. రాజధానిలో అందరికీ ఇళ్ల పథకం వర్తింపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు మండిపడ్డారు. మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయమని సూచించడమేమిటని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించదని, దానిపై తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని రైతులు, జేఏసీ నేతలు తెలిపారు.



వెంకటపాలెం రామాలయంలో రాజధాని నిరసనలు

### అసభ్య పోస్టింగులపై ఫిర్యాదు..

రాజధానిపై మహిళలు చేస్తున్న ఉద్యమాన్ని ఓర్చుకోలేక కడప జిల్లాకు చెందిన వర్రా రవీంద్రారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అభ్యంతర కర పోస్టింగులు పెట్టాడని తుళ్లూరు సీఐ శ్రీహరికి గురువారం మహిళలు ఫిర్యాదు చేశారు. ఇటువంటి పోస్టింగ్‌లు పెట్టిన రవీంద్రారెడ్డిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల మనోభావాలను కాపాడి, ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూడాలని కోరారు.

### వలస కూలీలకు నిత్యావసరాల పంపిణీ

- **స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వం**
- **ముంబైలో 600 మంది కర్నూలు వాసులకు ఊరట**

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కర్నూలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పు ముంబైలోని వర్సోవా ప్రాంతానికి కర్నూలు జిల్లా నుంచి వలస వెళ్లిన 600 కుటుంబాలు లాక్‌డౌన్ కారణంగా దాదాపు వారానికి పైగా ఆకలితో అలమటిస్తున్నాయి. వారి పరిస్థితిని తెలుసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. కర్నూలు జిల్లాలోని దాదాపు 11 మండలాల నుంచి ముంబై వెళ్లిన వలస కూలీలు పడుతోన్న ఇబ్బందులపై 'కడుపు కొట్టిన కరోనా' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం కథనాన్ని ప్రచురించింది. పీపుల్స్ యాక్షన్ ఫోరం అధ్యక్షుడు సురేశ్.. మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూలీల కష్టాలను ఈ-మెయిల్ ద్వారా విన్నవిస్తూ 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని కూడా పంపారు. దీనిపై స్పందించిన ఆ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యం, రెండు కిలోల గోధుమ పిండి, దుస్తులు ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చింది.

# 'మచ్చ' చెరిపేయాలి!

విపత్తు కాలంలో మానవాళి తన అవలక్షణాలను వదులుకుంటుందని అనుకోవడం పొరపాటని 'కరోనా కల్లోలం' కూడా నిరూపించింది. మనుషుల సమస్త లక్షణాలూ, స్వభావాలూ, మంచీచెడ్డవీ యథాతథంగానే ఉన్నాయి. భయాలు, అనుమానాలు, అపోహలు, అజ్ఞానాలు, ద్వేషాలు, స్వార్థాలు, తాపత్రయాలూ అన్నీ చెక్కుచెదరలేదు. వీటన్నిటి మధ్య ఒక ఉపద్రవాన్ని ఎదుర్కొనడం, దానిని అధిగమించడం మాటలు కావు. ఈ కష్టసాధ్యమైన కార్యంలో నిర్ణయాధికారులు, అమలుదారులు, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు– కూడా ఆ జాడ్యాలకు అతీతులు కాకపోవడం విచారకరం. అయినా సరే, వివేకవంతమైన ఆలోచనను, విచక్షణను నిలబెట్టడానికి ప్రయత్నాలు జరగవలసిందే.

బుధవారం నాడు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో వైద్యులపై జరిగిన దాడి హేయమైనది. కరోనాపై యుద్ధంలో ముందువరుసలో నిలబడి పోరాడుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది మనోస్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే సంఘటన. ఒక కరోనా రోగి మరణించగా, అతని కుటుంబసభ్యులు, సహ రోగులు అయినవారు వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. ఆ దాడి దౌర్జన్యపూరితమన్నదానిలో సందేహంలేదు కానీ, కరోనా గురించిన అవగాహన లేకపోవడమే వారి దుర్మార్గానికి ప్రేరణగా కనిపిస్తోంది. దాడి జరుగుతున్నప్పుడు, ఇతర ఆరోగ్యసిబ్బంది కానీ, పోలీసులు కానీ తగినంతగా స్పందించకపోవడానికి, దాడికి పాల్పడుతున్నవారు కరోనా రోగులు కావడమేనని, సమీపిస్తే తమకు కూడా అంటుకుంటుందని వారు భయపడ్డారని చెబుతున్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది చేసే త్యాగపూరిత విధి నిర్వహణను జనతాకర్ఫ్యూ ముగింపువేళ అభినందించవలసిందిగా ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. రంగంలో నిలిచినవారికి జేజేలు చెప్పవలసిందే. కానీ, ఆ రంగంలో కూడా అనేకమంది కరోనా వైద్యసేవలకు సంసిద్ధత ప్రకటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు ఏవైనా కరోనా సేవలు అందిస్తుంటే, ఆ విభాగంలో పనిచేయడానికి అనేకులు వెనుకాడుతున్న సంఘటనలు కూడా వింటున్నాము. మరో వైపు, కరోనా పీడితులకు కానీ, అనుమానితులకు కానీ సేవలు అందించే ఆరోగ్యసిబ్బందిని వారి నివాస ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్‌ల్లో వేధించడం ఎక్కువైంది. అద్దె ఇళ్లలో ఉండే నర్సులు, డాక్టర్లను ఖాళీచేయమని యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. కరోనా చుట్టూ ఈ 'మచ్చ' ఉండడం కారణంగానే, అనుమానితుల కోవలో ఉండే అనేకులు స్వచ్ఛందంగా పరీక్షలకు ముందుకు రావడంలేదని అనిపిస్తోంది.

తమ నిష్ఠాగరిష్ఠత ముందు, దైవభక్తి ముందు కరోనా ఆటలు సాగవు అంటూ, మర్కజ్ కార్యక్రమ నిర్వాహకుడు తన ప్రసంగంలో అన్నాడని చెబుతున్నారు. అటువంటి నమ్మకం వ్యక్తిగత స్థాయిలో ఉంటే సరే కానీ, పెద్ద సంఖ్యలో గుమిగూడే జనంతో చెలగాటమాడడం సరి కాదు. అట్లాగే కాకపోయినా, అటువంటి పద్ధతిలోనే అజాగ్రత్తగా ఉండేవారు, అనవసరమైన అతి జాగ్రత్తతో ఇతరులను బాధపెట్టేవారు మన సమాజంలో ఉన్నారు. ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లివచ్చినవారు ఎందుకు తమంతట తాము పరీక్షలకు, చికిత్సలకు సిద్ధం కావడం లేదు? ఈ వైరస్ సోకిన నూటికి ఎనభైమందికి వైద్యచికిత్సే పెద్దగా అవసరం ఉండదని, అతి స్వల్పసంఖ్యలో మాత్రమే తీవ్ర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరవలసి వస్తుందని, యువకులకు ప్రమాదం అతి తక్కువ– అన్న విషయాలు తక్కువగా ప్రచారమయ్యాయి. కరోనా పోరులో కీలకమైన విధుల నిర్వహణకు యువకులు తమంతట తాము సిద్ధపడవచ్చు, వలంటీర్లుగా ముందుకు రావడం ద్వారా, సమాజంలో ఉన్న దురభిప్రాయాన్ని తొలగించవచ్చు.

కరోనా వంటి ఈతిబాధలను ఎదుర్కొనడంలో సాంస్కృతిక అంశాలు కూడా అనేకం ఇమిడి ఉంటాయి. మడి, మైల, అంటు, వెలి వంటి భావనల భారం ఉన్న మన సమాజంలో, భౌతిక దూరం అన్న భావనకు విపరీత అర్థాలు ధ్వనిస్తే ఆశ్చర్యపడనక్కరలేదు. 1890 దశాబ్దం నాటి బొంబాయి ప్లేగు (బ్యుబోనిక్ ప్లేగ్) సమయంలో గుంపునియంత్రణ, ఆరోగ్య పరీక్షల సందర్భంగా కఠినమైన వ్యవహారసరళి ప్రదర్శించిన డబ్ల్యు.సి. రాండ్ అనే ప్లేగ్ కమిషనర్‌ను అప్పటి విప్లవకారులు హత్యచేశారు. ప్రజల సాంస్కృతిక విశ్వాసాలను పట్టించుకోకుండా ప్లేగు అణచివేత చర్యలు చేపట్టడమే ఆ చర్యకు కారణం. ప్రభుత్వాసుపత్రులలో చేరడం కంటె, ప్లేగుతో చనిపోవడమే మెరుగని ఆనాడు భావించేవారు. ఇంగ్లీషువారు ప్లేగు పేరుతో ఆస్పత్రులలో చేర్పించి, తరువాత చంపుతారని నమ్మేవారు. చావు ఊరేగింపు అనుమతించకపోతే, రోజుల తరబడి మృతదేహాలను ఇళ్లలోనే దాచి, అనువైన రోజున ఏ అర్ధరాత్రో ఊరుఊరంతా కదిలి అంత్యక్రియలు జరిపేవారు. కరోనా సందర్భంగా, చేతులు కడుక్కోవడం వంటి అంశాలమీద జరిగినంతగా, ఆ జబ్బు మీద ఉన్న దురభిప్రాయాలను తొలగించడానికి ప్రచారం జరగలేదు. జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి కానీ, కరోనా సోకినవారిని, వారి కుటుంబసభ్యులను, విదేశాల నుంచి వచ్చినవారిని– వెలివేసినట్టు చూడనక్కరలేదు. కరోనా సోకుతుందేమోనన్న అనుమానంతోనే ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి వార్తలు వింటున్నాము. సాటివారు, తోటివారు తనను తక్కువగా చూస్తారన్న భావనే కదా, వారిని అఘాయిత్యానికి పురికొల్పింది? టెస్టులకు దొరక్కుండా అనుమానితులు తప్పించుకోవడానికి కూడా కారణం అదే. కరోనా గురించిన వాస్తవిక అంశాలను ప్రచారం చేయడానికి ప్రభుత్వం తగిన మాధ్యమాలను అన్వేషించాలి. కరోనా పోరాటంలో సామాజిక నాయకుల సహాయం తీసుకోవాలని ప్రధాని గురువారం నాడు ముఖ్యమంత్రులతో జరిపిన వీడియో సమావేశంలో చేసిన సూచన విలువైనది.

కరోనాలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వైరసంబంధం లేదు. ప్రజల సహకారంలేకపోతే, ఈ యుద్ధంలో గెలుపు లేదు. ఆ సహకారం కావాలంటే, విశ్వాసం కావాలి. తామో, తమ కుటుంబసభ్యులో కరోనా చికిత్సకు వెళ్లవలసివస్తే అదేమంత పాపం కాదని, ఇతరులకు ఆ స్థితి వచ్చినా తాను వారిని గౌరవంగానే చూస్తానని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. అట్లా అనుకుంటేనే వైద్యులకు, ప్రజలకు అందరికీ రక్ష. అటువంటి మంచి విలువను, నమ్మకాన్ని ప్రజలలో కల్పించడానికి ప్రజలలో గౌరవం, విశ్వాసం కలిగిన వివిధ శ్రేణుల సామాజిక నాయకుల సాయం తీసుకోవాలి.



■ యోగేంద్ర యాదవ్

# కరోనాపై కొయ్యగుర్రం పోరు!

కరోనా వైరస్ నియంత్రణకు దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించి వారం రోజులు గడిచిపోయాయి. ఇదొక కఠిన, అయితే ఆవశ్యకమైన నిర్ణయం. మరో రెండు వారాల పాటు కొనసాగే ఈ లాక్‌డౌన్‌ను అమలుపరచడంలో ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోంది? ఇదే చాలా ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానం స్పష్టమే. లాక్‌డౌన్ సవ్యంగా అమలు కావడం లేదు. కనుకనే ఆ నిర్ణయ సంభావ్య ప్రయోజనాలు సిద్ధించడం లేదు. పైపెచ్చు పరిస్థితులు అనూహ్య రీతుల్లో విషమిస్తున్నాయి.

ప్రధాన మంత్రి గత నెల 24 రాత్రి ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ నిర్ణయానికి నేను తక్షణమే సానుకూలంగా ప్రతిస్పందించాను. లాక్‌డౌన్‌కు నేను మద్దతునివ్వడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. అయితే లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చినందుకు ప్రధాని మోదీని విమర్శించడం సహేతుకం కాదని నేను ఇప్పటికీ విశ్వసిస్తున్నాను. అయితే అది అత్యుత్తమ నిర్ణయమనో లేదా ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించేందుకు అదొక్కటే మార్గమనో నేను భావించడం లేదు.

నిజం చెప్పాలంటే కరోనా ఉత్పాతం నుంచి బయటపడేందుకు ఏది ఉత్తమ మార్గమో లేదా ఏది తక్కువ హానికర మార్గమో ఎవరికీ తెలియదు. మరి లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చినందుకు ప్రధాని మోదీని తప్పుపట్టడమెందుకు? లాక్‌డౌన్‌కు వైద్య శాస్త్ర ప్రపంచం సంపూర్ణ మద్దతునిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు లాక్‌డౌన్‌ను అమలుపరిచాయి; ఇంకా అమలుపరుస్తున్నాయి. యథార్థానికి, ప్రధానమంత్రి గనుక ఆ నిర్ణయం తీసుకోకపోయివుంటే మోదీ విమర్శకులు ఆయన్ని క్షమించేవారేనా? కరోనా నియంత్రణకు అత్యంత ఆవశ్యకమైన చర్యను చేపట్టడంలో ఆలస్యం చేస్తున్నందుకు మోదీని ఉతికి ఆరేసేవారు కాదా? స్పష్టమైన, సుసంగతమైన, సత్వర రాజకీయ నిర్ణయం తీసుకోవల్సిన సందర్భం కరోనా కల్లోలం. అంతేకాదు, లాక్‌డౌన్ మొదటి వారం రోజుల్లో చోటుచేసుకున్న అవకతవకలకు ప్రధానమంత్రిని తప్పుపట్టడం ఏమాత్రం సరికాదు. ఇటువంటి బృహత్తర నిర్ణయం తీసుకుని, అమలుపరచడంలో ఎన్నో కష్టనష్టాలు సంభవించడం అనివార్యం.

సరే, కరోనా వైరస్ నియంత్రణకు సంబంధించి మోదీ ప్రభుత్వాన్ని విధిగా మూడు ప్రశ్నలు అడగ వలసివున్నది. అవి: లాక్ డౌన్‌ను ఎలా అమలుపరచాలి, పర్యవసానాలు ఎలా ఉంటాయన్న విషయమై మోదీ ప్రభుత్వం సమాలోచన జరిపిందా? లాక్‌డౌన్ నిర్ణయం గురించి ప్రజలకు సమగ్రంగా, సూటిగా, స్పష్టంగా వివరించారా? లాక్‌డౌన్‌ను ప్రకటించిన క్షణం నుంచీ చోటుచేసుకుంటున్న పరిణామాలు, మారుతున్న పరిస్థితులకు ప్రభుత్వం శీఘ్రగతిన, అర్థవంతంగా ప్రతిస్పందిస్తున్నదా? ఈ మూడు ప్రశ్నలకు సమాధానం నకారాత్మకమైనది కావడం ఒక మహా విచారకరమైన విషయం.

ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఎటువంటి శషభిషలకు పోకుండా దానినెదుర్కొని తీరాలి. కరోనా మహమ్మారి విరుచుకుపడిన సందర్భం కూడా ఇలాంటిదే. అన్నీ ఆలోచించడానికి వ్యవధిలేని విపత్తు అది. ప్రధాని మోదీ సహేతుకంగానే, అనివార్యంగానే లాక్‌డౌన్ ప్రకటించారు. ఇదే సమయంలో కొవిడ్ 19 ఒక భూకంపం లాంటిది కాదనే వాస్తవాన్ని మనం గుర్తించాలి. భూకంపానికి, ఆ దుర్ఘటన సంభవించిన అనంతరం మనం ప్రతిస్పందిస్తాము. జరగవలసిన నష్టం జరిగిన తరువాత మాత్రమే మనం ఏమైనా చేయగలిగేది.

చైనా, కరోనా వైరస్ తొలుత ప్రబలిన తమ వూహాన్ నగరంలో లాక్‌డౌన్‌ను ప్రకటించిన ఎనిమిది వారాలకు భారత్ జాతీయ లాక్‌డౌన్‌ను ప్రకటించింది; అప్పటికి ఇటలీ నాలుగువారాలుగా కొన్ని ప్రాంతాలలో లాక్‌డౌన్‌ను అమలుపరుస్తోంది. రెండు వారాల అనంతరం ఇటలీ అంతటా లాక్‌డౌన్‌ను అమలుపరిచారు. ఈ విషయాలు స్పష్టం చేస్తున్నదేమిటి? లాక్‌డౌన్ గురించి సమగ్రంగా ఆలోచించి, అమలుకు ఒక పటిష్ఠ ప్రణాళికను రూపొందించుకునేందుకు భారత్‌కు చాలా సమయం అందుబాటులో ఉన్నదనే కాదూ? లాక్‌డౌన్ అమలులోకి వచ్చిన మొదటి వారంరోజుల్లో సంభవించిన సంఘటనలు, పరిణామాలను నిశితంగా గమనిస్తే ఎటువంటి పకడ్బందీ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించుకున్న దాఖలాలు కన్పించనేలేదు. లాక్‌డౌన్ కాలంలో పైగా ఇది పంట కోతల కాలం అనే విషయాన్ని ప్రభుత్వం ఎలా విస్మరించింది? అసంఘటితరంగ వలస శ్రామికుల సంక్షేమానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ఎందుకు ప్రకటించలేదు? ప్రస్తుత సంక్షేమ పథకాల పరిధిలోకి రాని వారికి నిత్యావసర సరుకుల పంపిణీని ప్రకటించేందుకు ఆకలి మరణాలు సంభవించే దాకా ఎందుకు వేచి ఉన్నారు? రవాణా వ్యవస్థల షట్‌డౌన్‌ను అమలుపరిచిన తీరు (తొలుత ప్యాసెంజర్ రైళ్ళ రద్దు, ఆ తరువాత అంతర్ రాష్ట్ర ప్రయాణాలపై నిషేధం, ఆఖరుకు దేశీయ, అంతర్జాతీయ విమానసర్వీసులపై ఆంక్షలు) తర్క విరుద్ధంగా ఉండడానికి కారణమేమిటి? ఈ విషయమై ఎవరైనా ఆలోచించారా? రవాణా వ్యవస్థలను సంపూర్ణంగా షట్‌డౌన్ చేయడమంటే సరుకుల సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, నిత్యావసర సరుకుల కొరత నెలకొనడమే గాక అక్రమ వ్యాపార కార్యకలాపాలు ప్రబలిపోతాయని ముందుస్తుగా ఎందుకు ఊహించలేకపోయారు? సహాయ చర్యలను ప్రకటించడంలో అంత జాప్యం ఎందుకు జరిగింది? ఈ ప్రశ్నల గురించి లోతుగా, ప్రగాఢంగా ఆలోచించండి. ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన తరువాతనే లాక్‌డౌన్ గురించి ఆలోచించడం, అమలుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందనే వాస్తవం మీకు స్పష్టమవుతుంది. ఇదొక అసంబద్ధ దృక్పథం. కనుకనే ఏ సంక్షోభాన్ని అయితే ఎదుర్కోవడానికై లాక్‌డౌన్‌ను ప్రకటించడం జరిగిందో ఆ సంక్షోభం కంటే మరింత పెద్ద విషమ పరిస్థితిని ప్రభుత్వ నిర్ణయం సృష్టించింది! ఎంత విషమంగా ఉన్నది ప్రస్తుత పరిస్థితి! దేశవ్యాప్త లాక్‌డౌన్ సృష్టించిన జీవనాధారాల సంక్షోభం ముందు ప్రజల ఆరోగ్యానికి కొవిడ్ 19నుంచి ఎదురవుతున్న ముప్పు వెలవెలబోవడం లేదూ?

> లాక్‌డౌన్‌ను ఎలా అమలుపరచాలి, పర్యవసానాలు ఎలా ఉంటాయన్న విషయమై మోదీ ప్రభుత్వం సమగ్ర సమాలోచన జరిపిందా? లాక్‌డౌన్‌ను ప్రకటించిన క్షణం నుంచీ చోటుచేసుకుంటున్న పరిణామాలు, మారుతున్న పరిస్థితులకు ప్రభుత్వం శీఘ్రగతిన, అర్థవంతంగా ప్రతిస్పందిస్తున్నదా? ఈ మూడు ప్రశ్నలకు సమాధానం నకారాత్మకమైనది కావడం విచారకరమైన విషయం. దేశవ్యాప్త లాక్‌డౌన్ సృష్టించిన జీవనాధారాల సంక్షోభం ముందు ప్రజల ఆరోగ్యానికి కొవిడ్ 19 నుంచి ఎదురవుతున్న ముప్పు వెలవెలబోవడం లేదూ?

ప్రజలకు చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగల వచోనిపుణుడు నరేంద్రమోదీ. భావ ప్రసారంలో ప్రతిభా పరిపూర్ణుడైన మోదీ, దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ప్రకటించే సందర్భంలో జాతినుద్దేశించి వెలువరించిన ప్రసంగం ఆరోగ్య అత్యవసరపరిస్థితి సమయంలో నెలకొన్న, వ్యాపిస్తున్న విషమ పరిస్థితిని ఎలా తెలియజేయకూడదనడానికి ఒక ఉదాహరణగా చెప్పి తీరాలి. కరోనా కల్లోలం గురించి ప్రజలకు తెలియజేయడంలో ప్రధానమంత్రి వారిలో అమిత వ్యాకులతను సృష్టించారు. ప్రధాన మంత్రి ప్రసంగించిన తీరు ప్రతి ఒక్కరి విద్యాంతులు, నిరక్షరాస్యులులో భీతావహ భావాన్ని సృష్టించింది. మశూచికం, కలరా, ప్లేగ్ వలే కరోనా వైరస్ కూడా ఒక ప్రాణాంతక వ్యాధి అనే భావం ప్రజల మనస్సుల్లో నెలకొన్నది. తత్క్షణం నుంచి వారు తీవ్ర ఆందోళనలో జీవిస్తున్నారనడం సత్యదూరం కానేకాదు.

ప్రజలకు అవసరమైన సమాచారమివ్వడంలోనూ, భవిష్యత్తుపై భరోసా కల్పించడంలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం విఫలమయింది. కొవిడ్19 సోకిన వారిలో మరణించిన వారి సంఖ్య 2 శాతం, అంతకంటే తక్కువగా ఉందనే వాస్తవాన్ని ఆయన వెల్లడించలేదు. దేశవ్యాప్త లాక్‌డౌన్‌కు ప్రభుత్వ సన్నద్ధత గురించిన వాస్తవాలను కూడా ఆయన తన శ్రోతలతో









పంచుకోనేలేదు. అలాగే మన డాక్టర్ల, వైద్య పరిశోధకుల ప్రతిభా పాటవాల నాణ్యత గురించి కూడా ప్రజలలో ఒక గట్టి నమ్మకాన్ని ఆయన కలిగించలేకపోయారు. నిరంతర కర్ఫ్యూలాంటి లాక్‌డౌన్‌లో అనుమతించే వాటి గురించి, ఆంక్షలు విధించే వాటి గురించి ఆయన వివరించనే లేదు. తత్ఫలితంగానే ఆయన ప్రసంగం అనంతరం దేశవ్యాప్తంగా ప్రజలు, 21 రోజులకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను సమకూర్చుకునేందుకు గాను కిరాణా దుకాణాల ముందు బారులు తీరవలసివచ్చింది. ఇంతకంటే ఘోరమైన విషయమేమిటంటే సమాజంలోని దుర్బల వర్గాల వారికి, ఆహారం, ఇతర నిత్యావసరాలు సమకూర్చుతామనే విషయమై ఎటువంటి భరోసా నివ్వకపోవడం మరింత ఘోరమైన విషయం. ఈ కారణంగానే నగరాలలలోని పేద వలస కార్మికులు తమ పల్లెలకు పెద్ద ఎత్తున తిరిగి వెళ్ళిపోవడం ప్రారంభమయింది. జాతినుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం ప్రజారోగ్య సంక్షోభాన్ని ఒక ఉమ్మడి ఉన్మాద స్థితిగా మార్చివేసింది.

ఇంత విషమ పరిస్థితులలోనూ సంక్షోభ నిర్వహణ కంటే నిత్యం పతాక శీర్షికలలో వుండేందుకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది! బాధితులను ఆదుకునేందుకు ఏ మంత్రిత్వ శాఖ ఆరాటపడుతోంది? ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘనమైన గణాంకాలను వెల్లడిస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర మోదీ రైతులకు అందిస్తున్న సహాయ సహకారాల గురించి మాట్లాడుతున్న దేమీ లేదు. కరోనా వైరస్ గురించి ప్రజల్లో మెరుగైన అవగాహన కల్పించడం కంటే టీవీ సీరియల్స్‌కే ప్రాధాన్యమిస్తూ కరోనా సంక్షోభ సందర్భాన్ని మీడియాపై మరింత నియంత్రణ సాధించేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోంది.

వ్యక్తిపూజకు నిరంతరం ప్రాధాన్యమివ్వడం పెరిగిపోవడంతో బీజేపీలోనూ, ప్రభుత్వంలోనూ అధినేత మినహా ఇతరుల ప్రాధాన్యం అంతకంతకూ క్షీణించిపోతోంది. ఒక వ్యక్తి లోపాలు వ్యవస్థాగత బలహీనతలుగా పరిణమించాయి.

జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో ప్రభుత్వ వ్యవస్థ పాలనకంటే ప్రజా సంబంధాలకే అధిక ప్రాధాన్యమిస్తోంది. విపత్తు నివారణ, అందునా కరోనా వైరస్‌లాంటి సంక్షోభం విషయంలో ఇలాంటి దృక్పథాన్ని అనుసరించడం వినాశనకర ఫలితాలను మాత్రమే ఇస్తుంది. ఈ విపత్కర పరిణామం మీకు వేటిని గుర్తు చేస్తున్నాయి? 2016 నోట్ల రద్దు పర్యవసానాలనే కాదూ? ఆ మహా చారిత్రక తప్పిదానికి పాల్పడి కూడా నరేంద్ర మోదీ ప్రజల ఆగ్రహం పాల్పడకుండా తప్పించుకోగలిగారు. ఉత్తర భారతావనిలో విశేష ప్రాచుర్యంలో వున్న ఒక లోకోక్తి చెప్పినట్టు– ఒక కొయ్య పాత్రను మీరు మళ్ళా మళ్ళీ నిప్పు మీద పెట్టలేరు సుమా!

*(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)*

## నార్లమాట

# మానవతా హత్య!

> రెండు మూడు వేల సంవత్సరాల నాటి కంటే ఈనాడు మానవతావాదం కొంత ప్రబలిన మాట నిజమే! అయినా రెండు దశాబ్దాల లోపల ఒక గాంధీ, ఒక కెనడీ, ఒక కింగ్ హత్య జరగడం ఆధునిక మానవునికి తలవంపులు కావా? అతడి సభ్యతకు మచ్చకాదా?

సోక్రటీస్ హత్య జరిగినప్పుడు, ఏసుక్రీస్తు హత్య జరిగినప్పుడు సమకాలిక ప్రపంచం సిగ్గుతో ఎంతవరకు తలదించుకున్నదో తెలియదు. కాని, లింకన్ హత్య జరిగినప్పుడు, గాంధీ హత్య జరిగినప్పుడు, కెనడీ హత్య జరిగినప్పుడు ఆ దానవ కృత్యానికి సిగ్గుపడని సభ్య మానవుడు లేడు!

ఐనా, నిన్న మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) హత్య జరగడాన్ని బట్టి దానవత స్థానంలో మానవత పూర్తిగా నెలకొనడానికి మరెన్ని శతాబ్దాలు పట్ట గలదో అని లజ్జతో, భయంతో, హృదయావేదనతో వితర్కించుకోవలసి వస్తున్నది.

అణు శక్తికి మానవుడు అధినాథుడైన తర్వాత కూడా, అన్య గోళాలలో అతడు పాదం పెట్టబోతున్నప్పుడు కూడా ఆటవిక ప్రవృత్తిని అతడు సడలించుకోలేడా? జాతి మత కుల వర్ణ వర్గాది కృత్రిమ విభేదాల నీచ ప్రేరణకు ఈ ఇరువదవ శతాబ్దిలో కూడా ఒక గాంధీ, ఒక కెనడీ, ఒక కింగ్ బలి కావలసిందేనా?



బ్రిటిష్ వారిలో ఎంత జాత్యహంకారం ఉన్నా కనీసం సూత్రప్రాయంగానైనా మన స్వపరిపాలనాధికారాన్ని వారు కాదనేవారు కాదు. 'మీ దేశాన్ని పరిపాలించుకొనగల స్థితిలో ఈ నాడు మీరు లేరు. ఆ స్థితికి మిమ్ము తీసుకురావడానికే మేము కృషి చేస్తున్నాము. సమయం వచ్చినప్పుడు మీ దేశాన్ని మీకు అప్పగించి, మేము వెళ్లిపోతామని' వారు చెబుతూ ఉండేవారు. అమెరికాలో, ముఖ్యంగా దాని దక్షిణాది రాష్ట్రాలలో, శ్వేత జాతీయులు తమతో వర్ణజాతుల సమానత్వాన్ని సూత్రప్రాయంగానైనా గుర్తించరు. ఇప్పుడే కాదు, ఎప్పటికైనా వర్ణజాతివారు ప్రాథమిక పౌరసత్వాలకు సైతం అనర్హులే: శాశ్వతంగా వారు హీనస్థితిలో మిగలవలసినవారే! అట్టి మనః ప్రవృత్తి వ్యక్తమౌతున్న సంఘంలో సమతాసూత్ర సంస్థాపనకై ప్రజోద్యమాన్ని ప్రారంభించడం మృత్యువును వరించడమని తెలిసి కూడా కింగ్ వెనుదీయలేదు. వెన్నుచూపలేదు.

శ్వేతజాతికి చెందినవారి నుంచి మాత్రమే కాక, స్వజాతి వారి నుంచి కూడా తనకు ప్రాణాపాయం తటస్థించవచ్చునని కింగ్‌కు తెలుసు. అహింసాపద్ధతులపై విశ్వాసం లేని కొందరు స్వజాతీయులు 'బ్లాక్ ముస్లిం' సంస్థకు చెందినవారు తనను, తన పద్ధతులను విద్వేషిస్తున్నందున, గాంధీజీని ఒక హిందువు చంపినట్టు, తనను ఒక నీగ్రో చంపగల అవకాశం లేకపోలేదని ఆయనకు తెలుసు. అయినా కింగ్ తన కర్తవ్య నిర్వహణలో సందేహించలేదు, సంచలించలేదు.

రెండు మూడు వేల సంవత్సరాల నాటి కంటే ఈనాడు మానవతావాదం కొంత ప్రబలిన మాట నిజమే! గౌతమ బుద్ధుని వలె ఏ మత ప్రవక్త ఈనాడు బానిసతనాన్ని గురించి మౌనం వహించలేదు. అరిస్టాటిల్ వలె దాన్ని సమర్థించలేదు. అయినా రెండు దశాబ్దాల లోపల ఒక గాంధీ, ఒక కెనడీ, ఒక కింగ్ హత్య జరగడం ఆధునిక మానవునికి తలవంపులు కావా? అతడి సభ్యతకు మచ్చకాదా?

*1968 ఏప్రిల్ 6 ఆంధ్రజ్యోతి సంపాదకీయం*
'మరొక మహాత్ముని హత్య: మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్' నుంచి

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

# ప్రళయవేళ నవజీవన ప్రభాతం

కరోనా కట్టడి కోసం విధించిన కర్ఫ్యూలో దేశవ్యాప్తంగా ప్రజలందరూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా స్పందించడం అభినందనీయం. కొవిడ్–19 వైరస్ బారినపడిన వారికి సేవలందిస్తున్న అధికారులకు, డాక్టర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు, పోలీసులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం తెలియపరుస్తున్న మీడియా ప్రతినిధులకు కృతజ్ఞాభివందనాలు.

మానవాళికి ఇలా ఒక ప్రత్యేక విషమ, భయంకరమైన పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించలేదు. ఒక నిమిషం ఆలస్యమైనా ప్రపంచమే ఆగిపోతుందని భావించే వాళ్లందరికీ ఇది ఒక విపత్కర పరిస్థితి. ఇలాంటి కఠిన సమయంలోనే ఆలోచన విధానాలలో గొప్పమార్పులు వస్తాయి. సాధారణంగా అధికారంలో ఉన్న వాళ్లకు; మా దగ్గర ఎంతో డబ్బు ఉంది, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరనే అహంకారులకు; మాకు ఎప్పటికీ ఏమీ కాదనే అమితమైన విశ్వాసం ఉన్నవాళ్లందరికీ కరోనా వైరస్ కఠిన సత్యాలను చూపిస్తుంది. వారు వీరు అని తేడా లేకుండా అందరికీ అదే బాధ, అదే అనిశ్చితి, అదే వైద్యం! బ్రిటిష్ రాజ కుటుంబం, ప్రధాని, మలేసియా రాజ కుటుంబాల వారు కూడా ఈ వైరస్‌కు అతీతులు కాలేకపోయారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ఆదేశ ఆరోగ్య మంత్రికి కూడా కరోన్ పాజిటివ్ అని తేలింది. దాంతో వారు స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు.

ఇటువంటి పరిస్థితిలో ప్రజలందరూ ఎవరికి వారు ఇంట్లోనే ఉంటూ ఆత్మావలోకనం చేసుకోవాలి. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలందరూ 21 రోజుల పాటు ఇళ్లల్లోనే ఉంటూ స్వీయ నియంత్రణను పాటించాలి.

ఇదే సమయంలో మరో విషయం నిశితంగా పరిశీలించాల్సి ఉంది. ఈ మధ్య కాలంలో ఇలాంటి వైరస్‌లు తరచుగా ఎందుకు విజృంభిస్తున్నాయి? ఇంతకంటే ప్రాణాంతకమైన వైరస్‌లు భవిష్యత్తులో రావని గ్యారంటీ ఏముంది? నిజంగా వస్తే టెక్నాలజీని, అధునాతనమైన మెడిసిన్‌ను అభివృద్ధి చేసుకున్నప్పటికీ.. మున్ముందు ఎదురయ్యే ఉపద్రవాలను మానవాళి తట్టుకోగలదా? ప్రపంచంలోనే ఎంతో బలమైన డైనోసార్స్ కనుమరుగైన విధంగానే మానవాళికి కూడా ముప్పు ఉంటుందా అనే సందేహం వస్తోంది. పరిస్థితులను అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు ఇలాంటి పరిస్థితులు వస్తాయని చెబుతూనే ఉన్నారు. మనం ప్రతి నిమిషం, ప్రతి సందర్భంలో పర్యావరణానికి హాని కలిగిస్తూ, జీవవైవిధ్యాన్ని అవహేళన చేస్తున్నాం. ప్రస్తుతం సమాజంలో ఒకే చోట ఎక్కువ మంది నివాసముండటం, ఒకే చోట ఎక్కువ జంతువులను పెంచటం, పరిశ్రమలను నెలకొల్పడం వంటివి అడ్డూఆపూ లేకుండా చేసేస్తున్నాం. వాటి నుంచి విడుదలయ్యే వ్యర్థాలతో ఎంతటి కాలుష్యం వెలువడుతుందో... ఇలా విచక్షణా రహితంగా ఈ భూమి భరించలేనంతగా అపహాస్యం చేస్తే... ఏదో ఒకరోజు జీవవైవిధ్యం దెబ్బతింటుందని, మానవాళి మీద ఎప్పుడో, ఏదో రూపంలో విరుచుకు పడుతుందని వారు హెచ్చరిస్తూనే ఉన్నారు.

రోజురోజుకూ పెరుగుతోన్న టెక్నాలజీని వినియోగించుకుంటూ విర్రవీగుతున్న మానవునికి ప్రకృతి ఈ కరోనా వైరస్ రూపంలో ఉగ్రరూపాన్ని చూపించిందనే భావించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రజలు కళ్లు తెరచి పర్యావరణ సమతుల్యతను అభివృద్ధి చెందిస్తేనే ఉపద్రవాల్ని కొంతవరకైనా నివారించగలుగుతాము. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలకు విద్య, ఆరోగ్యం, రవాణా, ఇతర ప్రాథమిక సౌకర్యాలను కలుగజేసి సమూహాలుగా జీవించే విధంగా చేయడం, పాడి పరిశ్రమను అభివృద్ధిపరచడానికి వీలైనన్ని పథకాలను ప్రవేశ పెట్టడం, రైతన్నలను సేంద్రియ వ్యవసాయం వైపు నడిపించడం, అడవులను పెంచడం, కాలుష్యం తగ్గించడం వంటివి చేస్తేనే పర్యావరణ సమతుల్యత పెరిగి, జీవవైవిధ్యం పరిరక్షణ జరిగి కొంతైనా ఈ భూమి శాంతిస్తుందని నా నమ్మకం. మన హిందూ సాంప్రదాయాలను పాటించడంతోపాటు పంచ భూతాలైన భూమి, నీరు, ఆకాశం, వాయువు, అగ్నిని పూజించడమే కాకుండా వాటిని గౌరవిస్తూ బతికితేనే మానవాళికి మంచి మనుగడ ఉంటుందని భావిస్తున్నాను.

పైన పేర్కొన్న అంశాలన్ని దీర్ఘకాలంలో సాధించే విషయాలైతే, ఇప్పటికిప్పుడు ఈ 21 రోజుల స్వీయ నిర్బంధంలో అందరూ చేయవలసినదేమిటంటే... కరోనా గురించి తీవ్రంగా ఆలోచిస్తూ భయపడకుండా ధైర్యంగా ఉండాలి. ఇటువంటి సమయాల్లోనే సంయమనం పాటించాలి. ఈ అననుకూల పరిస్థితుల్లో కొంచెం తెలివిగా ఆలోచించినట్లయితే ఈ కఠిన పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవచ్చు.

కుటుంబ సభ్యులందరూ ఇంట్లోనే ఉంటారు కాబట్టి ఇంట్లో ఉన్న రూములు, ముఖ్యంగా వంటగది, ఫ్రిజ్‌లు లాంటివి ఎలా శుభ్రం చేయాలనే విషయాలను తల్లిదండ్రులు వారి పిల్లలకు నేర్పించాలి. బట్టలు ఉతకటం, వంట పనిలో పాల్గొంటే పిల్లలకు ఎంతో కొంత అనుభవం వస్తుంది. మనకోసం నిరంతరంగా పని చేసే వివిధ రకాల వృత్తుల (పనిమనుషులు, బట్టలు ఉతికేవాళ్లు) వారిపైన ఎంతో కొంత గౌరవభావం కలుగుతుంది.

అదే విధంగా, పిల్లలకు వాళ్ల పనులు వాళ్లే చేసుకోవడం నేర్పడమే కాకుండా మీరు చదివిన విషయాలు, జీవిత అనుభవాలు, మీరు చేస్తున్న వృత్తిలో ఉండే లాభ నష్టాలు, వ్యాపార అనుభవాలను పిల్లలకు పంచితే... వారికి మీ వ్యక్తిత్వం, మీరు కుటుంబం కోసం కష్టపడుతున్న వైనం అర్థమవుతాయి. వీటివలన వారికి మీపై గౌరవం ఏర్పడి కుటుంబంలో సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది. పిల్లలకు మన బంధువుల గురించి తెలియజేయాలి. నేటితరం యువతకు బంధాల విలువ అసలు తెలియడం లేదు. కనిపించిన వారందరినీ ఆంటీ, అంకుల్ అంటూ పిలిచేస్తున్నారు. బంధాలతో పిలవడం అలవాటు చేయండి.

స్కూళ్లు, కాలేజీలు లేవు కాబట్టి విద్యార్థులకు చాలా విసుగ్గా ఉంటుంది. సామాజిక మాధ్యమాలకో, టీవీలకో అతుక్కుపోతూంటారు. వీళ్లంతా గమనించాల్సింది ఏమిటంటే... 21వ శతాబ్దంలో విద్యార్థులు ఉపాధ్యాయులపైనో, అధ్యాపకులపైనో ఆధారపడకూడదు. స్వయం శిక్షణ పొందేవారికే మంచి భవిష్యత్తు ఉంటుంది. నేటి డిజిటల్ యుగంలో క్షణక్షణానికీ విషయం మారిపోవటం, కొత్త ఆవిష్కరణలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిదాన్నీ కళాశాలకు వెళ్లి నేర్చుకుంటామంటే కుదిరే పనికాదు. ఎప్పటికప్పుడు అంతర్జాలంలోకి వెళ్లి స్వయంగా నేర్చుకునేందుకు అలవాటుపడాలి. నిత్యం కళాశాల, పరీక్షలతో తీరిక లేకుండా ఉండే విద్యార్థులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఉన్న ఒకే ఒక్క అవకాశం ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేయటమే. ఆన్‌లైన్‌లో ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు స్వయం ఆన్‌లైన్, యూజీ పీజీ మూక్స్, ఈపీజీ పాఠశాల, ఈ కంటెంట్ కోర్స్‌వేర్ ఇన్ యూజీ సబ్జెక్ట్, స్వయం ప్రభ వంటి వాటిలో వివిధ రకాల కోర్సులతోపాటు పోటీ పరీక్షల కోసం ఉపయోగపడే ఎన్నో పాఠ్యాంశాలు అందుబాటులో ఉన్నాయి. మూక్స్ (మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్) ద్వారా ఇంట్లోనే కూర్చుని ప్రఖ్యాత యూనివర్సిటీ ప్రొఫెసర్ల పాఠాలు వినవచ్చు. మనకు నచ్చిన, భవిష్యత్తుకు ఉపయోగపడే స్వల్పకాలిక కోర్సులను ఉచితంగా పూర్తిచేయవచ్చు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా, 5జీ టెక్నాలజీ, ఎథికల్ హ్యాకింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, డేటా అనలిటిక్స్, బ్లాక్ చెయిన్, సైబర్ సెక్యూరిటీ, ఏఆర్, వీఆర్ రియాలిటీ, క్లౌడ్ టెక్నాలజీ, రోబోటిక్స్, డెవలపింగ్ ఆండ్రాయిడ్ యాప్స్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్ ఫర్ మొబైల్ డెవలపర్స్, ఇంట్రడక్షన్ టు కంప్యూటర్ సైన్స్ అండ్ ప్రోగ్రామింగ్ యూజింగ్ పైథాన్, ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డేటా స్ట్రక్చర్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులపై విద్యార్థులు పట్టుసాధించగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ సందర్భంగా కొన్ని విషయాలను తెలియజేయాలనుకుంటున్నాను. విశాఖపట్నంలోని మా స్కూలు ఉపాధ్యాయుడొకరు ఉద్యోగం చేస్తూనే సొంతంగా ప్రిపేరై ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. ఇంటర్వ్యూకు కూడా వెళ్లివచ్చాడు. కాబట్టి ప్రణాళికాబద్ధంగా ఎవరికి వారే సొంతంగా నేర్చుకోగలిగితే మనకంటూ ఒకస్థానం ఉంటుంది.





> విద్యార్థులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఉన్న ఒకే ఒక్క అవకాశం ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేయటమే. ఉదాహరణకు స్వయం ఆన్‌లైన్, యూజీ పీజీ మూక్స్, ఈపీజీ పాఠశాల, ఈ కంటెంట్ కోర్స్‌వేర్ ఇన్ యూజీ సబ్జెక్ట్, స్వయంప్రభ వంటి వాటిలో వివిధ రకాల కోర్సులతోపాటు పోటీ పరీక్షల కోసం ఉపయోగపడే ఎన్నో పాఠ్యాంశాలు అందుబాటులో ఉన్నాయి. 'మూక్స్' ద్వారా ఇంట్లోనే కూర్చుని ప్రఖ్యాత యూనివర్సిటీ ప్రొఫెసర్ల పాఠాలు వినవచ్చు.

రోబోటిక్స్ రంగంలో 2022 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా 23 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని కొన్ని అధ్యయనాల్లో తేలింది. భారతదేశంలోనే దాదాపు 3 లక్షల కొలువులు అందుబాటులోకి రానున్నాయి. బ్లాక్ చైన్, డిజిటల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు వచ్చే మూడేళ్లలో 5 లక్షల మందికి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటాలో 2లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. కనిష్ఠంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వార్షిక వేతనం లభించగలదు.

అందుకని, వైరస్‌ను ప్రళయం లాగా భావించి భయపడుతూ కూచోవడం కంటే ఏదైనా ఒక పనిని చేసుకోవటం వలన మంచి జరుగుతుంది. ప్రజలు అంతగా భయపడాల్సిన అవసరం లేదని ఎందుకంటున్నానంటే గడిచిన ఐదారు రోజుల నుంచి మనదేశంలో వైరస్ వ్యాప్తి పెద్దగా పెరగటం లేదు. దానికి కారణం ప్రజలందరూ పాటిస్తున్న నియమ నిబంధనలు ఒకవైపు; మనదేశం ఎండ తీవ్రంగా ఉండే ప్రాంతం కావడమూ, భారతీయ జీవన విధానం వల్ల ఇతర దేశాల్లోలాగా మనకు విస్తృతంగా రాదని భావిస్తున్నాను.

ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఆలోచించాల్సిన మరో అంశం ఏమిటంటే మొత్తం కర్ఫ్యూ విధించడం వలన సరకుల సరఫరా ఆగిపోతే సామాన్య ప్రజలు ఇబ్బంది పడతారు. ఇదే విధంగా సుమారు నెల రోజుల పాటు కొనసాగితే సమీప భవిష్యత్తులో కొంతమందైనా పేదవాళ్లు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి వస్తుంది. పండించే రైతులూ, వినియోగించే ప్రజలూ ఇబ్బందులు పడవచ్చు. కర్ఫ్యూ వల్ల జీవన ప్రక్రియ ఆగకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విధి ఆడుతున్న ఈ వింత నాటకంలో ప్రపంచంలోని మొత్తం జనాభాలో దాదాపు 60 శాతం మంది లాక్‌డౌన్ (విమానయాన సర్వీసులు, రైళ్లు, బస్సుల రద్దు, పరిశ్రమల మూసివేత) కావడంతో కాలుష్యం బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో మనం గ్రహించాల్సిన వాస్తవం ఒకటి వున్నది. పర్యావరణానికి హాని కలుగజేస్తే వచ్చే ఉపద్రవాలను ఎదుర్కోలేమన్నదే ఆ వాస్తవం. ఇది ప్రకృతి హెచ్చరిక కావున మన ఆలోచనా విధానం, జీవన శైలిలో మార్పులు చేసుకుని పర్యావరణ హితంగా అడుగులు వేయడం చాలా మంచిది.

స్వీయ నిర్బంధంలో ఉంటున్న చాలా మంది ఆలోచనలలో చాలా మార్పు వచ్చింది. సోషల్ మీడియా వేదికగా ఇతరులతో నిర్మొహమాటంగా తమ మనసులోని మాటను పంచుకుంటున్నారు. జీవితంలో పది మందికి సహాయం చేయాలని, డబ్బు కోసం, అధికారం కోసం కాక పదిమంది కోసం బతకాలని నిర్ణయించుకుంటున్నారు. వీటితోపాటు మానవీయ విలువలు, కుటుంబ సంబంధాల తీయదనం వంటివి.. ఎంతోమందిలో వస్తున్న అనుకోని అద్భుతమైన మార్పులు. లాక్‌డౌన్ వల్ల కలుగుతున్న ఈ సామాజిక మార్పు విస్మరించలేనిది. ఇవి ఆచరణలోకొస్తే భవిష్యత్తులో మనం కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఉండే సమాజాన్ని చూడొచ్చు. కరోనా కట్టడికి సంకల్పమే ఆయుధంగా, అప్రమత్తతే నివారణగా ముందడుగు వేయాలి. సోషల్ ఐసోలేషన్ పాటిస్తూ, ఎవరిని వారు కాపాడుకోవడంతో పాటు సమాజాన్నీ కాపాడాలి. అది ప్రతి ఒక్కరి బాధ్యత.

❐ డాక్టర్ లావు రత్తయ్య (విజ్ఞాన్ సంస్థల ఛైర్మన్)

# నివేదన

# ఆరోగ్య మహా మంత్రం

ఇలా చదవాం!



‘వైద్యో నారాయణో హరిః’- అంటే వైద్యుడు మహా విష్ణు స్వరూపుడని అర్థం. ఆ మహావిష్ణువే దేవ వైద్యుడు ధన్వంతరిగా అవతారం దాల్చి, ఆయుర్వేదాన్ని మానవాళికి అందించాడని పురాణాలు చెబుతున్నాయి. క్షీర సాగర మథనం సాగుతున్నప్పుడు చేతిలో అమృత కలశంతో ధన్వంతరి ఉద్భవించాడు. దేవ వైద్యుడిగా ప్రసిద్ధి చెందాడు. మంచి హస్తవాసి ఉన్న వైద్యుడిని అపర ధన్వంతరిగా అభివర్ణించడం అందరికీ తెలిసినదే.

**ధన్వంతరి మంత్రం**

**ఓం నమో భగవతే**
**మహా సుదర్శనాయ వాసుదేవాయ ధన్వంతరయే**
**అమృతకలశ హస్తాయ**
**సర్వ భయ వినాశాయ**
**సర్వ రోగ నివారణాయ**
**త్రైలోక్య పతయే త్రైలోక్య నిధయే**
**శ్రీ మహావిష్ణు స్వరూప**
**శ్రీ ధన్వంతరీ స్వరూప శ్రీ శ్రీ శ్రీ ఔషధ చక్ర**
**నారాయణాయ స్వాహా**

“సుదర్శన వాసుదేవ ధన్వంతరిగా ప్రసిద్ధుడైన దేవదేవునికి నమస్సులు. చేతిలో అమృత కలశాన్ని ధరించినవాడూ, అన్ని భయాలనూ పోగొట్టి, సర్వ రోగాలనూ నివారించేవాడూ, ముల్లోకాలకూ పతి, ముల్లోకాలకూ శ్రేయస్సు చేకూర్చేవాడూ, మహా విష్ణువుకు మారురూపమూ అయిన ధన్వంతరి కృప అందరినీ ఆరోగ్యవంతుల్ని చేస్తుంది. ఆ ఆయుర్వేద పురుషుడికి నమస్సులు” అని భావం.

ఆకస్మిక, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకూ, వ్యాధుల వ్యాప్తి కారణంగా కలిగే భయాలన్నీ పోవడానికీ

**ఆకస్మిక, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకూ, వ్యాధుల వ్యాప్తి కారణంగా కలిగే భయాలన్నీ పోవడానికీ “వ్యాధి తొలగిపోవాలి. నేను సంపూర్ణ ఆరోగ్య వంతుణ్ణి కావాలి” అని మనసులో గాఢంగా సంకల్పించుకొని, ధన్వంతరిని నిత్యం ప్రార్థించాలి.**

ధన్వంతరిని నిత్యం ప్రార్థించాలి. “వ్యాధి తొలగిపోవాలి. నేను సంపూర్ణ ఆరోగ్య వంతుణ్ణి కావాలి” అని మనసులో గాఢంగా సంకల్పించుకొని, ఈ ధన్వంతరీ మహా మంత్రాన్ని వీలైనన్నిసార్లు పఠించినా, మననం చేసుకున్నా అపమృత్యు భయం తొలగిపోతుందనీ, ఆరోగ్యం సిద్ధిస్తుందనీ పెద్దల మాట.

# దేవుడు ఆలకిస్తాడు!

దైవమార్గం



మనం దేవుడిని తరచూ ప్రార్థిస్తూనే ఉంటాం. కానీ ప్రార్థన చేసినప్పుడు ఏం కోరుకుంటాం? ఉద్యోగాలు, ప్రమోషన్లు, పెట్టుబడుల మీద లాభాలు, కుటుంబ సంబంధమైన సమస్యలకు పరిష్కారాలు...! ఇవన్నీ వ్యక్తిగతమైనవే కదా! మనం కోరుకున్నవన్నీ దేవుడు తీర్చాలని ఆశిస్తాం. తీరుస్తాడని నమ్ముతూ ఉంటాం. మన అభీష్టాలకు అనుగుణంగా ప్రపంచం నడవాలని ఆశిస్తాం. అందుకోసం ఏవేవో మొక్కులు కడతాం. అంటే దేవుడితో వ్యాపార ఒప్పందం చేసుకుంటున్నాం. ఇలా ఆలోచించే వ్యక్తులకు దైవం పట్ల నిజమైన విశ్వాసం ఉండదు. “ఈ వ్యక్తులు నా దగ్గరకు వచ్చి పెదవుల అంచుల మీద ఉన్న మాటలతో నన్ను పొగుడుతూ ఉంటారు కానీ వారి హృదయం నా నుంచి దూరంగానే ఉంటుంది” అని ప్రభువు చెప్పారు. ఆ మాట అక్షరసత్యం. ఇలా స్వార్థం కోసం ఆలోచించి, దేవుణ్ణి ఉపకరణంగా చేసుకొని బాగుపడదామనుకొనే మనుషుల వల్లనే ప్రపంచానికి ఎక్కువ కీడు పొంచి ఉంది. ఏమాత్రం విశ్వాసం లేని వారి కన్నా... ఒక వైపు ప్రకృతిని నాశనం చేస్తూ, మరోవైపు దైవాన్ని ప్రార్థించేవారే ప్రమాదకారులు. ప్రస్తుత కరోనా కల్లోల సమయంలో అధిక ధరలకు వస్తువులు అమ్మేవారి దగ్గర నుంచి ప్రజల్లో భయాందోళనలు రేపే వారి వరకూ... ప్రతి ఒక్కరూ మానవత్వానికి దూరంగా బతుకుతున్న వారే! వీరే సమాజానికి పెద్ద విపత్తు. ఇలాంటి సందర్భాలలో మన బాగు కోసం మాత్రమే కాదు, ప్రపంచం అంతా బాగుండాలనీ, మానవాళి ఈ పరిస్థితి నుంచీ కోలుకోవాలనీ, శాంతీ, ఆరోగ్యం విశ్వమంతటా వెల్లివిరియాలనీ దైవాన్ని కోరుకోవాలి. అదే నిజమైన ప్రార్థన. దేవుడు మన నుంచి ఆశించే అసలైన ప్రార్థన!! దేవుడు తప్పకుండా ఆలకించే ప్రార్థన!!



# ఇంటిలోనే ప్రార్థన చేద్దాం!

సందేశం

**కఠినమైన విపత్కర పరిస్థితులు ఉన్నప్పుడు... అంటే భారీ వరదలు, వర్షాలు, భయాందోళనలు, అంటువ్యాధులు ప్రబలుతున్నప్పుడు ఇంట్లోనే నమాజ్ చేసుకోవాలని దైవప్రవక్త మహమ్మద్ సూచించారు. అలాంటి పరిస్థితులలో ఇంట్లో చేసే నమాజుకు మసీదులో జమా అత్‌తో కలిసి చేసే పుణ్యాలకు సమానమైన పుణ్యం లభిస్తుందని స్పష్టం చేశారు.**

ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతున్న కరోనా వైరస్ కారణంగా కొద్ది నెలలపాటు ఉమ్రాలను తాత్కాలికంగా ఆపుచేస్తున్నారు. అంటువ్యాధుల కారణంగా మసీదులను కూడా కొంతకాలం మూసేస్తున్నారు. వ్యక్తుల మధ్య సామాజిక దూరం పెంచి, కరోనాను కట్టడి చెయ్యడానికి గృహ నిర్బంధాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు ప్రకటించాయి. దానిలో అందరూ భాగస్వాములు కావలసిందే! కొద్దికాలం శుక్రవారం నమాజుల కోసం మసీదులకు వెళ్ళకుండా, ఇళ్ళలోనే నమాజ్ చదువుకోవచ్చు. ఎందుకంటే ఎదురుగా ప్రమాదకరమైన కారణం ఉంది కాబట్టి! అల్లాహ్ ఈ విధంగా తెలిపారు:

“మనం ఒకరి ప్రాణం కాపాడినా సకల మానవాళి ప్రాణాలూ కాపాడినట్టే.” (దివ్య ఖుర్ఆన్- అల్ మాయిదా 5:32)

“చేతులారా! మిమ్మల్ని మీరు వినాశనం పాలు చేసుకోకండి. మేలు చేయండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.” (దివ్య ఖుర్ఆన్- అల్ బఖర 2:195)

దేవునిపై బలమైన విశ్వాసాలు ఉండడంలో తప్పులేదు. అయితే అవి మొండిగా ఉండకూడదు. పరిస్థితులు సహకరించనప్పుడు మన ప్రాణాలనూ, ఇతరుల ప్రాణాలనూ అపాయంలో పడేసి, విశ్వాస నిరూపణ చేసుకోవాలని దేవుడు ఎక్కడా చెప్పలేదు. ఎందుకంటే మనిషి శ్రేయస్సు కోసమే ధర్మం ఉంది. దీనికి సంబంధించి ఇస్లామ్ సంప్రదాయంలో రెండు సంఘటనలున్నాయి.

**మసీదులోనే చేయనక్కరలేదు!**

ఒకరోజు రాత్రి తీవ్రమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. మహాప్రవక్తకు అనుయాయుడైన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ ప్రార్థనకు అందరినీ పిలిచే (అజాన్) సమయం అది. ఆయన “నమాజ్ కోసం అందరూ మసీదుకు రండి” అని పిలవడానికి బదులు “ప్రజలారా! మీరు మీ ఇళ్ళలోనే నమాజ్ చేసుకోండి” అని ప్రకటించారు. “రాత్రివేళ బాగా చలిగా ఉన్నప్పుడు కానీ, కుండపోత వర్షం కురుస్తున్నప్పుడు కానీ ప్రజలు వారి ఇళ్ళలోనే ఉండి నమాజ్ చేసుకోవాలని ప్రకటించాల్సిందిగా ముఅజ్జిన్‌ను (నమాజ్‌కు పిలిచేవారిని) దైవ ప్రవక్త ఆదేశించేవారు” అని ఉమర్ వెల్లడించారు. (హదీస్ గ్రంథం: బుఖారీ ముస్లిమ్)

**ఇటువంటిదే మరో సంఘటన...**

“మీ మీ ఇళ్ళలోనే ఉండి నమాజ్ చేసుకోండి” అని అజాన్ చెప్పాల్సిందిగా ఒక శుక్రవారం రోజున ముఅజ్జిన్‌ను మహా ప్రవక్త బంధువు, తొలినాటి ఖుర్ఆన్ పండితుల్లో ఒకరు అయిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్ ఆజ్ఞాపించారు. ఇది విని ప్రజలు ఆశ్చర్యపోయారు. అప్పుడు ఇబ్నె అబ్బాస్ మాట్లాడుతూ “నాకన్నా ఎంతో శ్రేష్ఠుడైన దైవ ప్రవక్త ఈ విధంగానే ఆచరించారు. జమా నమాజ్ అనేది విధిగా చేయవలసిన ప్రార్థన అనేది నిజమే. అయితే మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేయడం నాకు ఇష్టం లేదు” అని చెప్పారు. (హదీస్ గ్రంథం: బుఖారీ)

“ఒక దేశంలో (ప్లేగు) వ్యాధి వ్యాపించి ఉందని మీరు విన్నట్టయితే అక్కడకు వెళ్ళవద్దు. మీరు ఉన్న దేశంలో అది విస్ఫోటనం చెందితే అక్కడి నుంచీ కదలకూడదు” అని (హదీస్ గ్రంథం: బుఖారీ) దైవప్రవక్త తెలిపారు. ఎక్కడైనా అంటువ్యాధులు వ్యాపించి ఉంటే అక్కడికి వెళ్ళకూడదనీ, ఉన్న చోటు నుంచి మరొక ప్రదేశానికి పోకూడదనీ ఆయన చెప్పిన నీతిని మరచిపోకూడదు.

**● మహమ్మద్ వహీదుద్దీన్**

## గతంలోనూ మూసేశారు!



విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రార్థనా మందిరాలు మూతపడడం చరిత్రలో కొత్త విషయమేమీ కాదు. గత 1400 ఏళ్ళ కాలంలో మక్కాలో ఉన్న కాబా మసీదును వివిధ కారణాలతో దాదాపు 40 సార్లు మూసివేశారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది వాస్తవం. ఇప్పుడు విలయతాండవం చేస్తున్న కరోనా లాంటి వైరస్‌ల వల్ల ఉమ్రాలను మాత్రమే కాదు, హజ్ యాత్రలను సైతం ఆపేసి, మొత్తం కాబా మసీదునే మూసెయ్యడం (లాక్‌డౌన్) గతంలో జరిగింది. వాటిలో కొన్ని సందర్భాలు:

- మక్కాలో 1814లో ప్లేగు వ్యాధి ప్రబలి, సుమారు 8 వేల మంది మరణించారు. అప్పుడు తవ్వాఫ్, సామూహిక నమాజ్‌లను కొన్నాళ్ళు ఆపేశారు. మస్జిదే హరామ్‌ను కొంతకాలం పూర్తిగా లాక్‌డౌన్ చేశారు.
- మక్కా, మదీనా పట్టణాల్లో 1837లో ఒక ప్రమాదకరమైన వైరస్ వీరవిహారం చేసింది. అది దాదాపు మూడేళ్ళపాటు అనేకమందిని పొట్టన పెట్టుకొని, 1840లో తగ్గుముఖం పట్టింది. అప్పుడు కూడా మస్జిదే హరామ్ మూతపడింది.
- మక్కాలో 1845లో ‘కొలిరా’ అనే వైరస్ వ్యాప్తి చెందింది. ఆ తరువాత 1864, 1892 సంవత్సరాల్లో సైతం వైరస్‌ల వ్యాప్తి కారణంగా వేల కొద్దీ హజ్ యాత్రికులు మరణించారు. ఆ సంవత్సరాల్లో సైతం కాబా మసీదును మూసేశారు.



**నూట నాలుగు సంవత్సరాలు జీవించడం గొప్ప విషయమే. అసాధ్యమైతే కాదు. అయితే చివరి వరకూ ఆ జీవితాన్ని సాఫల్యం చేసుకున్నవారు అరుదు. అలాంటి అరుదైన వ్యక్తి దాదీ జానకి. బ్రహ్మకుమారీస్ సంస్థలకు అధిపతిగా, అరుదైన ఆధ్యాత్మికవేత్తగా ప్రపంచం మొత్తం గౌరవించిన వ్యక్తి ఆమె.**

దాదీ జానకి (1916-2020)

# ఆమెది ఆత్మచైతన్య పయనం

నివాళి

సమావేశాలలో మాట్లాడేటప్పుడు దాదీ జానకి తరచూ మూడు ప్రశ్నలు వేసేవారు. నేను ఎవరిని? నేను ఎవరికి చెందిన వ్యక్తిని? ఈ సమయంలో నేను చేయాల్సిందేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తరువాత చెప్పుకోవచ్చు. ఆలోచించి చూస్తే... దాదీ జానకి నిండు నూరేళ్ళ పైచిలుకు జీవితంలో ఎక్కువ భాగాన్ని ఈ ప్రశ్నలే నడిపించినట్టు కనిపిస్తుంది.

అవిభక్త భారతదేశంలోని సింధ్ ప్రాంతంలో (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) 1916లో దాదీ జానకి జన్మించారు. వారిది ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉన్న కుటుంబం. ఆమె తండ్రి శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరిస్తూ ఉండేవారు. ఆయనతో పాటు గుర్రం మీదా, బగ్గీలో జానకి కూడా వెళుతూ ఉండేవారు. వయోధికులు, అనారోగ్యంతో ఉన్నవారితో మాట్లాడుతూ ధైర్యం నింపేవారు.

సింధ్ ప్రాంతంలోని హైదరాబాద్‌లో 1936లో దాదా లేఖ్‌రాజ్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేశారు. తదనంతర కాలంలో ఆయన ప్రజాపిత బ్రహ్మగా పేరు పొందారు. ఆధ్యాత్మిక పురోగతిని కోరుకున్న జానకి 1937లో ఆ విశ్వవిద్యాలయంలో చేరారు. బ్రహ్మకుమారీస్‌గా ప్రాచుర్యం పొందిన ఈ సంస్థ ప్రారంభం నుంచి మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చింది. ప్రపంచంలో మహిళలే నడిపే అతి పెద్ద ఆధ్యాత్మిక సంస్థగా రూపుదిద్దుకుంది. సుమారు 83 ఏళ్ల ఆ సంస్థే తన లోకంగా గడిపిన దాదీ జానకి కూడా ఈ క్రమంలో తనదైన, ఘనమైన పాత్ర పోషించారు.

దేశ విభజన తరువాత రాజస్థాన్‌లోని మౌంట్ అబూను బ్రహ్మకుమారీస్ ప్రధాన కేంద్రంగా చేసుకున్నారు. ఆ తరువాత అంతర్జాతీయంగా తమ సందేశాన్ని ప్రచారం చెయ్యాలనే ఆలోచన చేసినప్పుడు, ఆ బాధ్యతలను దాదీ జానకి స్వీకరించారు. 1974లో లండన్ వెళ్ళి బోధనలు ప్రారంభించారు. ఇంతకీ ఆమె చిన్నప్పుడు బడిలో చదువుకున్నది మూడేళ్ళే! ఇంగ్లీష్ అసలే రాదు. అయినా బ్రహ్మకుమారీల వాణిని విశ్వవ్యాప్తం చెయ్యాలన్న సంకల్పంతో ఆమె లండన్‌లో అడుగుపెట్టారు. ఆంగ్ల అనువాదకుల సాయంతో ప్రచారం సాగించారు. ఆమె సారథ్యంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రపంచమంతటా విస్తరించింది. బ్రహ్మకుమారీస్ అంతర్జాతీయ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. 110కి పైగా దేశాల్లో 8వేల పైచిలుకు శాఖలు నడుస్తున్నాయి. పది లక్షల మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

2007లో దాదీ ప్రకాశ్‌మణి భౌతిక లోకాన్ని విడిచిపెట్టడంతో బ్రహ్మకుమారీస్ పూర్తి బాధ్యతలను దాదీ జానకి స్వీకరించారు. అప్పటికి ఆమె వయసు 91 సంవత్సరాలు. ఆ తరువాత పదమూడేళ్ళ పాటు సంస్థ నిర్వహణలో దాదీ జానకి పాలుపంచుకున్న తీరు గుర్తు చేసుకున్నప్పుడు ఆశ్చర్యం కలిగిస్తుంది. వందేళ్ళు దాటినా ధాటిగా ఉపన్యాసాలు ఇచ్చేవారు. మరోవైపు సోషల్ మీడియాలో కూడా ఆమె చురుగ్గా ఉండేవారు. సందేహాలకు సమాధానాలు కూడా సహాయకుల ద్వారా అందించేవారు. ‘స్వచ్ఛ భారత్’ లాంటి కార్యక్రమాల్లో సైతం పాలుపంచుకున్నారు. ఆధ్యాత్మిక పయనంలో ‘నేను ప్రశాంతమైన ఆత్మను’, ‘నేను దేవుడికి చెందిన వ్యక్తిని, కాబట్టి దివ్యమైన పరమాత్మతో సంబంధం ఏర్పరచుకోవాలి’, ‘ఆత్మ చైతన్యాన్ని పెంచుకొనే తరుణం ఇదే కాబట్టి, ఈ సమయంలో దానికోసం ప్రయత్నిస్తూ ఉండాలి’ అని తెలుసుకున్నారు. ఆ ఎరుకనే ప్రజలకు తెలియజెప్పడానికి ప్రశ్నల రూపంలో వేసేవారు. సమాధానాలూ తానే చెప్పేవారు. ఈ మార్చి 27న ఆమె భౌతిక దేహాన్ని విడిచి ఆ పరమాత్మ చైతన్యాన్ని అందుకున్నారు.

# ఇది అనుకోని వరం!

ధర్మపథం

తప్పనిసరిగా ఇంట్లోనే గడపాల్సిన కాలాన్ని మన అంతరాలను తరచి చూసుకొనే ఏకాంత సమయంగా మార్చుకుందాం.

అంతర్గతంగా ఉన్న మలినాలను వదిలించుకోవడానికి అందివచ్చిన అవకాశంగా మలుచుకుందాం.

ప్రపంచంలో ఏ జంతువుకూ గతాన్ని గుర్తు పెట్టుకొనే జ్ఞాపకశక్తి లేదు. కాబట్టి గత కాలపు అనుభవాల నుంచి అవి ప్రత్యేకించి పాఠాలు నేర్చుకోలేవు. అలా నేర్చుకొని భవిష్యత్తును మలుచుకోలేవు. అవి ఎప్పుడూ వర్తమానానికి లోబడే ఉంటాయి. జ్ఞాపక శక్తి ఉన్నవాడు మనిషే! కాబట్టి అతనికి గతకాలపు స్మృతులు గంపల కొద్దీ ఉంటాయి. అవే మనసుగా రూపొందుతాయి. తనను తాను సంస్కరించుకోవడానికీ, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికీ అవకాశం ఈ చరాచర ప్రపంచంలో ఒక్క మనిషికే ఉంది.



**మౌనంతోనే ధ్యానం... జ్ఞానం!**

మనసు లోతుల్లోకి పోవాలంటే మనిషికి ఏకాంతం కావాలి. ఎవరైతే ఏకాంతాన్ని శిక్షణగా మలచుకున్నారో వారే శ్రమణకులయ్యారు. యోగులయ్యారు. ధ్యానులయ్యారు. ధ్యాని సహజ లక్షణం మౌనం! ఏ వ్యక్తి తనను తాను తెలుసుకుంటాడో... తనకు తాను తెలియకుండానే అతను మౌనిగా మారిపోతాడు. ‘మౌని’ అంటే అర్థం ‘మూగ’ అని కాదు... ‘జ్ఞాని’ అని! ఎందరో యోగులు, జైన, బౌద్ధ భిక్షువులూ... వీరందరూ మౌనులే! నిజం చెప్పాలంటే వారు ఈ ప్రపంచం కోసం జ్ఞాన జ్యోతులు వెలిగించిన గొప్పవారు. సిద్ధార్థుడు ఇల్లు వదిలాక 74 మాసాలు మౌనంలోనే గడిపాడు. 75వ మాసం ఆరంభంలో జ్ఞానోదయం పొంది, బుద్ధుడు అయ్యాడు.

**అన్నీ శ్రమణక సంప్రదాయం నుంచే!**

ప్రపంచంలో మరెక్కడా లేని శ్రమణక సంప్రదాయం భారతదేశంలోనే పుట్టింది. మనిషికీ, మనసుకూ అవినాభావ సంబంధం ఏర్పరచింది. మనిషి మనో క్షేత్రాన్ని దుక్కి దున్నింది. మనిషికి పారలౌకిక ప్రపంచం కన్నా తన మనోప్రపంచమే ముఖ్యం అనే ఆలోచనను మొలకలెత్తించింది. యజ్ఞాలూ, జంతుబలులు లాంటి వాటి వెంట మనిషిని పరుగులెత్తించకుండా, తనను తాను చూసుకొనే విధంగా, తన లోతులను తాను అన్వేషించుకొనే విధంగా మార్చింది. ఈనాడు మనం చెప్పుకొనే యోగం, ధ్యానం, ఏకాగ్రత.. ఇవన్నీ శ్రమణక సంప్రదాయం నుంచి పుట్టిన ఫలాలే! అది మనిషికి ఆధ్యాత్మిక, ధార్మిక మార్గాలు చూపిన సంప్రదాయం. ఋషి, ముని, తాపసి, జినుడు, భిక్షువు, భిక్షుణి... వీరందరూ శ్రమణకులే. వారి సిద్ధాంతం అహింస, ధ్యానం, యోగాలే! వీరంతా ఒంటరితనాన్నీ లేదా ఏకాంతాన్నీ శిక్షగా కాకుండా మనోశిక్షణగా మలచిన వారే! వారి సిద్ధాంతంలో ఒంటరితనం ఒక వరం.

**మనలోకి మనం!**

శ్రమణ సంప్రదాయంలో బుద్ధుడు ఆవిష్కరించిన యోగ పద్ధతి ధ్యానం. దాన్ని ‘విపశ్యన’ (బౌద్ధంలో ‘విపస్సన’) అంటారు. అంటే తనలోకి తాను చూసుకోవడం! తనను తాను దర్శించుకోవడం. అదే అంతర్ దృష్టి. ఈ అంతర్ దృష్టి వల్ల అజ్ఞానం పటాపంచలవుతుంది. తప్పేదో, ఒప్పేదో తెలుస్తుంది. ఎవరో చెప్పే మాటలు నమ్మి వంచించడం, వంచనకు గురి కావడం ఆగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమ్యక్ (సరైన) దృక్పథం ఏర్పడుతుంది. సమస్యలను పరిష్కరించుకోగల శక్తి పుట్టుకొస్తుంది. ఈ స్థితికి చేరుకున్నప్పుడు మనం మానవ సమాజంలో మంచి భర్తగా, మంచి భార్యగా, మంచి బిడ్డగా, మంచి కుటుంబ సభ్యునిగా, మంచి పౌరునిగా రూపొందగలం. మన కుటుంబాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోగలం.

పరుగులు తీసే నాగరక ప్రపంచంలో మనిషికి తనలోకి తాను చూసుకొనే అవకాశం ఈనాడు లేకుండా పోయింది. ఏకాగ్రత ఎంత వెతికినా దొరకని వస్తువు అయిపోయింది. ఇప్పుడు కీడులో మేలుగా... కరోనా విజృంభణ వల్ల ప్రతి ఒక్కరికీ ఈ అవకాశం కలిగింది. ఇంట్లో ఒంటరిగా కొన్నాళ్ళు గడిపే అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని అంది పుచ్చుకోవాలి. సానుకూలంగా మలచుకోవాలి. అలా మలచుకోగల శక్తి భారతీయుల జీవనాడిలోనే ఉంది. ఈ జీవరసం బౌద్ధం ద్వారా తూర్పు దేశాలకు అందింది. అందుకే ఈ శ్రమణక సంప్రదాయ స్పర్శ ఉన్న తూర్పు దేశాలు కరోనా ఉపద్రవం నుంచి తేరుకుంటున్నంత తేలికగా పాశ్చాత్య దేశాలు తేరుకోలేకపోతున్నాయి. కాబట్టి మన జీవనాడిని మరోసారి నిద్ర లేపుదాం. ఈ ఏకాంతాన్ని వరంగా మార్చుకుందాం! మనలోకి మనం చూసుకుందాం!! మన లోపల ఉన్న మలినాలను వదిలించుకుందాం!!

**● బొర్రా గోవర్ధన్**

ఆధ్యాత్మిక వాహిని

లాక్‌డౌన్ కారణంగా ప్రజానీకం ఇంటికే పరిమితం అయిన సందర్భం ఇది. ఇలాంటి పరిస్థితుల్లో ఆసక్తి కలిగిన వారు ఇంట్లోనే ఆధ్యాత్మిక వీడియోలనూ, ఆడియోలనూ ఈ క్రింది వాటిద్వారా చూడొచ్చు, వినొచ్చు.

# చూసేద్దాం! వినేద్దాం!

**✳ గరికపాటి ప్రసంగాల కోసం...**

మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగాల ఆడియోలనూ, వీడియోలనూ ఈ క్రింది లింక్ ద్వారా ఆస్వాదించవచ్చు.

https://www.youtube.com/Sri Garikipati Narasimha Rao Official

**✳ భక్తి గీతాల కోసం...**

భగవద్గీత నుంచి సాయిబాబా భజనల వరకూ సకల దేవతా స్తోత్రాలూ, గీతాలూ వినొచ్చు. తెలుగు వారికి ప్రత్యేకం.

https://www.youtube.com/user/adityadevotional/

**✳ కర్ణాటక సంగీతం కోసం...**

ఎమ్మెస్ సుబ్బులక్ష్మి ఆలపించిన విష్ణుసహస్ర నామం, భజగోవిందం మొదలుకొని మంగళంపల్లి బాలమురళీ కృష్ణ పాడిన త్యాగరాజ కృతుల వరకూ ఈ లింక్‌లో వినవచ్చు.

https://www.youtube.com/user/saregamacarnatic

# సముద్రం మనకు ఆదర్శం

నవజీవన వేదం



ఒక సంస్థను నడపాలంటే అన్ని రకాల వ్యక్తులనూ భరించాలి. కావాలనుకున్న విధంగా మనుషులు దొరకరు. అలాగే సంసారం నడవాలన్నా నాలుగు రకాల మనస్తత్వాలనూ భరించడం అలవాటు చేసుకోవాలి. అందరినీ మార్చాలని చూడవద్దు. మారరు. అలా మార్చడం కూడా సాధ్యం కాదు. మరి మారని మనస్తత్వాలతో సంసారం ఎలా? సంస్థ నిర్వహణ ఎలా? పరిపాలన ఎలా? అంటే భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణకవి పద్యం ద్వారా ఆ ఉపాయమేంటో తెలుసుకుందాం. సముద్రతీరంలో నిలుచుని కాస్తలోతుగా ఆలోచించండి. సముద్రం ఎంత విచిత్రమైనదో, ఎన్నిటిని భరిస్తుందో అర్థమవుతుంది.

**ఒక యెడ బవ్వళించు హరి, యొక్క యెడన్ వహియించు రాక్షస ప్రకరము, లొక్కచో నడగు బర్వత సంఘము, లొక్కెడన్ బలా హకములతోడ నుండు బడబాగ్నియు, విస్తృత మూర్తితంబునం బ్రకటభరక్షమం బగుచు భాసిలు నౌర సముద్ర మెంతయున్**

శ్రీహరి సముద్రంలో పవళిస్తాడు. మరి భగవంతుడు పవళించాడు కాబట్టి ఇంకెవరూ లేరా? అంటే...రాక్షసులూ సముద్రంలోనే దాక్కున్నారు. అంతేకాదు మందర పర్వతంలాంటి కొన్ని వందల పర్వతాలు సముద్రంలోనే ఉన్నాయి. మేఘాలు ఏర్పడటానికి సముద్రమే కారణం. బడబాగ్నిని భరిస్తున్నదీ సముద్రమే! విష్ణుమూర్తిలాగే సముద్రం ఎంత విశాలమైన హృదయం కలిగి ఉంది. అలాంటి సముద్రాన్ని చూసి నేర్చుకుందాం! సంస్థలో పర్వతాల లాంటి వాళ్లుంటారు. వాళ్లను పోషించడం కూడా కష్టమే. బడబాగ్ని లాంటి వాళ్లూ ఉంటారు. యజమానినే కాల్చుకు తింటారు. రాక్షసులు ఉంటారు. పని రాక్షసులూ ఉంటారు. జీవితమైనా, సంసారమైనా, సంస్థయినా నాలుగు రకాల వ్యక్తులనూ భరించాలి.

**● డా. గరికిపాటి నరసింహారావు**





# మళ్లీ దొరకదేమో!

- సుదీర్ఘ విరామంపై సింధు
- ఆలస్యంగా నిద్రలేస్తున్నా
- సినిమాలు చూస్తూ కాలక్షేపం

**హైదరాబాద్:** జీవితంలో ఇంతటి సుదీర్ఘ విరామం మళ్లీ రాదేమోనని ఏస్ షట్లర్ పీవీ సింధు అభిప్రాయపడింది. బ్యాడ్మింటన్ కెరీర్ ప్రారంభమయ్యాక తాను ఇన్నిరోజులు ఇంటిపట్టునే ఉండడం ఇదే తొలిసారని చెప్పింది. గత నెల 11 నుంచి 15 వరకు బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని స్వదేశానికి వచ్చిన సింధు..కరోనా వైరస్ నేపథ్యంలో 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలోకి వెళ్లింది. అది పూర్తవగా..దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో మరికొన్ని రోజులు ఆమె ఇంటికే పరిమితమవ్వాల్సి వస్తోంది. ఈ విరామాన్ని ఎలా ఎంజాయ్ చేస్తోందో ఆమె వివరించింది.

**వుహాన్ వెళ్లేవాళ్లం..**

టోక్యో ఒలింపిక్స్ యథాప్రకారం జరుగుతాయని మొన్నా మధ్యవరకూ తామంతా భావించామని, సాధారణ పరిస్థితులు ఉండివుంటే ఈపాటికి క్వాలిఫయింగ్ టోర్నమెంట్లలో పాల్గొంటుండడం ద్వారా విశ్వ క్రీడలకు సన్నద్ధమవుతూ ఉండేవారమని వివరించింది. ఇంకా చెప్పాలంటే..ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కోసం కరోనా కేంద్ర బిందువు వుహాన్ కూడా వెళ్లేవారమని తెలిపింది.

**జీవితమే ముఖ్యం..**

ఒలింపిక్స్ వాయిదా విషయం తెలిసేనాటికి..తాను ఆ క్రీడలకు చక్కగా సిద్ధమవుతున్నానని సింధు వెల్లడించింది. కానీ రోజుకో దేశం కొవిడ్-19 బారినపడుతుండడంతో ఈ ఏడాది ఒలింపిక్స్ వాయిదా వేయక తప్పలేదు. ఏదేమైనా..ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అన్నింటికంటే జీవితమే ముఖ్యమని వ్యాఖ్యానించింది.

**ఎన్ని సినిమాలో...**

ఇంగ్లండ్ నుంచి వచ్చినప్పటినుంచి ఇంట్లో తన గదికే పరిమితమయ్యానని తెలిపింది. జీవితంలో ఇన్ని రోజుల విరామం లభిస్తుందని తానెప్పుడూ ఊహించలేదని వెల్లడించింది. ప్రస్తుతం టోర్నమెంట్లు, ప్రాక్టీస్‌లాంటివి లేకపోవడంతో ఆలస్యంగా నిద్ర లేవడంతోపాటు కొద్దిపాటి వ్యాయామాలే చేస్తున్నానని చెప్పింది. అనంతరం టీవీలలో తెలుగు, హిందీ సినిమాలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నానని తెలిపింది. 'ఎన్ని సినిమాలు చూస్తున్నానంటే...నేను వీక్షిస్తున్న సినిమాలలో కొన్నింటి పేర్లు కూడా నాకు గుర్తులేవు' అని చెప్పింది. 2011లో విడుదలైన హాలీవుడ్ చిత్రం 'కంటేజియన్' చూశానని తెలిపింది. ఆ సినిమాలో మాదిరే ప్రస్తుతం ప్రపంచాన్ని ఓ వైరస్ పట్టిపీడిస్తోందని చెప్పింది. తమ ఇంటికి మూడిళ్ల అవతల అక్క ఉంటుందని, ఆమె ఏడాదిన్నర కుమారుడిని చూసేందుకు కూడా వెళ్లడంలేదని తెలిపింది.

**అమ్మకు సాయపడుతున్నా..**

బ్యాడ్మింటన్ ఆడే అవకాశం ఎలాగూ లేనందున..అదేపనిగా ఇంటివద్ద ఉంటే ఒకింత బోరింగ్‌గా ఉంటోందని సింధు చెప్పింది. దాంతో వంటగదిలో తల్లికి సాయం చేస్తున్నానని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల రీత్యా చూస్తే లాక్‌డౌన్‌ను పొడిగిస్తారని అభిప్రాయపడింది. అయితే ఏం జరుగుతుందో చూడాలని పేర్కొంది. కరోనా కేసులు, మరణాలు తగ్గిపోతాయన్న ఆశాభావాన్ని సింధు వ్యక్తంచేసింది.

## డ/లూ సృష్టికర్త లూయిస్ మృతి



**దుబాయ్:** క్రికెట్‌లో ఎంతో పాపులర్ అయిన డక్‌వర్త్-లూయిస్ (డ/లూ) విధాన సృష్టికర్తల్లో ఒకరైన టోనీ లూయిస్ (ఇంగ్లండ్) మృతి చెందాడు. వర్ష ప్రభావిత మ్యాచ్‌లో డ/లూ పద్ధతి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి. ఈ ఫార్ములా ఆధారంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. 1999లో ఈ విధానాన్ని ఐసీసీ అన్ని మ్యాచ్‌ల్లో ప్రవేశపెట్టింది. అయితే, ఈ పద్ధతిపై కొన్ని అసంతృప్తులున్నా.. అమల్లో ఉన్న వాటిల్లో ఇదే అత్యుత్తమం. లూయిస్ (78) మృతికి ఐసీసీ సంతాపం తెలిపింది.

## మోదీకి బాచ్ కృతజ్ఞతలు





బాచ్

**లుసానే:** టోక్యో ఒలింపిక్స్ వాయిదాకు మద్దతు తెలిపిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ కృతజ్ఞతలు తెలిపారు. కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో ఐవోసీ తీసుకుంటున్న చర్యలను జీ20 నేతల వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ ప్రశంసించారు. టోక్యో క్రీడల వాయిదాకు కూడా మద్దతు ప్రకటించారు. దీనికి కృతజ్ఞతలు తెలుపుతూ బాచ్ లేఖ రాశారు. కరోనా వైరస్ కారణంగా విశ్వక్రీడలను వచ్చే ఏడాదికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

## విఫలమైతే మళ్లీ కనిపించను

- ఓపెనర్‌గా ఒక్క అవకాశమివ్వండి
- అజర్, వాడేకర్‌ను కోరిన సచిన్
- 1994 న్యూజిలాండ్ టూర్



**న్యూఢిల్లీ:** దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభించాడు. కానీ తర్వాత ఓపెనర్ అవతారమెత్తి లెక్కకు మిక్కిలి ప్రపంచ రికార్డులు సాధించాడు. అయితే తాను ఓపెనర్‌గా మారడం వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని టెండూల్కర్ ఇలా వివరించాడు. 1994లో 4 వన్డేలు ఆడేందుకు భారత జట్టు న్యూజిలాండ్ వెళ్లింది. రెండో వన్డేకు ముందు నవజ్యోత్ సింగ్ సిద్ధూకు మెడ నొప్పిజేసింది. 'నేను డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లేసరికి సిద్ధూ స్థానంలో ఎవరిని పంపాలా..అని కెప్టెన్ అజరుద్దీన్, కోచ్ అజిత్ వాడేకర్ ఆలోచిస్తున్నారు. అప్పుడు నేను వెళతానని అన్నా. న్యూజిలాండ్ బౌలర్లందరిపై ఎదురు దాడి చేయగలనన్న విశ్వాసం నాకుంది' అని వారికి చెప్పానని సచిన్ తెలిపాడు. 'నువ్వు ఇన్నింగ్స్ ఎందుకు ప్రారంభించాలని అనుకుంటున్నావు' అని వారు ప్రశ్నించారన్నాడు. కేవలం కొత్త బంతి మెరుపు తగ్గేవరకే క్రీజులో ఉండి రావాలనుకోవడంలేదు. ఆ తర్వాతా బ్యా టింగ్ కొనసాగించడంతో పాటు బౌలర్లపై ఎదురు దాడికి దిగుతా' అని సమాధానమిచ్చానని సచిన్ చెప్పాడు. 'సాధారణంగా కొత్త బంతి మెరుపు తగ్గిపోయే వరకు తొలి 15 ఓవర్లు ఓపెనర్లు ఆచితూచి ఆడేవారు. ఆ తర్వాత క్రమంగా బ్యాటింగ్‌లో వేగం పెంచుతూ ఆఖరి 7,8 ఓవర్లో మాత్రమే మరింత ధాటిగా ఆడేవారు. కానీ 1992 వన్డే ప్రపంచ కప్‌లో మాత్రం గ్రేట్‌బ్యాచ్ ఆ పరిస్థితి మార్చేశాడు. ఆరంభంనుంచే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అందువల్ల నేను ఓపెనర్‌గా వెళ్లి తొలి 15 ఓవర్లలో దూకుడుగా ఆడడం ద్వారా ప్రత్యర్థిపై ఒత్తిడి తెస్తా. నేను కనుక విఫలమైతే మళ్లీ మీ వద్దకు రాను. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి అని అడిగా. వారు అంగీకరించారు. నేను క్లిక్ అయ్యా' అని సచిన్ వివరించాడు. ఆక్లండ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఓపెనర్‌గా వెళ్లిన టెండూల్కర్ కివీస్ బౌలర్లపై విరుచుకుపడి 49 బంతుల్లో 15 బౌండ్రీలు, 2 సిక్సర్లతో 82 పరుగులతో దుమ్ము రేపాడు.





## వరల్డ్‌కప్@90 లక్షలు

**భారత్‌లో మహిళల క్రికెట్‌కు బ్రహ్మరథం**

**దుబాయ్:** మహిళల టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌కు భారత అభిమానులు బ్రహ్మరథం పట్టారు. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మార్చి 8న జరిగిన టైటిల్ పోరును టీవీలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లో కలిపి రికార్డు స్థాయిలో సుమారు 90 లక్షల మంది వీక్షించారట. ఈ వివరాలను ఐసీసీ గురువారం విడుదల చేసింది. టోర్నీలో హర్మన్‌సేన అదరగొట్టడంతో భారత్‌లో మొత్తంగా 540 కోట్ల నిమిషాలపాటు వీక్షించినట్టు తెలిపింది. ఇక ఫిబ్రవరి 21 నుంచి మార్చి 8 వరకు జరిగిన టోర్నీ మ్యాచ్‌ల వీడియోలను వంద కోట్ల మందికి పైగా వీక్షించినట్టు చెప్పింది.

## గంభీర్ రెండేళ్ల జీతం విరాళం



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నివారణకు 'ప్రధాన మంత్రి కేర్స్ ఫండ్'కు భారత మాజీ క్రికెటర్, ప్రస్తుత ఎంపీ గౌతమ్ గంభీర్ తన రెండేళ్ల జీతాన్ని విరాళంగా ప్రకటించాడు. 'దేశం తమ కోసం ఏం చేసిందని ప్రజలు అడుగుతుంటారు. అయితే మనం దేశం కోసం ఏం చేశామన్నదే అసలైన ప్రశ్న. దేశం కరోనాను దీటుగా ఎదుర్కోవడానికి పీఎం కేర్స్ ఫండ్‌కు రెండేళ్ల జీతాన్ని విరాళంగా ఇస్తున్నా. మీరు కూడా సాయం చేయడానికి ముందుకు రండి' అని గంభీర్ ట్వీట్ చేశాడు.

## కరోనాపై కలసికట్టుగా పోరాడండి!

**ప్రజలకు కోహ్లీ విజ్ఞప్తి**





**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా కోరలు చాచడంపై విరాట్ కోహ్లీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. వైరస్‌పై పోరాటంలో అందరూ కలిసి కట్టుగా పోరాడాలన్నాడు. 'ప్రస్తుతం ఇంట్లోనే ఉండి మహమ్మారిపై పోరాడుతున్నాం. 80 శాతం మంది ఎంతో సీరియస్‌గా తీసుకున్నా.. 20 శాతం మంది అమలు చేయక పోవడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయ'ని ఇంగ్లండ్ మాజీ బ్యాట్స్‌మన్ కెవిన్ పీటర్సన్‌తో ఇన్‌స్టాగ్రామ్ లైవ్ సెషన్‌లో కోహ్లీ చెప్పాడు. ఇక కెరీర్ గురించి మాట్లాడుతూ.. 2014 ఇంగ్లండ్ టూర్ తన కెరీర్‌లో దారుణ వైఫల్యమని చెప్పాడు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకూడదని గట్టిగా నిర్ణయించుకున్నానని తెలిపాడు. ఇక తన ముద్దుపేరు 'చీకూ'ను ఫేమస్ చేసింది మాత్రం ధోనీనే అని చెప్పాడు. తన వేషభాషలు కార్టూన్ క్యారెక్టర్‌లా ఉండడంతో రంజీ కోచ్ తనకు ఆ పేరు పెట్టినట్టు తెలిపాడు.

## హఫీజ్ 'టాప్-5'లో సచిన్, కోహ్లీ



**కరాచీ:** సచిన్ టెండ్యూలర్, విరాట్ కోహ్లీపై పాకిస్థాన్ బ్యాట్స్‌మన్ మహ్మద్ హఫీజ్ తన అభిమానాన్ని చాటుకున్నాడు. హఫీజ్ తన 'వరల్డ్ టాప్-5 బ్యాట్స్‌మెన్' జాబితాలో సచిన్, కోహ్లీకి చోటు కల్పించాడు. ట్విటర్‌లో ఓ అభిమాని ప్రపంచంలో ఐదుగురు అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ ఎవరని అడగ్గా హఫీజ్.. సచిన్, కోహ్లీతో పాటు లారా (వెస్టిండీస్), డివిలీర్స్ (దక్షిణాఫ్రికా), సయీద్ అన్వర్ (పాకిస్థాన్) పేర్లు చెప్పాడు.

# బిజినెస్

## నంబర్ 5గా యూనియన్ బ్యాంక్

ముంబై: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 5వ అతిపెద్ద బ్యాంకుగా అవతరించింది. మొన్నటివరకు అస్తిత్వంలో ఉన్న ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్ ఈ బ్యాంకులో విలీనం కావడంతో ఈ ఘనత లభించింది. ఆ బ్యాంకుల సిబ్బంది, కస్టమర్లు, బ్రాంచీలు కూడా యూనియన్ బ్యాంకు శాఖలుగా మారాయి. 12 కోట్ల మందికి పైగా కస్టమర్లు, 9500 పైగా శాఖలు, 13500 పైగా ఏటీఎంలతో నెట్‌వర్క్‌లో దేశ బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లో నాలుగో స్థానంలో యూనియన్ బ్యాంకు నిలిచింది. కస్టమర్లకు ఎప్పటిలాగానే సమర్థవంతమైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా బ్యాంక్ ఎండీ రాజ్‌కిరణ్ రాయ్ తెలిపారు.

## టర్మ్ ఇన్సూరెన్స్ మరింత ప్రియం!



### 15-40% పెరగనున్న ప్రీమియం?

**ఈనెల 10 నుంచి అమల్లోకి వచ్చే చాన్స్**

జీవిత బీమా టర్మ్ పాలసీలు మరింత ప్రియం కానున్నాయని ఇన్సూరెన్స్ బ్రోకర్లంటున్నారు. ఈ నెల 1 (బుధవారం) నుంచే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం పెరగాల్సి ఉండగా, కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఈ నెల 10కి వాయిదా పడిందని సమాచారం. టర్మ్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయాలనుకునేవారికి ప్రస్తుత ప్రీమియం రేటు మరి కొద్ది రోజులే అందుబాటులో ఉండనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.

**ఎంత పెరగొచ్చు..?**

ఇన్సూరెన్స్ కంపెనీని బట్టి ప్రీమియం పెంపు 15 శాతం నుంచి 40 శాతం వరకు ఉండవచ్చు.

**ఎందుకు పెంపు?**

రీ-ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన చార్జీలు పెరిగిన నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఏటేటా క్లెయిమ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో రీ-ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రీమియం పెంచడంతో ఇప్పుడు జీవిత బీమా కంపెనీలకూ పెంచక తప్పడం లేదు.

**ప్రీమియాన్ని నిర్ణయించే అంశాలు**

- దేశంలో ప్రజల మరణాల రేటు
- అప్పటివరకున్న ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ల రేటు
- పాలసీ హోల్డర్ వయసు
- వృత్తిపరమైన, వ్యక్తిగత రిస్క్
- రీఇన్సూరర్ భరించే రిస్క్, వసూలు చేసే ప్రీమియం

**రీ-ఇన్సూరర్ అంటే?**

ఇన్సూరెన్స్ కంపెనీలకు ఆర్థిక మద్దతు నిచ్చేవే రీ-ఇన్సూరెన్స్ సంస్థలు. బీమా సంస్థలు విక్రయించే టర్మ్ పాలసీల రిస్క్‌లో కొంత భాగాన్ని రీ-ఇన్సూరర్లు భరిస్తాయి. అంటే, బీమా సంస్థల వ్యాపార రిస్క్‌కు బీమా కవరేజీ కల్పించేవే రీ-ఇన్సూరెన్స్ కంపెనీలు.

**వాహన, ఆరోగ్య బీమా రెన్యువల్‌కు అదనపు గడువు**

- లాక్‌డౌన్ సమయంలో (మార్చి 25 - ఏప్రిల్ 14) వాహన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రెన్యువల్ ముగిసే వారికి ప్రభుత్వం కొంత ఊరట కల్పించింది. వాహన యజమానులు పాలసీ రెన్యువల్ ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 21 వరకు గడువు కల్పిస్తూ ఐఆర్‌డీఏఐ సర్క్యులర్ జారీ చేసింది.
- లాక్‌డౌన్ సమయంలో కాలపరిమితి ముగియనున్న ఆరోగ్య బీమా పాలసీల రెన్యువల్‌కు ఏప్రిల్ 21 వరకు గడువు కల్పించాలని ఇన్సూరెన్స్ కంపెనీలను కోరింది.

**ప్రయోజనాలు**

- తక్కువ ప్రీమియం.. అధిక కవరేజీ
- భవిష్యత్‌కు భద్రత
- ఆపత్కాలంలో కుటుంబానికి రక్షణ
- ఆర్థిక స్థిరత్వం
- జీవిత బీమాతోపాటు యాక్సిడెంట్, అనారోగ్యానికి కవరేజీ ఎంచుకునే అవకాశం

## అరబిందో, శాండోజ్ డీల్ రద్దు

న్యూఢిల్లీ: అమెరికాలో శాండోజ్ ఇంక్‌కు చెందిన జెనరిక్ ఓరల్ సాలిడ్స్, డెర్మటాలజీ వ్యాపారాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదిత డీల్‌ను రద్దు చేసుకున్నట్టు హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా తెలిపింది. ఈ డీల్ విలువ 90 కోట్ల డాలర్లు. రెండు కంపెనీల మధ్య కుదిరిన ఒప్పందానికి యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ నుంచి ఆశించిన సమయంలో ఆమోదం రాలేదని, ఈ నేపథ్యంలో ఒప్పందం రద్దు నిర్ణయం తీసుకున్నట్టు అరబిందో ఫార్మా తెలిపింది. శాండోజ్.. జెనరిక్ ఫార్మాసూటికల్స్, బయోసిమిలర్స్‌లో ప్రముఖ కంపెనీగా ఉంది. ఇది స్విట్జర్లాండ్‌కు చెందిన నోవార్టిస్ అనుబంధ కంపెనీ. అమెరికాలో శాండోజ్ ఇంక్‌కు చెందిన వాణిజ్యపరమైన కార్యకలాపాలు, మూడు మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను కొనుగోలు చేసేందుకు 2018 సెప్టెంబరులో అరబిందో ఫార్మా అమెరికా అనుబంధ సంస్థ అరబిందో ఫార్మా యూఎస్ఏ ఇంక్ ఒప్పందం కుదుర్చుకుంది. వాస్తవానికి ఈ డీల్ 2019లోనే ముగియాల్సి ఉంది. అయితే యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరగడం వల్ల డీల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఒకవేళ ఈ డీల్ పూర్తయి ఉంటే డెర్మటాలజీ రంగంలో రెండో అతిపెద్ద కంపెనీగా అరబిందో ఫార్మా మారేది. అంతేకాకుండా ప్రిస్క్రిప్షన్స్ పరంగా అమెరికాలో రెండో అతిపెద్ద జెనరిక్స్ కంపెనీగా అవతరించేది. అంతేకాకుండా ఈ డీల్‌తో 300 ఉత్పత్తులు అరబిందో చేతికి వచ్చేవి.

## జీవితాన్ని పునఃపరిశీలించుకోండి

**'కరోనా' తర్వాత దశకు సిద్ధం కండి ▸ సిబ్బందికి ఆనంద్ మహీంద్రా లేఖ**



న్యూఢిల్లీ: కరోనా సంక్షోభం ఇదివరకెన్నడూ ఎరుగనిదని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. లాక్‌డౌన్ సమయంలో వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని పునఃపరిశీలించుకోవాలని మహీంద్రా తన గ్రూప్ ఉద్యోగులకు సూచించారు. కరోనా తర్వాత దశకు సిద్ధం కావాలంటూ వారికి లేఖ రాశారు. మహీంద్రా గ్రూప్‌లో 2 లక్షలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుత సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకోవాలని.. ప్రస్తుత ఖాళీ సమయాన్ని సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణల కోసం ఉపయోగించుకోవాలని మహీంద్రా సూచించారు. భవిష్యత్ కోసం మరింత ఉన్నతాశయాల్ని నిర్దేశించుకోవాలని.. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

## ఇళ్ల అమ్మకాలకు గడ్డుకాలం

» కరోనాతో ఈ ఏడాది 35 శాతం తగ్గొచ్చు

» ఆఫీస్ స్పేస్ డిమాండ్ 30 శాతం తగ్గే అవకాశం: అనరాక్ అంచనా

న్యూఢిల్లీ: కరోనా వైరస్ విస్తృతి నేపథ్యంలో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న లాక్‌డౌన్ నివాస గృహాల రియల్ ఎస్టేట్ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో (ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణే, హైదరాబాద్) ఇళ్ల అమ్మకాలు 35 శాతం వరకు పడిపోవచ్చని ప్రాపర్టీ బ్రోకరేజ్ సంస్థ అనరాక్ అంచనా వేస్తోంది. కరోనా ప్రతికూల ప్రభావం వాణిజ్య (ఆఫీస్,రిటైల్) రియల్ ఎస్టేట్ రంగంపైనా ఉంటుందని పేర్కొంది. గత కొన్నేళ్లుగా మొత్తం ప్రాపర్టీ మార్కెట్లో మందగమనం ఉన్నప్పటికీ ఈ విభాగం మాత్రం మంచి పనితీరును కనబరుస్తోంది. అయితే ఈ ఏడాదిలో మాత్రం ఈ విభాగానికి దెబ్బ తప్పదని అనరాక్ చెబుతోంది. నికరంగా లీజుకు తీసుకునే ఆఫీస్ స్పేస్ 30 శాతం వరకు క్షీణించి 4 కోట్ల చదరపు అడుగుల (2019) నుంచి 2.8 కోట్ల చదరపు అడుగులకు తగ్గవచ్చని చెబుతోంది. ఇదేకాలంలో అద్దెకు తీసుకునే రిటైల్ ప్రదేశం 64 శాతం తగ్గి 85 లక్షల చదరపు అడుగుల నుంచి 31 లక్షల చదరపు అడుగులకు దిగజారవచ్చని పేర్కొంది. 'కోవిడ్-19- భారత రియల్ ఎస్టేట్‌పై ప్రభావం' పేరుతో అనరాక్ ఒక నివేదికను విడుదల చేసింది. కరోనాతో ఈ రంగంపై తీవ్రమైన ప్రభావం పడటమే కాకుండా కార్యకలాపాలు నిలిచిపోయినట్టు పేర్కొంది. వచ్చే కొన్ని త్రైమాసికాల్లో మరింత గడ్డుకాలం ఉంటుందని, ఈ రంగం రికవరీ కావడానికి ఇంకా కొన్నేళ్లు పడుతుందని తెలిపింది.

- 2020లో ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు ఏ విధంగా ఉంటాయో రెండు అంచనాల ఆధారంగా అనరాక్ పేర్కొంది. మొదటి అంచనా (బేస్ కేసు) ప్రకారం.. ఒక త్రైమాసిక కాలంలో కరోనా కట్టడి అయి ఈ రంగానికి సరిపోయేంతగా ఉద్దీపన లభిస్తే 2020లో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాదితో పోల్చితే 25% తగ్గి 2.61 లక్షల ఇళ్ల నుంచి 1.96 లక్షల ఇళ్లకు చేరుకోవచ్చు. రెండో అంచనా (డౌన్‌సైడ్ కేసు) ప్రకారం.. కరోనా ఒక త్రైమాసిక కాలంలో కట్టడి కాకుండా ఉండి ఎలాంటి ఉద్దీపన లభించకపోతే ఇళ్ల అమ్మకాలు 35 శాతం తగ్గి 1.7 లక్షల ఇళ్లకు చేరుకోవచ్చు.
- ఇళ్లను కొనుగోలు చేయాలనుకునే వారు తమ నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారు. ప్రాజెక్టు సైట్లకు వెళ్లడం లేదు. అంతేకాకుండా కొంత మంది ఇళ్ల ధరల్లో దిద్దుబాటుకు అవకాశం ఉండవచ్చని భావిస్తున్నారు.
- ఈ ఏడాదిలో కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇళ్ల సంఖ్య 25-30 శాతం తగ్గవచ్చని అంచనా. గత ఏడాదిలో ఇళ్ల సంఖ్య దాదాపు 2.37 లక్షల యూనిట్లుగా ఉంది.
- కరోనా నేపథ్యంలో చాలా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. ఒకవేళ ఈ విధానం విజయవంతం అయితే ఆఫీస్ లీజింగ్ కార్యకలాపాలపై భవిష్యత్‌లో దెబ్బపడవచ్చని అంటున్నారు.



## ప్రపంచ వృద్ధి -1%: యూఎన్

కరోనా ధాటికి ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు -1 శాతానికి క్షీణించవచ్చని ఐక్యరాజ్య సమితి(యూఎన్) తాజా నివేదిక హెచ్చరించింది. గతంలో పేర్కొన్న 2.5 శాతం వృద్ధితో పోలిస్తే అంచనాను ఏకంగా రుణాత్మక స్థాయికి కుదించింది. కరోనా కట్టడి కోసం ఆర్థిక కార్యకలాపాలపై ఆంక్షలు దీర్ఘకాలం పాటు కొనసాగితే ప్రపంచ వృద్ధి రేటు తాజా అంచనాలకు మించి పతనమయ్యే ప్రమాదం ఉందని ఐక్యరాజ్య సమితి అంటోంది. కరోనా దెబ్బకు దాదాపు 100 దేశాలు తమ సరిహద్దుల్ని మూసేశాయి. దాంతో అంతర్జాతీయ పర్యాటకం పూర్తిగా స్తంభించిపోయింది. ఈ దేశాల్లోని కోట్లాది మంది ఉద్యోగులు తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని యూఎన్ పేర్కొంది.

## కార్పొరేట్ విరాళాల వెల్లువ

దేశీయ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ ఏకంగా రూ.257.50 కోట్ల మొత్తాన్ని పీఎం-కేర్స్ నిధికి అందజేసింది. ఇందులో రూ.250 కోట్లు ఎన్‌టీపీసీ అందించగా మిగిలిన మొత్తం ఉద్యోగుల ఒక రోజు వేతనంగా ఉంది. ఇక రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, వైజాగ్ స్టీల్) రూ.6.16 కోట్లను అందించగా హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ రూ.150 కోట్ల మొత్తాన్ని ఇవ్వగా శ్రీరామ్ గ్రూప్ రూ.10 కోట్లు, కరూర్ వైశ్యా బ్యాంక్ రూ.5 కోట్ల మొత్తాన్ని అందించాయి.

## పేదలకు ఉచిత కరోనా నిర్ధారణ పరీక్ష

**అపోలో హెల్త్, ఐసీఐసీఐ లంబార్డ్ భాగస్వామ్యం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోవిడ్-19 వైరస్ నిర్ధారణ పరీక్షను పేదలకు ఉచితంగా అందించడానికి అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ అనుబంధ సంస్థ అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్, ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ చేతులు కలిపాయి. కోవిడ్-19 వైరస్ నిర్ధారణ కోసం జరిగే స్ర్కీనింగ్ ప్రక్రియకు అయ్యే వ్యయాన్ని భరించనున్నట్లు ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ భార్గవ్ దాస్‌గుప్తా తెలిపారు. కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షకు దాదాపు రూ.4,500 అవుతుంది. ప్రారంభంలోనే కరోనా వైరస్‌ను గుర్తించడం వల్ల వ్యాప్తిని అరికట్టడం సులభం అవుతుందని, పేద వారికి ఇది ప్రయోజనకరమని అపోలో హెల్త్ అండ్ లైఫ్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు. దీనికోసం ఐసీఐసీఐ లాంబర్డ్ రూ.5 కోట్లు వెచ్చించనుంది.

## మణిపాల్‌సిగ్నా ఆరోగ్య సంజీవని పాలసీ

న్యూఢిల్లీ: మణిపాల్‌సిగ్నా.. ఆరోగ్య సంజీవని బీమా పాలసీని విడుదల చేసింది. కోవిడ్-19 ట్రీట్‌మెంట్‌కు కూడా ఈ పాలసీ వర్తిస్తుందని పేర్కొంది. ఇన్‌పేషంట్ హాస్పిటలైజేషన్, వైద్య చికిత్సల కోసం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు హెల్త్ కవరేజీని ఈ పాలసీ ద్వారా అందించనుంది.

## స్టార్టప్‌లకు కష్టకాలమిది

కరోనా సంక్షోభంతో ఎదురుకానున్న గడ్డ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థలు స్టార్టప్‌లను హెచ్చరించాయి. ఈ కష్టకాలం లో ఉద్యోగులను తొలగించడానికి బదులుగా వేతన చెల్లింపు ల్లో కోత లేదా వాయిదా వంటి ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించాయి. వ్యాపార ప్రణాళికల విషయంలో స్టార్టప్ వ్యవస్థాపకులు క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నాయి.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 2వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 335 | విశాఖపట్నం | 345 |
| 3వ తేదీకి.. | | వరంగల్ | 338 |
| చిత్తూరు | 363 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

**ఫామ్‌గేట్ ధర** (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | విజయవాడ | 62 |
| వరంగల్ | 70 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 70 | ఒంగోలు | 58 |
| కరీంనగర్ | 70 | చిత్తూరు | 70 |
| కర్నూలు | 70 | నెల్లూరు | 70 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 63 |
| గోదావరి | 65 | | |

## బతుకు 'బండి' లాక్..డౌన్

- తిరుపతిలో కంపెనీ మూతతో బైకుపై కృష్ణాజిల్లాకు పయనం
- లాక్‌డౌన్ ఉల్లంఘించారంటూ బాపట్లలో సీజ్ చేసిన పోలీస్
- మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

బాపట్ల టౌన్, మండవల్లి, ఏప్రిల్ 2: తిరుపతిలో పని చేసుకొనే శ్రీనివాసరావు కడుపు మీద కొట్టింది కరోనా. కృష్ణా జిల్లా మండవల్లి మండల పుట్లచెరువుకు చెందిన పేటాడ శ్రీనివాసరావు(22) చిత్తూరు జిల్లా తిరుపతిలో టీషర్టుల తయారీ కంపెనీలో పనిచేస్తున్నారు. లాక్‌డౌన్‌తో కంపెనీ మూసివేయడంతో ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో గుంటూరు జిల్లా బాపట్ల మండలం స్టూవర్టుపురంలోని వెదుళ్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శ్రీనివాసరావును ఆపారు. ఆయన ప్రయాణిస్తున్న బైకు చెన్నై రిజిస్ట్రేషన్‌ది కావటం, కరోనా లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమించి మూడు జిల్లాల సరిహద్దులు దాటి రావటంపై పోలీసులు ప్రశ్నించారు. కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. లాక్‌డౌన్ అనంతరం బైక్‌ను అందజేస్తామని చెప్పారు. దీంతో శ్రీనివాసరావు కాలినడకన అక్కడినుంచి బాపట్ల బస్‌స్టాండ్‌కు చేరుకొన్నారు. స్వగ్రామానికి వెళ్లేందుకు మార్గం కనిపించకపోవడంతో మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయాన్ని సెల్ఫీ వీడియోలో ఆయన బంధువులకు తెలియజేశారు. అయితే, శ్రీనివాసరావుకు కౌన్సెలింగ్ ఇచ్చి రాత్రి సమయంలో వ్యక్తిగత పూచికత్తుపై నోటీసు ఇచ్చి వదిలిపెట్టామని పోలీసువర్గాలు తెలిపాయి. "సంఘటన వివరాలు దర్యాప్తు తరువాతే తెలుస్తాయి. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని శ్రీనివాసరావు బంధువులు చెబుతున్నారు" అని బాపట్ల పట్టణ సీఐ బీ అశోక్‌కుమార్ వివరణ ఇచ్చారు.

## త్వరలో 25వేల టెస్టింగ్ కిట్లు

- మెడ్‌టెక్ జోన్‌లో బెడ్‌షీట్లు, మాస్కుల తయారీ: మేకపాటి

అమరావతి, ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమల్లో కరోనా నియంత్రణకు అవసరమైన ఉత్పత్తుల తయారీపై అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి నిర్దేశించారు. ఇందులోభాగంగా కరోనా సోకిన వారికి చికిత్సలో ముఖ్యమైన వెంటిలేటర్ల తయారీ బాధ్యతను విశాఖ మెడ్‌టెక్ జోన్‌కు అప్పగించినట్లు తెలిపారు. 10రోజుల్లో 3వేల వెంటిలేటర్లు, 25వేల కరోనా టెస్టింగ్‌కిట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. భవిష్యత్తు అవసరాలకు మరో ఆరువేల వెంటిలేటర్ల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే వస్త్ర తయారీ రంగంలో ఉన్న పరిశ్రమలు, రిలయన్స్ పరిశ్రమతో సమన్వయం చేసుకుని మాస్కులు, పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లు(పీపీఈ) తయారీ చేపట్టాలన్నారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని వస్త్రయానిట్ల పరిశ్రమలు అత్యవసరంగా ఒక్కసారే వినియోగించే బెడ్‌షీట్ల తయారీపై దృష్టిపెట్టాలన్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి మేకపాటి గురువారం నెల్లూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ, డైరెక్టర్ సుబ్రమణ్యంలతో పాటు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లతో ఈ విషయమై సమీక్షించారు.

### 'కరోనా' డ్యూటీలో టీచర్లు

- డాక్టర్లు, వలంటీర్లకు తోడుగా ఉండేలా ప్రభుత్వం చర్యలు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి నివారణ కార్యకలాపాల్లో ఉపాధ్యాయులను మరింత భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎక్కడెక్కడ వారి సేవలు అవసరం, ఎవరు ఏ డ్యూటీ చేయాలనే విషయంపై కసరత్తు చేస్తోంది. స్థానిక అవసరాలను బట్టి ఏయే కేటగిరీల టీచర్ల భాగస్వామ్యం అవసరమో ఉన్నతాధికారులు నిర్ణయిస్తున్నారు. అయితే మహిళా టీచర్లకు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి, వయసు పైబడిన వారికి మినహాయింపు ఇస్తున్నారు. 'కరోనా' డ్యూటీలో స్వచ్ఛందంగా పాలుపంచుకునే టీచర్ల జాబితాలను రూపొందించి, వారిని సమీపంలోని తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్లలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు ఇస్తున్నారు. జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు ఈ పనిలో నిమగ్నమయ్యారు.

### కరోనా అనుమానంతో వెలి!

హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 2: కరోనా సోకి ఉండవచ్చన్న అనుమానంతో ఓ వృద్ధుడిని కట్టుకున్న భార్య, కన్న కొడుకు ఇంటి నుంచి వెలివేశారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లో గురువారం ఈ దారుణం వెలుగు చూసింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వృద్ధుడు విజయవాడలోని ఓ కార్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రవాణా సాధనాలు లేకపోవడంతో అక్కడే ఉండి రెండు మూడు రోజులకోసారి ఇంటికి వస్తున్నాడు. విజయవాడ ప్రాంతంలో కరోనా వైరస్ ప్రబలడంతో బుధవారం సాయంత్రం ఇంటికి చేరిన అతడ్ని కుటుంబ సభ్యులు.. వైరస్ అనుమానంతో ఇంటిలోకి అడుగు పెట్టనీయలేదు. భార్య, కొడుకు కూడా అభ్యంతరం పెట్టారు. దిక్కుతోచని స్థితిలో వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు.

### కరోనా నుంచి కాపాడు గంగమ్మా!



కరోనా వైరస్ కబళిస్తున్న వేళ ఆ మహమ్మారి నుంచి మానవాళిని కాపాడు తల్లీ.. అంటూ మత్స్యకారులు గంగమ్మతల్లికి పూజలు చేశారు. కరోనాను తరిమికొట్టాలని కోరుతూ.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం వాసులు గురువారం సముద్రతీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకుతెరువు కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్లిన మత్స్యకారులు క్షేమంగా స్వగ్రామాలకు చేరుకునేలా చూడాలని వేడుకున్నారు. **- ఎచ్చెర్ల**

### ఏపీలో విదేశీయుల గుర్తింపు సవాలే.. కేంద్ర సర్వే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నవారిని గుర్తించడం, ఐసోలేట్ చేయడం పెద్ద సవాలుగా మారిందని కేంద్ర ప్రభుత్వం తేల్చింది. కరోనాను ఎదుర్కోవడంలో భాగంగా రాష్ట్రాల సన్నద్ధతపై "కోవిడ్ 19పై జాతీయ సన్నద్ధత సర్వే" పేరిట కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ మార్చి 25 నుంచి 30 వరకు సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో జిల్లా కలెక్టర్లు, 2014 - 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారుల అభిప్రాయాలను సేకరించి నివేదిక రూపొందించింది. లాక్‌డౌన్ ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వస్తుడడం ప్రకాశం జిల్లాకు సమస్యగా మారిందని అందులో వివరించింది.

### తెలంగాణలో ఒక్క రోజే 27 కేసులు

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా కేసులు భారీగా నమోదవుతున్నాయి. గడిచిన రెండు రోజుల్లో 57 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. గురువారం కొత్తగా 27 మందికి వైరస్ ఉన్నట్టు తేలిందని ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 154కు పెరిగింది. ఇందులో 14 మంది ఇప్పటికే కోలుకుని ఇంటికెళ్లిపోగా, గురువారం మరో ముగ్గురిని డిశ్చార్జ్ చేశారు. ఇంకో 128 మంది గాంధీ, కింగ్ కోఠి, చెస్ట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నరు. 9 మంది మరణించిన సంగతి తెలిసిందే. బుధవారం కరోనా కేసుల వివరాలను వైద్యారోగ్య శాఖ, సీఎం కార్యాలయం ప్రకటించగా, గురువారం మంత్రి ఈటల వెల్లడించారు. ఓ తెల్ల కాగితంపై లెక్క రాసి మీడియాకు విడుదల చేశారు. కొత్తగా వైరస్ బారిన పడ్డవారు ఎవరన్నది మంత్రి స్పష్టం చేయలేదు. వాళ్లు ఏ జిల్లా వాళ్లన్నది కూడా ప్రకటించలేదు. అయితే, మహబూబ్‌నగర్, ములుగు, జనగాం, సంగారెడ్డి, వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో కరోనా కేసులు నమోదైనట్టు ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు గురువారం ప్రకటనలు విడుదల చేశారు. కాగా, ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన 900 మందిని ప్రభుత్వం గుర్తించింది. రెండు రోజుల్లో వారిలోని 800 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారంతా స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. మరో 130మంది కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. తెలంగాణ నుంచి 1,030 మంది మర్కజ్‌కు వెళ్లివచ్చినట్లు అధికారులు లెక్క తేల్చారు. మర్కజ్ వెళ్లిన వారిలో ఎక్కువ మంది కరోనా బారిన పడుతుండటంతో మిగిలిన వారందరిలోనూ భయం పెరిగింది. దాంతో ఒక్కసారిగా గాంధీ ఆస్పత్రికి క్యూ కట్టారు. మర్కజ్ బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి.

# కొత్తగా 38



విజయవాడలోని ఓ బ్యాంకులో భౌతిక దూరం పాటించేలా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలకు వెళ్లినవారే కావడం గమనార్హం. కృష్ణాజిల్లాలో గురువారం 8 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లావ్యాప్తంగా కేసుల సంఖ్య 23కు చేరింది. జిల్లా నుంచి ఢిల్లీ సమావేశాలకు హాజరైన వారిలో ఇప్పటికే 10మందికి కరోనా సోకింది. తాజాగా నిర్ధారణ అయినవారిలో ఇద్దరు జగ్గయ్యపేట, ఒకరు నూజివీడు, మరొకరు చందర్లపాడు మండలానికి చెందినవారు కాగా, మిగిలినవారు విజయవాడ వాసులు. విజయవాడకు చెందిన ఒకే కుటుంబంలో ఏడుగురికి కరోనా నిర్ధారణ అయింది. ఈ ఇంట్లో తండ్రి, కొడుకు ఢిల్లీ సమావేశాలకు హాజరయ్యారు. ప్రకాశం జిల్లాలో గురువారం నమోదైన 2 కేసుల్లోనూ బాధితులు కూడా ఢిల్లీ వెళ్లి వచ్చినవారే. ఈ జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 17కేసులు గుర్తించగా వారిలో ఒక్కరు తప్ప మిగిలిన వారందరికీ ఢిల్లీ లింక్ ఉన్నట్లు తేలింది. చిత్తూరు జిల్లాలో తాజాగా నమోదైన 3కేసులతో ఇక్కడ బాధితుల సంఖ్య 9కి చేరింది. ఇదిలా ఉండగా, పంజాబ్‌లో చదువుకుంటున్న తిరుమల బాలాజీనగర్‌కు చెందిన యువకుడు(19) కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరగా పరీక్షల్లో నెగెటివ్ వచ్చింది. కడప జిల్లాలో బుధవారం ఒక్కరోజే 15 పాజిటివ్ కేసులు నమోదు కాగా గురువారం మరో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. పశ్చిమ గోదావరి జిల్లాలో గురువారం మరొకరికి వైరస్ సోకింది. దీంతో ఈ జిల్లాలో బాధితుల సంఖ్య 15కు చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో కరోనా తొలి పాజిటివ్ కేసుగా నమోదైన ఓ యువకుడి ఆరోగ్యం కుదుటపడటంతో శుక్రవారం కాకినాడ జీజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేయనున్నారు. కాగా కర్నూలు జిల్లాలో 3 ప్రిజెంటివ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే ఇవి నిర్ధారణ కావాల్సి ఉంది.

### ఏపీలో మరో రెండు ల్యాబ్‌లు

రాష్ట్రంలో కరోనా కేసులు పెరగడంతో గుంటూరు, కడపలో కూడా వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. గుంటూరులో గురువారం క్వాలిటీ టెస్టింగ్ పూర్తి చేయడంతో శుక్రవారం నుంచి నిర్ధారణ పరీక్షలు మొదలుపెడతారు. కడపలో శుక్రవారం క్వాలిటీ టెస్టింగ్ చేసి, శనివారం నుంచి పరీక్షలు ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రంలో కరోనా ల్యాబ్‌ల సామర్థ్యం 570కి పెరుగుతుంది.

### వార్డు వలంటీరుకు కరోనా

చిత్తూరు జిల్లా తిరుపతి నగరానికి చెందిన వార్డు వలంటీరుకు కరోనా నిర్ధారణ అయింది. గతనెల 20న ఢిల్లీ వెళ్లిన ఆయన నిజాముద్దీన్ మర్కజ్‌లో రెండు రోజులు గడిపారు. అక్కడి నుంచి వచ్చాక హోమ్ క్వారంటైన్‌లో ఉండకుండా బాధ్యత మరిచి బాహ్య సంచారం చేశారు. స్థానికుల ఫిర్యాదుతో అధికారులు మార్చి 30న ఆయన్ను తిరుపతి రుయా ఆస్పత్రి క్వారంటైన్‌కు తరలించారు.

**జిల్లాల వారీగా కేసుల వివరాలు...**

| | |
|---|---|
| గుంటూరు | 20 |
| కడప | 18 |
| ప్రకాశం | 17 |
| కృష్ణా | 23 |
| పశ్చిమ గోదావరి | 15 |
| విశాఖపట్నం | 11 |
| తూర్పు గోదావరి | 9 |
| చిత్తూరు | 9 |
| నెల్లూరు | 24 |
| అనంతపురం | 2 |
| కర్నూలు | 1 |
| మొత్తం | 149 |

### మసీదులో గుజరాత్ బృందం!

గుజరాత్‌లోని వడోదర నుంచి పది మందితో కూడిన జమాత్ బృందం గత నెల 12న రైల్లో రేణిగుంట చేరుకుంది. అక్కడనుంచి మదనపల్లె వెళ్లి ఓ మసీదులో ఆరు రోజులు గడిపింది. తర్వాత 18న బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లె మసీదు చేరుకుని అక్కడే ఉంటున్నారు. మసీదు నిర్వాహకులు, కొందరు స్థానికులు ఈ బృందం గురించి అధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటించారు. ఆలస్యంగా వీరి ఉనికిని గుర్తించిన గ్రామానికే చెందిన ముస్లింలు మసీదు నిర్వాహకులతో గొడవకు దిగారు. వారే సమాచారమివ్వడంతో పోలీసు, వైద్య, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని వారిని, మసీదు నిర్వాహకులను క్వారంటైన్‌కు తరలించారు.



## పారిశుద్ధ్య సిబ్బంది పాదాలు కడిగి..!

కాశీబుగ్గ, ఏప్రిల్ 2: కరోనా కట్టడిలో తమవంతు పాత్రపోషిస్తున్న పారిశుద్ధ సిబ్బందిని గౌరవిస్తూ ఓ మెడికల్ రిప్రంజెంటేటివ్ వారి పాదాలను కడిగారు. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గకు చెందిన మెడికల్ రిప్రంజెంటేటివ్ మణియాల శ్రీను.. పలాస మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం అక్కడి పారిశుద్ధ్య సిబ్బంది పాదాలను నీటితో శుభ్రం చేశారు. అనంతరం ఒక్కొక్కరికి 12.5 కేజీల బియ్యం అందజేశారు.

# లాక్... 'డౌన్'

- ఆంక్షలపై వింత ఉత్తర్వులు
- సాయంత్రం 4 దాకా బ్యాంకులు
- రెండు విడతల్లో రేషన్ పంపిణీ
- ఆఫీసులకు రావాల్సిందేనన్న ఉత్తర్వులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు 'లాక్' చేయమంటారు! మరోవైపు... అవసరంలేని వారినీ 'ఓపెన్' చేయమంటున్నారు! దీంతో రాష్ట్రంలో లాక్‌డౌన్ వ్యవహారం గందరగోళానికి దారి తీస్తోంది. జనం వీలైనంత వరకు తక్కువగా రోడ్లమీదికి వచ్చేలా చూడాల్సిన ప్రభుత్వం... మరింత ఎక్కువ సమయం, ఎక్కువమంది ఇళ్ల నుంచి బయటికి వచ్చే నిర్ణయాలు తీసుకుంటోంది. లాక్‌డౌన్ అమలులోకి వచ్చిన తర్వాత బ్యాంకులను మధ్యాహ్నం 1 గంట వరకే తెరిచి ఉంచుతున్నారు. ఇప్పుడు ఈ సమయాన్ని సాయంత్రం 4 గంటల వరకు పొడిగించారు. అంటే... జనం బ్యాంకు పనుల మీద బయటికి వచ్చేందుకు అవకాశం కల్పించడమే! రేషన్ పంపిణీ పరిస్థితి మరీ చిత్రంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున ఉచిత బియ్యం, కందిపప్పును రాష్ట్రాల ద్వారా అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొన్ని రోజులుగా రేషన్ సరుకులు సరఫరా చేస్తోంది. నిజానికి ఈ సరుకులను వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటికే ఇవ్వడం ఉత్తమం. లేని పక్షంలో... కనీసం సరుకులను ఒకేసారి ఇచ్చేస్తే ప్రజలు దీని కోసం మళ్లీ మళ్లీ బయటికి రావాల్సిన అవసరం ఉండదు. కానీ... 15వ తేదీ వరకు ఒక విడత, ఆ తర్వాత మరో విడతలో ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కో రేషన్ డీలరు వద్ద సగటున 500 రేషన్ కార్డులున్నాయి. రోజుకు 60-70 కుటుంబాలకు రేషన్ ఇచ్చినా వారం రోజుల పాటు పడుతుంది. కొన్నిచోట్ల 10 రోజులు పడుతోంది. అంటే తొలి విడతలో పది రోజులు, 15వ తేదీ దాటాక మరో 10 రోజులు జనం రోడ్డుమీద ఉండాల్సిందే. వలంటీర్ల ద్వారా ఇంటికే సరుకులు పంపిణీ చేయాలనే డిమాండ్‌ను పట్టించుకోకపోగా... ఇలా రెండేసి విడతల్లో సరుకులు పంపిణీ చేయడం మరీ చిత్రం! ప్రభుత్వ ఉద్యోగుల విషయంలోనూ ఇదే అస్పష్టత. ఉద్యోగులు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేదని... ఇంటి నుంచే పని చేయవచ్చునని స్పష్టం చేశారు. కానీ... కొన్ని శాఖల్లో ఉన్నతాధికారులు కార్యాలయాలు తెరవాలని, కొద్దిమంది సిబ్బందితో అయినా పనిచేయాలని అంటున్నారు. అత్యవసర సేవల సిబ్బంది కాకుండా.... ఇతర శాఖల వారికీ ఇలాంటి ఉత్తర్వులు రావడంతో వారూ అనివార్యంగా బయటకు రావాల్సి వస్తోంది.

**ఇప్పుడే ఇసుక...:** రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులిచ్చారు. వర్షాకాలం రాకముందే స్టాక్ పాయింట్లలో నిల్వ చేసేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామంటున్నారు. నిజానికి... మే నెలలో ఈ పని చేయవచ్చు. ఏప్రిల్‌లో ఇసుకను తవ్వి తీయాల్సిన పని లేదని అంటున్నారు. ఇప్పుడు లాక్‌డౌన్ సమయంలోనూ ఇసుక తవ్వకాలకోసం డ్రైవర్లు, కూలీలూ బయటికి రాక తప్పదు. పైగా లాక్‌డౌన్ నేపథ్యంలో తగిన పర్యవేక్షణ ఉండదని, అక్రమాలకు కూడా అవకాశమిచ్చినట్లవుతుందని చెబుతున్నారు. ఒకవైపు కరోనా నియంత్రణకు భౌతిక దూరం పాటించడం అత్యంత అవసరమంటూనే.... మరోవైపు లాక్‌డౌన్‌పై ప్రణాళికా బద్ధంగా వ్యవహరించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నిత్యావసరాలు, కూరగాయల కోసం ఉదయం 10 గంటల వరకు జనం రోడ్లపైనే ఉంటున్నారు. ఇప్పుడు నిత్యావసరాలకు సంబంధించని రంగాలకు మరింత వెసులుబాటు ఇవ్వడం 'లాక్‌డౌన్' స్ఫూర్తిని దెబ్బతీయడమేనని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.




బయటికొస్తే కరోనా ఇంటికొచ్చినట్టేనంటూ పోలీసుల ప్రచారం

# విశాఖలోనూ వైరాలజీ ల్యాబ్!

- కేజీహెచ్‌లో త్వరలోనే ఏర్పాటు
- కాకినాడ జీజీహెచ్‌లో 501 పరీక్షలు
- ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ బాబ్జీతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి



కాకినాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కరోనా అనుమానిత కేసులు నానాటికీ పెరుగుతుండటంతో త్వరలోనే ప్రభుత్వం విశాఖ కేజీహెచ్‌లో వైరాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనుందని కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల(ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ అన్నారు. కరోనా సోకిన వారికి, అనుమానితులకు జీజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్‌లో అందుతున్న సేవలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

***వైరాలజీ ల్యాబ్‌లో కొవిడ్-19 పరీక్షలు ఎప్పటి నుంచి చేస్తున్నారు?***

ఇక్కడ మార్చి 18నుంచి పరీక్షలు చేస్తున్నాం. నేను డీఎంఈగా పనిచేసిన సమయంలో 2019లో కేంద్ర ఆరోగ్యశాఖ ద్వారా సీఎం జగన్, మంత్రి ఆళ్ల నాని, ముఖ్య కార్యదర్శి సహకారంతో కాకినాడ జీజీహెచ్‌లో వైరాలజీ ల్యాబ్ ఏర్పాటుకు కృషి చేశాను. అప్పట్లో దీనికి కేంద్రం రూ.1.7కోట్లు నిధులిచ్చింది. దీనివల్ల తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన అనుమానితులకు పరీక్షలు చేయగలుగుతున్నాం.

***ఇప్పటి వరకు పాజిటివ్ వచ్చిన కేసులెన్ని?***

తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 243మందికి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 258మందికి పరీక్షలు చేశాం. తూర్పున 9 మందికి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 8మందికి కరోనా నిర్ధారణ అయింది.

***రాష్ట్రంలో పాజిటివ్ కేసులు పెరగడంపై ఏమంటారు?***

ఆందోళన చెందాల్సిన పనిలేదు. కాకినాడ జీజీహెచ్‌కు లండన్ నుంచి వచ్చిన రాజమహేంద్రవరం యువకుడికి పాజిటివ్ వచ్చింది. అతను ఇప్పుడు కోలుకుంటున్నాడు. పాజిటివ్ వస్తే ఏదో అయిపోతుందనుకోవడం అవివేకం. మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అలాగని రోడ్లపై ఇష్టానుసారం తిరిగి రోగం అంటించుకోకుండా ఉంటే మంచిది.

***ఇప్పుడున్న ల్యాబ్‌లో వసతులు, పరికరాలు, సిబ్బంది సరిపోతున్నారా?***

ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి సీఎం మంజూరు చేసిన రూ.10లక్షలతో పారామెడికల్, సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బందిని తాత్కాలికంగా భర్తీ చేసుకున్నాం.

***ఇక్కడి ల్యాబ్‌లో కరోనా బాధితులను గుర్తించే నిపుణులున్నారా?***

ఉన్నారు. ఆర్ఎంసీ నుంచి మైక్రోబయాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మూర్తి వైరస్ ఉధృతి, సోకిన తర్వాత, సోకకముందు వ్యక్తుల్లో ఉండే లక్షణాలపై పుణెలో శిక్షణ పొందారు. ఆయనకు అసిస్టెంట్‌గా మరో వైద్యుడు కిరణ్ (పల్మనాలజీ నిపుణుడు) ఉన్నారు.

***అనుమానిత కేసులు పెరిగితే ల్యాబ్ సామర్థ్యం సరిపోతుందా?***

ఈ విషయాన్ని ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఆళ్ల నాని మరో వైరాలజీ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. త్వరలో విశాఖ కేజీహెచ్‌లో ల్యాబ్ ఏర్పాటవుతుంది. అప్పుడు ఇక్కడ ఒత్తిడి తగ్గుతుంది.

***ఇతర దీర్ఘకాలిక రోగుల పరిస్థితి ఏంటి?***

ఇబ్బంది లేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులన్నీ పనిచేస్తున్నాయి. కాకినాడ జీజీహెచ్‌లో ప్రస్తుతం 500మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. వీరికి రెగ్యులర్‌గా వైద్యం అందుతోంది. రోజూ 300-400 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారు.

# వైద్యులకేదీ రక్షణ!



- పీపీఈలు లేవు.. డిస్పోజబుల్ గౌన్లే
- ఈఎన్‌టీ డాక్టర్లకే ఎన్-95 మాస్కులు
- గట్టిగా అడిగితే సస్పెండ్ చేస్తామని సిబ్బందికి ఉన్నతాధికారుల బెదిరింపు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇది కరోనా సమయం.. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తోటి వారిని తాకాలంటేనే జనం భయపడిపోతున్నారు. అలాంటిది ఇది అంటువ్యాధి అని.. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వైరస్ సోకుతుందని తెలిసినా.. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది మాత్రం మానవతా దృక్పథంతో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది రక్షణ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏపీలో కరోనా ప్రభావం మొదలై నెల కావస్తున్నా ఇంకా వైద్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ), ఎన్-95 మాస్కులు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో ఎక్కడ తమకు వైరస్ సోకుతుందోనన్న ఆందోళనతో వైద్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ అధికారులు వాటి కొనుగోలుపై దృష్టి పెట్టలేదు. విజయవాడ, తిరుపతి, నెల్లూరు, విశాఖలోని కరోనా ఆస్పత్రుల్లో ఎయిడ్స్ రోగులకు శస్త్రచికిత్స చేసే సమయంలో, డెలవరీల సమయంలో ఉపయోగించే సాధారణ డిస్పోజబుల్ గౌన్లను సిబ్బందికి ఇస్తున్నారు. దీనివల్ల పూర్తి స్థాయిలో రక్షణ ఉండదని వైద్యులు వాపోతున్నారు. ఎన్-95 మాస్కులు లేవని సాధారణ మాస్కులు ఇస్తున్నారు. ఈఎన్‌టీ డాక్టర్లకు మాత్రమే ఎన్-95 మాస్కులు, పీపీఈలు ఇస్తున్నారు. ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన రోగులకు చికిత్స చేయడానికి ఒక డాక్టర్, స్టాఫ్‌నర్స్, ఎఫ్ఎన్‌వో లేదా ఎంఎన్‌వో, క్లీనింగ్ సిబ్బంది ఇలా నలుగురు మాత్రమే ఐసోలేషన్ గదిలోకి వెళ్తున్నారు. అంటే నాలుగు షిఫ్టుల్లో కలిపి 16 మంది ఉంటారు. వారికి కూడా ఎన్-95 మాస్కులు, పీపీఈలు ఇవ్వడంలేదు. ఐసోలేషన్ వార్డుల్లోకి వెళ్లే సిబ్బందికి త్రీ లేయర్, సాధారణ గౌన్లను మాత్రమే ఇస్తున్నారు. 16 మంది సిబ్బందికి కలిపి 2 కిట్లు మాత్రమే ఇస్తున్నారు. వాటిలో 12 గౌన్లు మాత్రమే ఉంటాయి. విజయవాడ, విశాఖ లాంటి చోట్ల ఈ పరిస్థితిపై గట్టిగా ప్రశ్నించిన సిబ్బందిని సస్పెండ్ చేస్తామని డీఎంఈ, సూపరింటెండెంట్లు బెదిరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**కళ్లు తెరవని కార్పొరేషన్..**

రాష్ట్రంలో మార్చి నుంచే కరోనా నివారణ చర్యలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రాష్ట్రంలో ఎన్-95 మాస్కులు, పీపీఈ కొరత ఉంది. ఈ విషయాన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, డీఎంఈ అధికారులు అనేకసార్లు కార్పొరేషన్ దృష్టికి తీసుకువెళ్లారు. కానీ వారు మాత్రం ఆర్డర్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారు. ఒకవైపు ఐసోలేషన్ వార్డుల్లో ఎన్-95, పీపీఈలు లేవని వైద్యులు ఆందోళన చెందుతుంటే.. డీహెచ్, ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డులు లేవు కాబట్టి అక్కడ సిబ్బందికి క్లాత్ మాస్కులు సరిపోతాయని ఉన్నతాధికారులు స్పష్టంగా చెబుతున్నారు. ఏపీవీవీపీ కమిషన్ ఓ అడుగు ముందుకేసి హెచ్‌డీఎస్ ఫండ్స్ నుంచి క్లాత్ మాస్కులు, బ్లూ కలర్ డ్రెస్‌లు కుట్టించి వైద్యులకు అందించాలని సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీచేశారు. సాధారణంగా కరోనా అనుమానితులు తొలుత దగ్గరల్లోని ఆస్పత్రులను ఆశ్రయిస్తారు. వారిని పరీక్షించే వైద్యులు క్లాత్ మాస్కులు వాడడం వల్ల వారికి కూడా కరోనా సోకే ప్రమాదం ఉంది. కాబట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో కొంత మందికైనా ఎన్-95, పీపీఈలు ఇవ్వాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

# చికిత్స, రక్షణకు చర్యలేవీ!

- బాధితులకు వైద్యం, వైద్య సిబ్బందికి సదుపాయాల కల్పన వివరాలివ్వండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 'ఆశ్రం'లో పీపీఈల కల్పనపై ఆక్షేపణ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొవిడ్-19 బాధితులకు చికిత్స, వారికి వైద్యం చేస్తున్న సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ) కల్పనకు సంబంధించి తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాధితులకు చికిత్స, వైద్య సిబ్బందికి పీపీఈల కల్పనలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతోపాటు కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపి ఉత్తర్వులు జారీచేసింది. అల్లూరి సీతారామరాజు వైద్య విజ్ఞాన సంస్థ(ఆశ్రం) వైద్య కళాశాలలో కరోనా బాధితులకు సేవలందించే సిబ్బందికి పీపీఈలు అందుబాటులో లేవంటూ మీడియాలో వచ్చిన వార్తలతో పాటు, అదే వ్యవహారానికి సంబంధించి అక్కడి వైద్యులు రాసిన లేఖను ధర్మాసనం సుమోటోగా స్వీకరించింది. బుధవారం వాటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆశ్రంలో పరిశీలించి నివేదించాలని ఏలూరు మొదటి అదనపు జిల్లా జడ్జి టి.మల్లికార్జునరావును ఆదేశించింది. ఆ మేరకు జడ్జి అందించిన నివేదికలో.. ప్రభుత్వం ఆశ్రంకు 200 పీపీఈలు, 100 ఎన్-95 మాస్కులు అందించిందని, అయితే కరోనా అనుమానితులకు ఆస్పత్రి కనీస వైద్యం అందించలేదని వివరించారు. గురువారం మరోమారు ఈ వ్యవహారంపై ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సీహెచ్ సుమన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్రం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పీపీఈలను ప్రభుత్వం సమకూరుస్తోందని వివరించారు. వాటిని వైద్యులందరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ బి.కృష్ణమోహన్ వాదనలు వినిపిస్తూ..




కరోనా బాధితులకు చికిత్స అందించే వ్యవహారంలో, వైద్య సిబ్బందికి సదుపాయాల కల్పనలో ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలను, కేంద్రం మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాల్సిందేనని స్పష్టంచేశారు. ఇరువురి వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పీపీఈలు అందుబాటులో ఉన్నాయన్న మల్లికార్జునరావు నివేదికతో విభేదించింది. బుధవారం తాము ఉత్తర్వులు జారీచేశాకే ఆశ్రంలో పీపీఈలు అందుబాటులో ఉంచినట్లుందని అనుమానం వ్యక్తంచేసింది. అక్కడి కరోనా బాధితుల్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. వారి చికిత్సా వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది.

## లాక్‌డౌన్‌పై అరుణాచల్ సీఎం అయోమయం

**15తో ముగుస్తుందని ట్వీట్.. వెంటనే తొలగింపు**

ఈటానగర్, ఏప్రిల్ 2: జనతా కర్ఫ్యూ ఈ నెల 15తో ముగుస్తుందని అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమా ఖండూ తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. అయితే, దానిని కొద్ది నిమిషాల తర్వాత తొలగించారు. అది ట్వీట్ చేసిన అధికారికి హిందీ అంతగా తెలియకపోవడం వల్ల అలా జరిగిందని, అందుకే దానిని తొలగించామని ఖండూ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ తర్వాత ఇది జరిగింది. లాక్‌డౌన్ పొడిగించవచ్చనే ఊహాగానాలు చెలరేగుతున్నాయని, అయితే.. జమాత్ సంఘటన తర్వాత విపరీతంగా పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసుల వల్ల కొన్ని ఆంక్షలు అమలులో ఉండవచ్చని ట్విటర్‌లో ఖండూ పేర్కొన్నారు.

## లాక్‌డౌన్ వల్ల మరణాలు సగానికి తగ్గుతాయి

- 21 రోజుల తర్వాత దేశవ్యాప్త లాక్‌డౌన్ అవసరం లేదు
- వైరస్ తీవ్రత ఎక్కువున్న చోట వేగంగా పరీక్షలు చేయాలి
- ప్రముఖ కార్డియాలజిస్టు దేవీ ప్రసాద్ శెట్టి

బెంగళూరు, ఏప్రిల్ 2: లాక్‌డౌన్ వల్ల భారతదేశంలో కరోనా మరణాలు 50 శాతం తగ్గుతాయని ప్రముఖ కార్డియాలజిస్టు దేవీ ప్రసాద్ శెట్టి గురువారం అన్నారు. ప్రస్తుతం ఉన్న లాక్‌డౌన్ కాలపరిమితి ముగిశాక మళ్లీ దేశమంతా లాక్‌డౌన్‌ను అమలు చేయాల్సిన అవసరం లేదన్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే లాక్‌డౌన్‌ను పరిమితం చేస్తూ సాధ్యమైనంత ఎక్కువగా పరీక్షలు నిర్వహించి బాధితులను గుర్తించాలన్నారు. ఈ రెండు, మూడు వారాల్లో కరోనా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయితే దేశంలో వైరస్ వ్యాప్తి నియంత్రణలోనే ఉందన్నారు. లాక్‌డౌన్ వల్ల దేశంలో కరోనా కేసులు 83 శాతం తగ్గుతాయని యూపీలోని శివనాడార్ వర్సిటీకి చెందిన పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

# దశలవారీగా ఎత్తివేత!

(మొదటిపేజీ తరువాయి)

ముగిశాక కూడా భౌతిక దూరం పాటించేలా రాష్ట్రాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కొన్ని రోజులుగా కరోనా కేసులు, మరణాలు పెరిగిన నేపథ్యంలో గురువారం ప్రధాని సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. "యావత్ జాతిని కలవరపరుస్తున్న కరోనాను నియంత్రించేందుకు రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి సమష్టిగా, సమర్థంగా పనిచేయడం ప్రశంసనీయం. రాజకీయాలకు అతీతంగా ఈ మహమ్మారిపై యుద్ధం చేద్దాం. మనం తీసుకున్న ముందస్తు జాగ్రత్త, వైద్య నిర్వహణ చర్యలతో అతి తక్కువ ప్రాణనష్టంతో బయటపడటమే మన ముందున్న ప్రధాన లక్ష్యం" అన్నారు. కరోనాపై యుద్ధంలో రాష్ట్రాలన్నీ తమ వంతు సహకారం అందిస్తున్నందుకు సీఎంలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాల వారీగా పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కరోనాపై యుద్ధంలో మత నాయకులను, వివిధ సంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో బయటపడిన కరోనా కేసులపై ఆరా తీశారు. ఔషధాలు, వైద్య పరికరాలు, అవసరమైన ముడి సరుకులను సమకూర్చుకోవాలని, అన్ని వైద్య సౌకర్యాలతో ఆస్పత్రులను సిద్ధం చేయాలన్నారు. వైద్యుల సంఖ్యను పెంచుకోవాలని, ఆయుష్ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లాస్థాయిలో విపత్తు నిర్వహణా బృందాలను ఏర్పాటు చేయాలని, జిల్లా సర్వైలెన్స్ అధికారులను నియమించాలన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా లాక్‌డౌన్ నుంచి వారికి కొన్ని మినహాయింపులు ఇస్తూనే, వ్యవసాయ పనుల సమయంలో రైతులు, కూలీలు భౌతిక దూరం పాటించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. పంటలను అమ్ముకోవడానికి మార్కెట్ కమిటీలే కాకుండా గ్రామాల్లో కూడా కొత్తగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరోనా కట్టడికి నిరంతరం తమతో సంప్రదింపులు జరుపుతూ, సూచనలిస్తూ సహకరిస్తున్నందుకు ప్రధానికి సీఎంలు కృతజ్ఞతలు తెలిపా రు. సరైన సమయంలో ధైర్యంగా లాక్‌డౌన్ నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. దీని వల్ల కరోనాను నియంత్రించగలుగుతున్నట్లు పలువురు సీఎంలు ప్రధానికి తెలిపారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, హర్షవర్ధన్, కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా, హోం, ఆరోగ్య శాఖల కార్యదర్శులు అజయ్ కుమార్ బల్లా, ప్రీతి సుడాన్, సీఎంలతో పాటు ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, హోం, ఆరోగ్య శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం ఉదయం 9 గంటలకు దేశ ప్రజలను ఉద్దేశించి ఓ చిన్న వీడియో సందేశాన్ని విడుదల చేయనున్నట్లు మోదీ ట్విటర్‌లో తెలిపారు.



బెంగళూరులో రోడ్డుపై కరోనా నినాదాలు

### లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు

లాక్‌డౌన్‌ను ఉల్లంఘించినా, విఘాతం కలిగించినా, దుష్ప్రచారం చేసినా.. కఠిన చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిపై విపత్తు నిర్వహణ చట్టం, భారత శిక్షాస్మృతి ప్రకారం కేసులు నమోదు చేయాలని రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ సూచించింది. చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష విధించేలా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాశారు. విపత్తు నిర్వహణ చట్టం-2005, భారత శిక్షాస్మృతి సెక్షన్ 188 ప్రకారం లాక్‌డౌన్‌కు ఎవరైనా విఘాతం కలిగిస్తే రెండేళ్ల జైలు శిక్షకు అర్హులని, దుష్ప్రచారం చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానాకు అర్హులవుతారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల అమలు స్థితిపై సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉన్న నేపథ్యంలో చేపట్టిన చర్యలను 7వ తేదీలోగా వివరాలు అందించాలని రాష్ట్రాలకు సూచించారు.

### మతపరమైన కార్యక్రమాలు వద్దు
**ఠాక్రే సూచనకు మోదీ సమర్థన**

కరోనా నేపథ్యంలో మతపరంగా భారీస్థాయిలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలను వివిధ మతపెద్దలు చేపట్టరాదంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే చేసిన సూచనను ప్రధాని మోదీ అంగీకరించారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని మోదీ గురువారం వివిధ రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిజాముద్దీన్‌లో తబ్లీగీ జమాత్ నిర్వహిం చిన మతపరమైన కార్యక్రమానికి మహారాష్ట్ర నుంచి హాజరైన వారందరినీ గుర్తించి క్వారంటైన్ చేశామని ఠాక్రే తెలిపారు. లాక్‌డౌన్ వ్యవధి ముగిసిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలంటూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానిని అడిగారు. ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న స్థానిక పరిస్థితులను బట్టి దశలవారీగా లాక్‌డౌన్‌ను ఎత్తివేయాలని ప్రధాని సూచించినట్లుగా మహారాష్ట్ర సీఎంవో ఒక ప్రకటనలో తెలిపింది.

# ఒక్కరోజే 400కు పైగా కేసులు

- దేశంలో కరోనా బాధితుల సంఖ్య 2360కి
- వైరస్ కారణంగా 73 మంది మృత్యువాత
- నేటి ఉదయం ప్రధాని వీడియో సందేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: దేశంలో కరోనా కేసుల సంఖ్య 2360కి చేరింది. ఢిల్లీలో జరిగిన తబ్లీగే జమాత్ ప్రార్థనలకు వెళ్లినవారందరికీ వైద్యపరీక్షలు చేయిస్తుండడంతో.. గురువారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా 400కు పైగా పాజిటివ్ కేసులను నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 328 కరోనా పాజిటివ్ కేసులను గుర్తించామని, దీంతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 1965కు చేరిందని, 12 మరణాలు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. అయితే, వివిధ రాష్ట్రాలు ప్రకటిస్తున్న సంఖ్యలను బట్టి పాజిటివ్ కేసుల సంఖ్య 400 దాటింది. వీటిలో ఎక్కువ భాగం మర్కజ్ ప్రార్థనలకు హాజరైనవారివేనని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వైరస్ కారణంగా 14 మంది మృతి చెందడంతో మృతుల సంఖ్య 73కు చేరింది. శుక్రవారం ఉదయం ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ ఒక వీడియో సందేశం ఇస్తారని కేంద్ర హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. ఎయిమ్స్ సీనియర్ వైద్యుడు సహా దేశవ్యాప్తంగా 50 మంది వైద్యులు, నర్సులు, పారామెడిక్స్‌కు కరోనా సోకినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. దేశవ్యాప్తంగా గురువారం పలు చోట్ల వైద్యులపై, సామాజిక సేవకులపై, పోలీసు సిబ్బందిపై దాడులు జరిగాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వైద్య సిబ్బందిపై దాడి చేసిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వైరస్ పాజిటివ్‌గా తేలిన వ్యక్తి కుటుంబసభ్యులను, బంధువులను క్వారంటైన్‌కు తరలించేందుకు వెళ్లిన వైద్య సిబ్బందిపై వారు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు మహిళా వైద్యులకు గాయాలయ్యాయి. ఈ దాడి తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బిహార్‌లోని ముంగర్‌లో వైద్యపరీక్షల నిమిత్తం శాంపుల్స్ తీసుకోవడానికి వెళ్లిన వైద్య సిబ్బంది, పోలీసులపై దాడి జరిగింది. బెంగళూరులో ఆశా వర్కర్లపై దాడి జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో కరోనా అనుమానిత లక్షణాలతో క్వారంటైన్‌లో చికిత్స పొందుతున్న 40 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేశంలో సమూహ వ్యాప్తి (కమ్యూనిటీ స్ప్రెడ్) ఇంకా లేనప్పటికీ కరోనా కేసులు అధికంగా ఉన్న 20 హాట్‌స్పాట్‌లను.. ఆ ముప్పు ఎక్కువగా ఉన్న మరో 22 హాట్‌స్పాట్లను కేంద్రం గుర్తించింది. ఉదాహరణకు.. ఢిల్లీలో తబ్లీగే జమాత్ ప్రార్థనలు జరిగిన నిజాముద్దీన్ దర్గా ప్రాంతం. రాజస్థాన్‌లో అత్యధిక కరోనా పాజిటివ్ కేసులు నమోదైన భిల్వారా ప్రాంతాన్ని కూడా హాట్‌స్పాట్‌గా ప్రకటించారు. దేశవ్యాప్తంగా వైరస్ విస్తృతిని అడ్డుకోవడానికి, వైరస్ బారిన పడినవారిని గుర్తించి వైద్యం చేయించడానికి భారీగా మానవవనరులు అవసరమవుతాయని రాష్ట్రప్రభుత్వాలకు ఇచ్చిన మార్గదర్శకాల్లో పేర్కొంది.


పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

### హాట్‌స్పాట్‌లలో యాంటీబాడీ టెస్టులు

కరోనా ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో(కరోనా హాట్‌స్పాట్‌లు) నివసించే ప్రజలకు పెద్ద ఎత్తున యాంటీబాడీ పరీక్షలు నిర్వహించాలని ఐసీఎంఆర్ సూచించింది. ఈ పరీక్షల ద్వారా వ్యక్తుల రోగ నిరోధక శక్తిని అంచనా వేస్తారు. శరీరంలో ప్రతినిరోధకాల స్థాయిని గుర్తిస్తారు.

### ప్రణాళిక లేకుండా లాక్‌డౌనా?: సోనియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళిక లేకుండా దేశమంతటా లాక్‌డౌన్ విధించి లక్షలాది మంది వలస కార్మికులను, సామాన్య ప్రజానీకాన్ని కేంద్రప్రభుత్వం ఎనలేని ఇక్కట్ల పాల్జేసిందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తీవ్రంగా విమర్శించారు. 'ఆహారం, నిలువ నీడ లేకుండా లక్షల మంది పేద ప్రజలు నడిచిపోతూండ డం చూస్తుంటే గుండె తరుక్కుపోతోం ది. ఇది కేంద్ర సర్కారు వైఫల్యమే' అని ఆమె దుయ్యబట్టారు. దేశంలోని వలస కార్మికులందరికీ కనీస ఉమ్మడి సహాయ కార్యక్రమాన్ని అమలు చేయాలని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సోనియా డిమాండ్ చేశారు.

**రాజకీయం వద్దు: షా**

రాజకీయాలు మాని జాతి హితం గురించి కాంగ్రెస్ ఆలోచించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హితవు పలికారు. 'మోదీసర్కారు చర్యలను దేశం, ప్రపంచం శ్లాఘించాయి. కాంగ్రె స్ మాత్రం తప్పుబడుతోంది. 130 కోట్ల ప్రజానీకం వైరస్‌ను జయించాలన్న కృతనిశ్చయంతో ఉంది. కాంగ్రెస్ మాత్రం చిల్లర రాజకీయాలు చేస్తోంది' అని షా ట్వీట్ చేశారు.

వరల్డోమీటర్ ప్రకారం గురువారం రాత్రి 11.30 గంటలకు..

| ప్రభావిత దేశాలు | అమెరికా | ఇటలీ | చైనా | స్పెయిన్ | జర్మనీ | ఇరాన్ | బ్రిటన్ | ఇండియా | ప్రపంచం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| గురువారం నమోదు | 20,744 | 4,668 | 35 | 6,120 | 6,283 | 2,875 | 4,244 | 343 | 64,971 | 27 | 38 |
| మరణాలు | 5,620 | 13,915 | 3,318 | 10,096 | 1074 | 3,160 | 2,921 | 68 | 51,354 | 09 | 0 |
| బాధితులు | 2,35,747 | 1,15,242 | 81,589 | 1,10,238 | 84,264 | 50,468 | 33,718 | 2,341 | 10,00,168 | 154 | 149 |

# 10లక్షలు దాటిన కరోనా కేసులు

**ప్రపంచవ్యాప్తంగా 51 వేలు దాటిన మృతుల సంఖ్య.. ఇటలీ, స్పెయిన్ దేశాల్లో కొవిడ్-19 మరణ మృదంగం**

లండన్, మెల్‌బోర్న్, ఏప్రిల్ 2: ఎక్కడో చైనాలోని వూహాన్‌లో పుట్టి.. ఒకరి తర్వాత మరొకరికి సోకుతూ.. ప్రపంచదేశాలన్నింటికీ విస్తరించిన కరోనా వైరస్ ఏకంగా పది లక్షల మందికి సోకింది! ప్రపంచవ్యాప్తంగా విలయ తాండవం చేస్తోంది. మరీ ముఖ్యంగా.. యూరప్ ఖండాన్ని అతలాకుతలం చేస్తోంది. అందునా.. ఇటలీ, స్పెయిన్ దేశాల్లో మరణ మృదంగం మోగిస్తోంది. గురువారం నాటికి నమోదైన 10 లక్షల కేసుల్లో ఐదు లక్షలకు పైగా కేసులు ఒక్క యూరప్ ఖండంలోనే నమోదయ్యాయి. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి 11.30 గంటలకు కరోనా మృతుల సంఖ్య 51 వేలు దాటింది. వారిలో దాదాపు 35 వేల మంది యూరప్‌వాసులే. కరోనా మరణాల్లో సగానికిపైగా.. ఇటలీ, స్పెయిన్ దేశాల్లోనే నమోదయ్యాయి. ఇటలీలో కరోనాకు బలైనవారి సంఖ్య 13,155కు చేరగా, స్పెయిన్‌లో 10 వేలు దాటింది. ఒక్క గురువారమే 616 మంది కరోనా బాధితులు స్పెయిన్‌లో ప్రాణాలు కోల్పోయారు. స్పెయిన్ తర్వాత అత్యధికంగా యూకేలో ఒక్క రోజే 569 మంది, బెల్జియంలో 183 మంది చనిపోయారు. బెల్జియంలో మృతుల సంఖ్య మూడు రోజుల్లో రెట్టింపు కావడం గమనార్హం. నెదర్లాండ్స్‌లో ఒక్కరోజులో 166 మంది, స్వీడన్‌లో 43, జర్మనీలో 28, పోర్చుగల్‌లో 22, స్విట్జర్లాండ్‌లో 17 మంది చనిపోయారు. యూరప్‌లో సంభవిస్తున్న మరణాల్లో 95 శాతం 60 ఏళ్ల పైబడినవారివేనని, ఆ 95 శాతంలో కూడా సగం మంది 80 ఏళ్లు దాటినవారేనని యూరప్‌లోని ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యాలయం ప్రకటించింది. అదేసమయంలో యువత కూడా ఈ వైరస్ బారిన పడుతున్నారని అభిప్రాయపడింది. ఇరాన్‌లో.. ఇజ్రాయెల్‌లో.. ఇరాన్‌లో కూడా గురువారం ఒక్కరోజే 124 మంది చనిపోయారు. అక్కడ మృతుల సంఖ్య 3,160కి పెరిగిం ది. ఇజ్రాయెల్ ఆరోగ్య మంత్రికి కూడా కొవిడ్-19 సోకింది. ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కొద్దిరోజులుగా స్వీయ ఐసోలేషన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ప్రపంచం మొత్తమ్మీదా అత్యధికంగా కరోనా పరీక్షలను చేస్తున్న దేశం తమదేనని ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ ప్రకటించారు. ఆస్ట్రేలియాలో 5137 మందికి వైరస్ సోకగా 25 మంది మరణించారు. కొవిడ్-19పై పోరులో భాగంగా రూపొందించిన రెండు టీకాలను ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞులు పరీక్షిస్తున్నారు. వీటిని ఇంజెక్షన్ రూపంలో ఇవ్వాలా లేక నేరుగా ముక్కులోకి చల్లుకునే 'నేసల్ స్ప్రే' రూపంలో ఇవ్వాలా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. టీకా పరీక్షలు మూడు నెలలపాటు కొనసాగనున్నాయి. చైనాలో విదేశాల నుంచి వచ్చిన 35 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. కాగా, 90కి పైగా దేశాలు లాక్‌డౌన్‌లో ఉన్నాయి. కరోనా వైరస్ చైనాకు ఆనుకునే ఉన్న ఉత్తర కొరియాలో అడుగుపెట్టలేకపోతోంది! ఆ దేశంలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదట.



### దయ చూపొద్దు.. దాడులు చేయండి: ఐఎస్

న్యూయార్క్, ఏప్రిల్ 2: ప్రపంచమంతా కరోనాకు భయపడుతోంది! కానీ ఇస్లామిక్‌స్టేట్ (ఐఎస్), అల్‌కాయిదా వంటి ఉగ్రవాద సంస్థలు మాత్రం.. ఈ మహమ్మారిని ఒక అవకాశంగా చూస్తున్నాయి. ఆయా గ్రూపులకు చెందిన ఉగ్రవాదులు.. 'ఈ వైరస్ ముస్లిమేతరులకు శిక్ష' అని సందేశాలు వెలువరిస్తున్నారు. క్వారంటైన్‌లో ఉన్న ముస్లిమేతరులంతా ఇస్లాం గురించి తెలుసుకోవడం ద్వారా ఈ సమయాన్ని వినియోగించుకోవాలని అల్‌కాయిదా ఒక ప్రకటనలో పేర్కొంది. ఎవరిపైనా దయ చూపవద్దని.. దాడులు చేయాలని ఐఎస్ సంస్థ గత నెల రెండో వారంలో ప్రచురించిన అల్-నబా అనే న్యూస్‌లెటర్ ద్వారా తన శ్రేణులకు పిలుపునిచ్చింది. మార్చి మధ్యలో ఇస్లామిక్‌స్టేట్ గ్రూపు చాద్ సైన్యంపై భీకర దాడి చేసింది. నైజీరియా-నిగర్ సరిహద్దులకు సమీపంలో 92 మంది సైనికుల ప్రాణాలను బలిగొంది. ఈజిప్టులో ఐఎస్ దాడులు పెరిగినట్లు అక్కడి సైనికాధికారులు తెలిపారు.

## భయం 'కరోనా'

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతున్నా.. అందుకు తగ్గ వైద్య సామగ్రి లభించడం లేదు. వైరస్ నుంచి కాపాడటంలో కనీస అవసరమైన మాస్కులే కాదు.. ప్రాణాలు నిలిపే వెంటిలేటర్లకూ తీవ్ర కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఉత్పత్తి పెంచాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థించారు. కరోనాతో కనెక్టికట్‌లో ఆరు వారాల వయసున్న శిశువు మృతి చెందింది. అమెరికాలో వైరస్‌తో చనిపోయిన వారిలో అతి పిన్న వయసు ఈ శిశువుదే. కరోనా తీవ్రంగా ఉన్న న్యూయార్క్‌లో 16 వేల మంది వరకు చనిపోవచ్చని రాష్ట్ర గవర్నర్ ఆండ్రూ ఖుమో ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇక్కడ 1500 మంది వరకు మరణించారు. కరోనాను చైనీస్ వైరస్‌గా అభివర్ణించిన ట్రంప్.. తాజాగా చైనాలో మరణాల సంఖ్య, కేసులపై అనుమానం వ్యక్తం చేశారు. చైనా వాస్తవాలు దాస్తోందని మండిపడ్డారు. దక్షిణ అమెరికా దేశాలన్నీ నిరాకరించినప్పటికీ నెదర్లాండ్స్‌కు చెందిన నౌకను ఫ్లోరిడా తీరంలో నిలిపేందుకు ఆయన అనుమతిచ్చారు. భారత్‌లో లాక్‌డౌన్‌తో చిక్కుకున్న అమెరికన్లను తిరిగి పంపే ప్రయత్నాలు మొదలయ్యాయి. విమాన వాహక యుద్ధనౌక రూజ్‌వెల్ట్‌లో వంద మంది నావికులకు కరోనా వైరస్ సోకడంతో అనుమానంతో మూడు వేల మందిని దించేశారు. నౌకలో మొత్తం 5000 మంది నావికులు ఉన్నారు. హ్యూస్టన్‌లో ముగ్గురు భారతీయ అమెరికన్లు కొవిడ్ బారినపడ్డారు. వీరిలో ఓ వైద్యుడు కూడా ఉన్నారు.

## కువైత్ ప్రధానికి మోదీ ఫోన్

(గల్ఫ్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

కరోనా రక్కసిపై పోరులో తీసుకోవాల్సిన చర్యలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం కువైత్ ప్రధాని షేక్ ఖాలీద్ అల్ సభాకు ఫోన్ చేసి చర్చించారు. వైరస్ వ్యాప్తి నిర్మూలనకు ఇరు దేశాలు తీసుకోవాల్సిన చర్యలు, పరస్పర సహకారంపై ఇరువురు నేతలు చర్చించారని కువైత్ ప్రభుత్వం వెల్లడించింది. కరోనా నిర్మూలనతో పాటు ఇతర ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చాయి. కువైత్‌లో సరైన వీసాల్లేకుండా ఉంటున్న విదేశీయులందరితో పాటు భారతీయులు కూడా స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోవడానికి కువైత్ ప్రభుత్వం ఆమ్నెస్టీ పథకం ప్రకటించిన రోజే కువైత్ ప్రధానికి మోదీ ఫోన్ చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది.

### మక్కా, మదీనాల్లో ఒకరోజు కర్ఫ్యూ

కరోనా వ్యాప్తి నేపథ్యంలో.. మక్కా, మదీనా నగరాల్లో ఒకరోజు కర్ఫ్యూ విధిస్తూ గురువారం సౌదీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఆహార సరఫరా, ఆరోగ్యం తదితర కీలక రంగాల్లో పనిచేసే వారికి మాత్రం కర్ఫ్యూ నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది.

### కార్గో రవాణాకు ఏఐ ప్రత్యేక విమానాలు

కరోనా కారణంగా భారత్‌లో ఆగిపోవాల్సి వచ్చిన బ్రిటన్ వాసుల్ని వారి స్వదేశానికి తరలించేందుకు లండన్‌కు ప్రత్యేక విమానాల్ని నడపాలని ఎయిర్ ఇండియా (ఏఐ) నిర్ణయించింది. ఈ శనివారం నుంచి ఏడో తేదీ వరకూ నాలుగుసార్లు విమానాలు తిరగనున్నట్లు ప్రకటించింది. అయితే.. అక్కడ చిక్కుకుపోయిన భారతీయుల్ని వెనక్కి తీసుకురావడం లేదని.. తిరుగుప్రయాణంలో విమానాలు ఖాళీగా వస్తాయని ఏఐ తెలిపింది.

### హరియాణాలో చూయింగ్ గమ్ బ్యాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కరోనా వ్యాప్తిని కట్టడి చేయడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చూయింగ్ గమ్ అమ్మకాలపై హరియాణా ప్రభుత్వం నిషేధం విధించింది. చూయింగ్ గమ్‌ను నమిలి, పారేస్తే కరోనా వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అలాగే, నిరుడు సెప్టెంబరులో విధించిన గుట్కాపై నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించింది.

### అత్యవసర సేవల జాబితాలో అంగన్‌వాడీ, ఆయుష్

లాక్‌డౌన్ నుంచి మరికొన్ని సేవలు, ఉత్పత్తులకు కేంద్ర హోంశాఖ మినహాయింపు ఇచ్చింది. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు అంగన్‌వాడీ, ఆయుష్ విభాగాలను అత్యవసర సేవల జాబితాలో చేర్చారు. ఆయా విభాగాల సిబ్బంది, రవాణాకు సంబంధించి ఎలాంటి ఆంక్షలు ఉండబోవని కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా గురువారం ప్రకటించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఆయన లేఖ రాశారు.

### 'ఉబెర్'లో 'బిగ్‌బాస్కెట్' హోండెలివరీ

లాక్‌డౌన్ వేళ ప్రజలకు నిత్యవసరాలను ఇంటివద్దకే అందించే ఉద్దేశంతో రెండు దిగ్గజ సంస్థలు చేతులు కలిపాయి. క్యాబ్ దిగ్గజం ఉబెర్.. సూపర్ మార్కెట్ దిగ్గజం బిగ్‌బాస్కెట్‌తో జతకలిసింది. బిక్‌బాస్కెట్‌కు వచ్చిన సరుకుల ఆర్డర్లను ఉబెర్ ప్రజల ఇళ్లకు చేరుస్తుంది. ఇందుకుగాను ఉబెర్.. బైకులు, కార్లు ఏర్పాటు చేసింది. లాక్‌డౌన్ సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేసేందుకే తాము బిగ్‌బాస్కెట్‌తో కలిసి పనిచేస్తున్నామని, ఇందుకుగాను ఎలాంటి సర్వీస్ చార్జీ వసూలు చేయడం లేదని ఉబెర్ సౌత్ ఏషియా డైరెక్టర్ ప్రభ్‌జీత్‌సింగ్ తెలిపారు.

### అవగాహన లేమి, వలస కార్మికులే సమస్య

కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టే క్రమంలో ప్రజల్లో అవగాహన లేమి, వలస కార్మికులు ప్రధాన సమస్య అని దేశవ్యాప్తంగా యువ ఐఏఎస్‌లతో కేంద్ర శిక్షణ శాఖ నిర్వహించిన సర్వే స్పష్టం చేసింది. దీంతోపాటు.. ఆస్పత్రుల సన్నద్ధత, వనరులు, క్వారంటైన్/ఐసోలేషన్ సదుపాయాలు, తగినన్ని వ్యాధి నిర్ధారణ కేంద్రాలు లేకపోవడం, వైద్యులు/సిబ్బందికి రక్షణ దుస్తుల లేమి, విదేశాల నుంచి వచ్చిన వారి ట్రాకింగ్ లేకపోవడం వంటివి కూడా సమస్యలుగా ఉన్నాయని వెల్లడైంది. ఈ సర్వేలో 410 జిల్లాల్లో పనిచేస్తున్న 2014-18 మధ్య బ్యాచ్‌లకు చెందిన యువ ఐఏఎస్‌లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### క్వారంటైన్ నుంచి పరారీ.. మళ్లీ దొరికిన 15 మంది

ముంబై, ఏప్రిల్ 2: మహారాష్ట్రలో పుణెకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 15 మంది హోం క్వారంటైన్ నుంచి తప్పించుకొన్నారు. ఎట్టకేలకు పోలీసులు వారిని గుర్తించి ప్రభుత్వ క్వారంటైన్‌కు తరలించారు. తమ బంధువు అంత్యక్రియలకు హాజరు కావడానికి వారందరూ గత నెల 22న ఉస్మానాబాద్ జిల్లాకు వెళ్లారు. అనంతరం దేశమంతా లాక్‌డౌన్ ప్రకటించడంతో ఉస్మానాబాద్‌లోనే హోం క్వారంటైన్‌లో ఉండాలని చెబుతూ అధికారులు వారి చేతులపై క్వారంటైన్ ముద్ర వేశారు. కొద్ది రోజులు ఉస్మానాబాద్‌లో గడిపిన అనంతరం పుణెకు వెళ్లేందుకు వారు అనుమతి కోరగా అధికారులు తిరస్కరించారు. మంగళవారం రాత్రి ఓ మినీ బస్సును అద్దెకు మాట్లాడుకొని, ఉస్మానాబాద్ నుంచి తప్పించుకొన్నారు. ముంబై-పుణె హైవేలో వాడ్‌గావ్ దగ్గర పోలీసులు ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారని, వారిని ప్రభుత్వ క్వారంటైన్‌కు తరలించామని అధికారులు తెలిపారు.

## దయతో ఆదుకోండి



ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎం జగన్

(మొదటి పేజీ తరువాయి)

తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి జగన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కోవిడ్-19 నివారణకు చేపడుతున్న చర్యలను వివరించారు. కేంద్రం ఎప్పటికప్పుడు చేస్తున్న సలహాలూ సూచనలు పాటిస్తూ వైరస్ కట్టడి చర్యలు చేపడుతున్నామని అన్నారు. పాజిటివ్ వచ్చిన రోగులను గుర్తిస్తున్నామని.. వారికి చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలను పెంచామన్నారు. రాష్ట్రంలోకి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 27,896 మంది విదేశాల నుంచి వచ్చారని.. వారితో 80,896 మంది కాంటాక్టు అయినట్లు గుర్తించామని.. వీరికోసం, వైరస్ వారిని గుర్తించడానికి ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. గ్రామ/వార్డు వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో రెండు దఫాలుగా సర్వే నిర్వహించామని చెప్పారు. నిజాముద్దీన్‌లో జరిగిన తబ్లీగీ జమాత్‌లో రాష్ట్రానికి చెందిన 1,085 మంది పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రంలో 132 కరోనా వైరస్ పాజిటివ్ కేసులుంటే.. ఇందులో జమాత్‌లో పాల్గొన్నవారే 111 మంది ఉన్నట్లు చెప్పారు. ఇది మినహా రాష్ట్రంలో పరిస్థితి నియంత్రణలో ఉందన్నారు. వైద్య సేవల విషయంలో యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. మెడికల్ టెస్ట్ కిట్‌లను త్వరగా పంపిణీ చేయాలని ప్రధానిని కోరారు. లాక్‌డౌన్ అమలుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులకు ఏప్రిల్ నెల రేషన్‌తో పాటు కిలో కందిపప్పును కూడా ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. 1.40 కోట్ల మంది బీపీఎల్ కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశామన్నారు. రైతు బజార్లను వికేంద్రీకరించామని.. ధరలు పెరగకుండా నిత్యావసర దుకాణాల వద్ద ధరల పట్టికలు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 213 సహాయ, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 9,695 మంది ఉన్నారని తెలిపారు. వీటికి అధిక వ్యయం కావడంతో మార్చి నెలలో ఉద్యోగుల జీతాలను 50 శాతం కుదించి ఇస్తున్నట్లు చెప్పారు. అకస్మాత్తుగా వ్యయం పెరగడంతో ఖజానా ఖాళీ అయిందన్నారు. ఈ తరుణంలో కేంద్రం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని.. నిరంతరం దిశానిర్దేశం చేయాలని, ఆర్థికంగానూ.. మెడికల్ టెస్ట్ కిట్ల పంపిణీ ద్వారా ఆదుకోవాలని ప్రధానిని జగన్ అభ్యర్థించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



Telegram
NEWS PAPERS
తెలుగు
GET IT ON
Google Play
Daily Telugu Pap...
17.9K subscribers
@venkey99
Eenadu_Ap_02-0
pdf
13.4 MB PDF
Eenadu_Ts_02-0
df
Telugu Magazine'...
10.8K subscribers
Ap Distri
5.8K subsc
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
Eenadu_ANANTAPUR★_
02-04-2020.pdf
3.8 MB PDF
The Hindu Hyderabad
02.04.2020.pdf
10.8 MB PDF
The Hindu Delhi
"నమస్కారం నా పెరు వెంకీ"
ఇక్కడ ఇచ్చిన ఫోటో లు లో వున్న చానల్స్ వున్నారా ?
లేక పొతే నా దగ్గర కాపీ కొట్టే వాడి ఛానల్ లో వున్నారా ?
మా చానెల్ కి రావాలి అనుకుంటే ఇదే పేజి లో ఎక్కడైన ప్రెస్ చేస్తే మా ఛానల్ కి వస్తారు !